ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

తాడేపల్లిగూడెం

fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

3-7-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 153 పేజీలు: 8+4 వెల: 6.50

బండరాళ్లు పడి 8 మంది కూలీలు మృతి

5లో

శరద్ పవార్ ఎన్సీపి కాంగ్రెస్‌లో విలీనం?

# 'జీ రామ్ జీ'తో అభివృద్ధి వెల్లువ

## దేశ వ్యాప్తంగా ప్రతిష్టాత్మక కార్యక్రమం ఎపిలో శ్రీకారం

## స్వర్ణగిరితో స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చుతాం: సిఎం చంద్రబాబు

## కేంద్రం నుంచి రూ. 7,700 కోట్లు, రాష్ట్రం నుంచి మరో రూ. 4వేల కోట్లు వ్యయం

## ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, డిసిఎం పవన్



గురువారం మొక్కవారిపల్లిలో జరిగిన విబి జీ రామ్ జీ కార్యక్రమానికి హాజరైన కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్ తదితరులు

**ఓబులవారిపల్లి (తిరుపతిజిల్లా),జులై 2 ప్రభాత వార్త:** దేశవ్యాప్తంగా అమలయ్యే ఓ ప్రతిష్టాత్మక కార్యక్రమం విబి జీ రామ్ జీ పథకం తిరుపతి జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి నుండి ప్రారంభమైంది. విబి జీ రామ్ జీ పథకం రైల్వే కోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలం మొక్క వారి పల్లి మంగంపేట ప్రాంతం నుంచే ఆవిష్కృతం కావడం శుభపరిణామమని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. గురువారం విబి జీ కార్యక్రమానికి కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, సిఎం చంద్రబాబునాయుడు, డిసిఎం పవన్‌కల్యాణ్ >>2

## అమరావతిని కాదంటే జగన్నాథ రథచక్రాల్లో నలిగిపోతారు..

### - సిఎం చంద్రబాబు

**ఓబులవారిపల్లి(తిరుపతికలెక్టరేట్),జులై 02 ప్రభాతవార్త:** ఆరు నూరైనా ఆంధ్రప్రదేశ్‌కు అమరావతియే రాజధాని అని ,ఎవరైనా కాదంటే వారు జగన్నాథ రథచక్రాల్లో నలిగిపోవాల్సిందేనని సిఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం ముక్క వారి పల్లి గ్రామంలో జరిగిన బహిరంగ సభలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అజీవీక మిషన్ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌కు దేవతల రాజధాని అమరావతి నేనని ఘంటపదంగా నొక్కి చెప్పారు. >>2



గురువారం న్యూఢిల్లీలో ప్రధాని మోదీతో భేటీ అయిన జపాన్ ప్రధాని సనాయే తకైచి

## ఎఐ, రక్షణలో ద్వైపాక్షిక బంధం

### జపాన్‌తో పలు కీలక ఒప్పందాలు

### ఇద్దరు పిఎంలు మోదీ, తకైచి సమక్షంలో సంతకాలు

### వచ్చే పదేళ్లలో 10 ట్రిలియన్ యెన్‌ల జపాన్ పెట్టుబడులు

**న్యూఢిల్లీ, జులై 2:** కృత్రిమ మేధస్సు (ఎఐ), రక్షణ, ఆర్థిక భద్రత, ఔషధ రంగం, స్వచ్ఛ ఇంధనం వంటి రంగాలలో భారత్- జపాన్ అనేక కీలక ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఈ మేరకు రాబోయే పదేళ్లలో ఇరు దేశాల మధ్య 10 ట్రిలియన్ యెన్ల (దాదాపు 6 లక్షల కోట్ల రూపాయలు) పెట్టుబడులు లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు భారత ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. దీంతో ఇండియా-జపాన్ మధ్య వ్యాపార, వాణిజ్య సంబంధాలు మెరుగుపడనున్నాయి. గురువారం న్యూఢిల్లీలోని హైదరాబాద్ భవన్‌లో ప్రధాని జపాన్ ప్రధాని >>2

# గ్రామీణాభివృద్ధిలో ఎపి టాప్

## రెండేళ్లలో 24 నుంచి మొదటి స్థానానికి వచ్చాం

## గ్రామాలకు ఆర్థిక ఊతం కొత్త పథకం: డి.సిఎం పవన్



**ఓబులవారిపల్లి (తిరుపతిజిల్లా), జులై 02 ప్రభాతవార్త :** గ్రామీణాభివృద్ధిలో దేశానికి ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలుస్తుందని, గత వైసిపి ప్రభుత్వంలో 24 స్థానంలో ఉన్న అభివృద్ధి, గత రెండేళ్ల కూటమి పాలనలో మొదటి స్థానానికి చేరుకుందని డిసిఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం ముక్క వారి పల్లి గ్రామంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్రసహాయ మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, కమలేష్ పాశ్వాన్ సమక్షంలో కార్యక్రమం జరిగింది.
ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ "జాతీయస్థాయి కార్యక్రమానికి రైల్వే కోడూరు నియోజకవర్గం వేదిక కావడం ఆనందంగా ఉందన్నారు.. ఇటీవల ఢిల్లీ పర్యటనలో శివరాజ్ సింగ్ చౌహాన్‌ని కలసి పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించాలని కోరిన వెంటనే ఒప్పుకున్నారన్నారు. రాజకీయంగా ఎంతో అనుభవం ఉన్న శివరాజ్ సింగ్ చౌహాన్ ఆధ్వర్యంలో గ్రామీణ భారతం కొత్తదశలోకి ప్రయాణించాలని, 2047 వికసిత్ భారత్ లో భారత దేశ గ్రామాలు అభివృద్ధితో కళకళలాడాలని కోరుకుంటున్నాను. గ్రామీణ భారత భవిష్యత్తుకు మిషన్‌గా విబి జీ రామ్ జీ పథకం ఉపయోగపడుతుందన్నారు. గతంలో ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కొత్తగా తెచ్చిన మార్పులు గ్రామాలకు ఆర్థిక ఊతం ఇస్తాయని, శ్రామికుల పని దినాలను వందరోజుల నుంచి 125 రోజులకు పెంచడం ద్వారా అదనంగా 25 రోజులు ఉపాధి భరోసా లభించిందన్నారు.. విబి జీ రామ్ జీ పథకంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం 7,700 కోట్లను కేటాయించిందని, రాష్ట్రం వాటాతో కలుపుకొంటే 12,845 కోట్లను పథకానికి ఖర్చుచేయనున్నామని తెలిపారు. ఇది భారతదేశంలోనే మూడవ అతిపెద్ద కేటాయింపు అని చెప్పొచ్చు. స్వచ్ఛ రథాల ద్వారా గ్రామీణ ఆంధ్రప్రదేశ్లో పారిశుధ్యం మెరుగుదలకు చైతన్యం కలిగించే కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు.
రైల్వే కోడూరు నియోజకవర్గం మైసూరావారిపల్లెలో గ్రామ సభ నిర్వహించినరోజే ఒకేసారి రాష్ట్రమంతటా 13,326 గ్రామ పంచాయతీలకు గ్రామసభలు నిర్వహించి గ్రామస్తులకు ఏం కావాలో వారిదగ్గరనుంచి తీర్మానాలు చేయించి పనులు చేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యక్రమంలో 24వ స్థానంలో అట్టడుగున ఉన్న రాష్ట్రాన్ని మొదటి స్థానానికి తీసుకువచ్చేలా పనిచేశామన్నారు. 2025లో జాతీయ పురస్కారాలను సాధించడంలో ఆంధ్రప్రదేశ్ రెండవ స్థానంలో నిలిచింది. అభివృద్ధి అంటే కేవలం పనులు చేయడమే కాదు ఆ పనులు చేసే శ్రామికుల జీవనానికి కూడా భరోసాఅందించే కార్యక్రమంకావాలి, అభివృద్ధిలో ఎపి ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు.

## ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ పెంపు జీవో జారీ

**విజయవాడ, జులై2, ప్రభాతవార్త ప్రతినిధి:** పిఎస్‌యూలు, కార్పొరేషన్లు, సొసైటీల ఉద్యోగులకు సంబంధించిన పదవీ విరమణ వయసుపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న 60 యేళ్ల పదవీ విరమణ వయసును 62 యేళ్లకు పెంచుతూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. గతంలో రాష్ట్ర మంత్రిమండలి ఆమోదించిన తీర్మానానికి అనుగుణంగా సర్కార్ ఈరోజు (గురువారం) ఉత్తర్వులు ఇచ్చింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఈ నిర్ణయం 2022 జనవరి 1 నుంచి రిట్రోస్పెక్టివ్‌గా అమలు కానుంది.
అలాగే, 60 యేళ్ల వయసులో పదవీ విరమణ పొందిన అర్హులైన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకునే అవకాశం ఉంది. మళ్లీ జాబ్‌లో చేరే వరకు ఉన్న గ్యాప్ పీరియడ్‌కు జీతం ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. గ్యాప్ పీరియడ్‌ను సీనియారిటీ, ప్రమోషన్ల కోసం పరిగణనలోకి తీసుకోరని పేర్కొంది. కోర్టు ఆదేశాల మేరకు 62 యేళ్ల వరకు పనిచేసిన ఉద్యోగులకు పూర్తి స్థాయి సర్వీస్ బెనిఫిట్స్ అందజేయాలని >>2



## వరద ముంపులో ముంబయి

### మహారాష్ట్రను కుదిపేస్తున్న భారీ వర్షాలు

### మ్యాన్‌హోల్‌లో పడి ఒకరు మృతి

**ముంబయి,జులై 2:** మహారాష్ట్ర రాజధాని ముంబైని భారీ వర్షాలు వణికిస్తున్నాయి. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నగర ప్రజలు అతలాకుతలం అవుతున్నారు. గడిచిన 24 గంటల్లో కొన్ని చోట్ల 200 మి.మీ.వర్షపాతం నమోదైంది. అనేక చోట్ల నీళ్ల నిలిచిపోయాయి. ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు ముంబైనగరంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి. దాదర్‌లోని హిందూ కాలనీ పరిసరాల్లో రోడ్లపై భారీగా వరద నీరు చేరి వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాలు, భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా రాష్ట్రంలోని పన్వేల్,ఉరాన్, పాల్ఘర్,రాయ్‌గఢ్ ప్రాంతాల్లో >>2



## 3 రోజులు వర్షాలు

**విజయవాడ, జులై2,ప్రభాతవార్తప్రతినిధి:** వాయువ్య బంగాళాఖాతం, ఒడిశాపశ్చిమ బెంగాల్ తీరప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడినట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. రాబోయే రెండు, మూడు రోజుల్లో అల్పపీడనం మరింత బలపడే అవకాశం ఉందన్నారు దీని ప్రభావంతో రానున్న మూడు రోజులు ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంటుందన్నారు,పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన పిడుగులు పడే అవకాశం తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు విచ్చే అవకాశం ఎక్కువ అన్నారు ఆ దృష్ట్యా ముందస్తు జాగ్రత్తగా మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్ళరాదు తెలిపారు. శుక్రవారం శ్రీకాకుళం, పోలవరం, కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గాలులకు విద్యుత్ వైర్లు తెగిపడే ప్రమాదం ఉంది.. జాగ్రత్తగా గమనిస్తూ దూరంగా ఉండాలిలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ హెచ్చరించారు.




గురువారం శ్రీసిటీ ఇంటర్నేషనల్ వర్సిటీ క్యాంపస్‌ను పరిశీలిస్తున్న మంత్రి లోకేష్

## శ్రీసిటీ ఇంటర్నేషనల్ వర్సిటీ ప్రారంభం

### విద్య, పరిశ్రమల అనుసంధానంతో వర్క్‌స్టడీ డ్యూయల్ మోడల్: మంత్రి లోకేష్

**శ్రీసిటీ, జులై 2, ప్రభాతవార్త:** శ్రీసిటీ ఇంటర్నేషనల్ యూనివర్శిటీని శ్రీసిటీలోని తాత్కాలిక క్యాంపస్‌లో రాష్ట్ర మానవవనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, రియల్ టైం గవర్నెన్స్ మంత్రి నారాలోకేష్ గురువారం ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐయు గ్లోబల్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యులు, పాలకమండలి ప్రతినిధులు, పరిశ్రమ భాగస్వాములు పాల్గొన్నారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మంత్రి, అతిధులకు సాదర స్వాగతం పలికారు. ఈ >>2

# వైకాపా అక్రమాలు సహించం

### సుప్రీం కోర్టు ఆదేశాలు సైతం బేఖాతరు

### చెరువులు తవ్వరాదనే నిబంధనకు పాతర

### అశోక్ గజపతి భూములు అన్యాయంగా ఆక్రమణ

### వైకాపాపై చట్టపరమైన చర్యలు: మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కిమిడి నాగార్జున



గురువారం మీడియాతో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**విజయనగరం, జులై 2 ప్రభాతవార్త:** సుప్రీంకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ చెరువులను తవ్వకూడదని నిబంధనలను తుంగలోకి తొక్కి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రైవేటు స్థలంలో పార్టీ కార్యాలయం నిర్మించడం పట్ల రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విస్మయం వ్యక్తం చేశారు. గురువారం నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో పలు విషయాలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. విజయనగరం ప్రజలు ఎర్ర చెరువుగా పిలుచుకునే అశోక్‌కి చెందిన భూమి పత్రాలను వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉండగా ఒక ఎమ్మార్వో చేత రికార్డులు తారుమారు చేయించి ఆర్డిఒ ద్వారా అప్రూవల్ చేయించి కలెక్టర్ నుండి ఆమోదం పొందారన్నారు.
రికార్డులు తారుమారు చేయటం, ఉద్యోగస్తులను భయ పెట్టటం, అక్రమాలకు పాల్పడటం, లిక్కర్ వ్యాపారాలు వంటివి చేయడం వైకాపా నాయకులకు వెన్నతో పెట్టిన విద్య వంటిది. సంబంధిత భూమికి ప్లాన్ అప్రూవల్ రాకుండానే నిర్మాణం చేపట్టినట్లు మంత్రి కొండపల్లి పేర్కొన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ప్రత్యేక నివేదిక అందజేస్తున్నామని చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వెనకాడబోమని తేల్చి చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో మెడికల్ కాలేజీ, మహారాజా కాలేజీలలో పేద విద్యార్థులకు తక్కువ ఫీజులకే విద్యను అందించడం, పిడబ్ల్యూడి మార్కెట్, రైతు బజారులలో అతి తక్కువ ధరలకు షాపులు అద్దెకి ఇచ్చిన ఘనత అశోక్‌కి దక్కుతుందన్నారు. ఎంతో చరిత్ర, మంచి వ్యక్తిత్వం కలిగిన ఉత్తరాంధ్ర ఐకాన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మంత్రిగా, ఎంపీగా, కేంద్ర రాష్ట్ర మంత్రులుగా పని చేసిన ప్రస్తుత గోవా గవర్నర్ అశోక్‌ని బాధపెట్టడం విచారకర >>2



గురువారం మేకవానిపాలెంలో విబి జీ రామ్ జీ కార్యక్రమంలో కూలీలతో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

# జనవరికి బందరు పోర్టు పూర్తి

### పోర్టు ఆధారిత పరిశ్రమలు కూడా ఏర్పాటు

### ఇప్పటిదాకా రూ. 65 వేల కోట్ల పెన్షన్లు ఇచ్చాం: మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,జులై2,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు పెంచడంతోనే అభివృద్ధి సాధ్యమనిమేకవానిపాలెంలో విబి జీ రామ్ జీ కార్యక్రమం ప్రారంభోత్సవంలో మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గత ఐదు సంవత్సరాలు ఉపాధి హామీ పథకాన్ని కూడా తాకట్టు పెట్టారన్నారు. ఉపాధి హామీలో 32 కార్యక్రమాలను చేర్చిన ఘనత చంద్రబాబు నాయుడు గారిదే అన్నారు. >>2

## కారు బోల్తా: ఇద్దరు మహిళల మృతి

**విశాఖపట్నం, జులై 2 ప్రభాతవార్త:** వివాహ వేడుక నుంచి తిరిగివస్తుండగా విషాదం చోటుచేసుకుంది. అప్పటివరకు బంధువులతో సరదాగా గడిపిన కుటుంబంలో ఊహించని సంఘటన చోటుచేసుకుంది. వివాహ వేడుకకు హాజరైకుటుంబం అనకాపల్లినుంచి విశాఖకు వస్తుండగా కూర్మన్నపాలెం సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కనవున్న గోతిలోపడిపోయింది. ఈ ప్రమాదంలో మంగ (18) అక్కడికక్కడే మృతిచెందగా, కుసుమ (46) ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. విజయలక్ష్మి (56),తాన్వీ (7), డ్రైవర్ బాల మురళీ కృష్ణకు గాయాలు కావడంతో సమీపఆస్పత్రికి తరలించారు.



గురువారం తిరుమల ఆలయంలో ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న డిసిఎం పవన్

## శ్రీవారిని దర్శించుకున్న డిసిఎం పవన్

**తిరుమల,జూలై 2ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అంతా శుభాలు కలగాలని, ఈ రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందాలని వేడుకున్నట్లు ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ తెలిపారు. ఆలయంలోపల ఎన్నో ఆపన్న వ్యాధుల పథకానికి లక్ష రూపాయలు విరాళం అందజేశారు. ఇప్పటికే ఆదేశ దీక్షలో ఉన్న పవన్ గురువారం మధ్యాహ్నం తిరుపతి జిల్లా రైల్వేకోడూరు ఓబులవారిపల్లిలో అధికారిక కార్యక్రమం ముగిసిన అనంతరం నేరుగా తిరుమలకు వచ్చారు. సాయంత్రం ఆయన ప్రత్యేక సమయంలో ఆలయంలోనికి చేరుకున్నారు. తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలోనికి చేరుకుని ఏడుకొండల స్వామిని దర్శించుకున్నారు.కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేసి స్వామి వారి చిత్రపటంతోపాటు తీర్థప్రసాదాలు అందజేశారు.

## బందరు పోర్టు పూర్తి

>> జనవరి నాటికి బందరు పోర్టును పూర్తి చేయబోతున్నాం. పోర్టు ఆధారిత పరిశ్రమలు కూడా ఏర్పాటవుతున్నాయి. పోర్టు, మంగినపూడి బీచ్ అభివృద్ధికి ఎలాంటి విఘ్నాలు కలగకూడదనే ఉద్దేశ్యంతో 63 అడుగుల మహాగణపతిని బందరు బీచ్‌లో ఏర్పాటు చేయబోతున్నాం. రేపు ఉదయం 7.11కి భూమి పూజ చేస్తున్నాం. తద్వారా ఈ ప్రాంతం మొత్తం అభివృద్ధి చెందుతుందని బలంగా విశ్వసిస్తున్నాం. హామీ మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు మంజూరుచేస్తున్నాం. కూటమి అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు రూ.65 వేల కోట్లు పెన్షన్ల రూపంలో అందించాం. చదువుకునే ప్రతి బిడ్డకీ తల్లికి వందనం అమలు చేస్తున్నాం. ప్రభుత్వ స్కూళ్లలో మెరుగైన వసతులు కల్పిస్తున్నాం. అన్ని సదుపాయాలు ఉచితంగా అందిస్తున్నాం. జులై 15 నాటికి తల్లికివందనం నగదు జమచేయబోతున్నాం. అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నాం. ఉచిత గ్యాస్ పథకంలో ఇప్పటి వరకు సుమారు నాలుగున్నర కోట్లకు పైగా గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించాం. ఉచిత బస్సు పథకాన్ని పక్కాగా అమలు చేశాం. మన పిల్లలకు మన ప్రాంతంలోనే ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోంది. ప్రజలకు మంచి చేయాలి, మంచి పాలన అందించేందుకు కష్టబడి పని చేస్తున్నాం. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా కులం,మతం, ప్రాంతం పేరుతో కుట్రలు చేస్తున్నాడు. 2019 ఎన్నికలకు ముందు అమరావతే రాజధాని అన్న వ్యక్తి.. గెలిచాక మూడు రాజధానుల పేరుతో రైతుల్ని ముప్పుతిప్పలు పెట్టాడు. ఇప్పుడు మావిగన్ అంటూ సరికొత్త డ్రామాకు తెరలేపాడు. అమరావతి వెళ్లి రైతులతో రాజకీయం చేయాలని ప్రయత్నిస్తే.. ప్రజలు తరిమి తరిమి కొట్టారు. బందరు నుండి కూడా ఒక సైకో వెళ్లాడు. ప్రజలు తరిమితే తేలుకుట్టిన దొంగలా పారిపోయి వచ్చాడు. జగన్ రెడ్డి లాంటి సైకో రాష్ట్రానికి అవసరమా? జగన్ రెడ్డి వైఖరితో రాష్ట్ర అభివృద్ధి పాతికేళ్లు వెనక్కి వెళ్లిపోయింది. ఒక్క పరిశ్రమ రాలేదు. ఒక్క ఉద్యోగం కల్పించలేదు. తప్పుల్ని ప్రశ్నిస్తే దాడులు, తప్పుడుకేసులు, అరాచకాలతో వేధించాడు. నన్నుకూడా తప్పుడు కేసులో అరెస్టుచేసి జైల్లో పెట్టాడు. ఇప్పుడుకూడా అదే వైఖరి అవలంబిస్తున్నాడు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మూడు నాలుగు దఫాలు అధికారంలో ఉంటే దేశంలోనే అగ్రస్థానంలో నిలుస్తుంది అన్నారు.

## వరద ముంపులో ముంబయి

>> పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. పన్వేల్, ఉరాన్, పాల్ఘర్, రాయ్‌గఢ్ ప్రాంతాల్లో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేయడంతో జిల్లా కలెక్టర్ అన్ని పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. పరిస్థితులను బట్టి స్థానిక అధికారులు మరిన్ని విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించాలని ప్రభుత్వం సూచించింది. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు సూచించారు. ముంబైలో వచ్చే 24 గంటలపాటు భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. తాజాగా ముంబైలో భారీ వర్షం కారణంగా ఒక వ్యక్తి మ్యాన్‌హోల్‌లో పడి కొట్టుకుపోయాడు.

ఈ ఘటన గురువారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ముంబైలోని చండివలి ఏరియాలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చండివలి, సన్మాన్ హోటల్ సమీపంలోని ఖైరాని రోడ్డులో మెయింటెనెన్స్ వర్క్ జరుగు తోంది. ఈ క్రమంలో అక్కడ అస్లాం ఇసాక్ షేక్ (60) అనే వృద్ధుడు ఫోన్‌లో నడుచుకుంటూ వెళ్తుండగా, ప్రమాదవశాత్తు మ్యాన్‌హోల్‌లో పడిపోయాడు. దీంతో అతడు ఆ మ్యాన్‌హోల్‌లో పడి కొట్టుకుపోయాడు.

## తిరుమలేశుని తిరుప్పావడసేవలో మంత్రి లోకేష్

**తిరుమల,జూలై 2ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లోనూ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రార్థించినట్లు టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్,రాష్ట్ర ఐటి,విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ తెలిపారు. ఇందుకు ఇష్టదైవమ్ శ్రీవారి ఆశీస్సులు కోరినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. రెండురోజుల తిరుపతి జిల్లా పర్యటనలో భాగంగా గురువారం ఉదయం వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్ మార్గంలో ఆలయంలోనికి చేరుకున్నారు. వైకుంఠమ్ 1 వద్ద టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ల వెంకయ్య చౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, డిప్యూటీ ఇఒ భాస్కర్ స్వాగతం పలికారు. ఆలయంలోపల తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలో దేవదేవునికి నిర్వహించిన తిరుప్పావడసేవలో మంత్రి లోకేశ్, టిడిపి ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. దేవుని ఆశీస్సులందుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు.

## వైకాపా అక్రమాలు సహించం

>> మన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మావిగన్ వర్సెస్ అమరావతి అనే నినాదంతో ఎన్నికలకు వెళతానని అంటున్నారు దానిపై మీ సమాధానమేమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ని అడగగా మావిగన్ అంటే 2014లో ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో మచిలీపట్నం, గుంటూరు, విజయవాడ ప్రాంతాలను కలుపుతూనే అమరావతిని రాజధానిగా ప్రకటించడం జరిగిందని, ప్రస్తుతం అభివృద్ధి పథంలో దూసుకుపోవటంతో మనసు మార్చుకున్న జగన్ మూడు రాజులదానుల మాటను వదిలి మరల ఈ నినాదాన్ని తీసుకువచ్చి ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం అమరావతి ఎన్నికలకు వెళ్ళబట్టే వైసీపీకి 11 సీట్లు పరిమితమయ్యాయని, కూటమి ప్రభుత్వం క్లీన్ స్వీట్ చేయడం జరుగుతుందన్నారు. అధికారం ఉంటే ఒకలా అధికారం పోతే ఒకలా నిలకడ లేని మనస్తత్వంతో జగన్ మతిభ్రమించి మాట్లాడతారన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షులు డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర మంత్రివర్యులుగా చేసిన అశోక్ గజపతి రాజు వంటి హోదా కలిగిన వ్యక్తి భూమినే మార్చేసారంటే, రాష్ట్రంలో పాలనను ఏ విధంగా పక్కదోవ పట్టించారో అర్థమవుతుందన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయం నిర్మాణం కోసం నాలుగు స్థలాలను చూయించి ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నామని, ప్రభుత్వం నగరానికి దూరమైన స్థలాన్ని మంజూరు చేసినప్పటికీ, కార్యకర్తలకు దూరమైనప్పటికీ, అధికారంలో ఉన్ననూ ప్రభుత్వ అనుమతులు ప్రకారమే అక్కడే నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు.

## పలుగు పట్టి పారెత్తి.. కరవు పనిలో చంద్రబాబు, పవన్

**ఓబులవారిపల్లి(తిరుపతి),జులై 2ప్రభాతవార్తప్రతినిధి:** దేశ గ్రామీణ అభివృద్ధి చరిత్రలో ఆంధ్రప్రదేశ్ వేదికగా ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన, జీవనోపాధిని మెరుగుపరిచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా డిజైన్ చేసిన "వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అజీవికా మిషన్" దేశవ్యాప్తంగా నేటి నుంచి అధికారికంగా ప్రారంభమైంది. తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలం ముక్కావారిపల్లి గ్రామంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కలిసి ఈ మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అక్కడ సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్ కళ్యాణ్ స్వయంగా క్షేత్రస్థాయిలోకి వెళ్లి, పలుగు పట్టి పారెత్తి కరువు పనిలో పాల్గొని ఉపాధి కూలీల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి నిల్వలను పెంచేందుకు ఉద్దేశించిన మ్యాజిక్ డ్రైన్ల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామీణ స్వచ్ఛతను పెంపొందించేందుకు సిద్ధం చేసిన స్వచ్ఛరథాలను సిఎం చంద్రబాబు, కేంద్రమంత్రి, డిప్యూటీ సిఎం నిశితంగా పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.జాబ్ కార్డులు, బుక్‌లెట్ల ఆవిష్కరణ కార్యక్రమంలో లబ్ధిదారులకు కొత్తగా రూపొందించిన విబిజి రామ్ జీ జాబ్ కార్డులను పంపిణీ చేశారు. ఈ పథకానికి సంబంధించిన ప్రత్యేక ప్రోత్సాహక గీతాన్ని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్ ఆవిష్కరించారు.

## రిటైర్మెంట్ పెంపు జీవో జారీ

>> ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే 60 యేళ్లకు పదవీ విరమణ పొంది తిరిగి విధుల్లో చేరేందుకు ఆసక్తి లేని ఉద్యోగులకు పాత నిబంధనల ప్రకారమే రిటైర్మెంట్ వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నిర్ణయాన్ని అమలు చేసేందుకు సర్వీస్ రూల్స్‌లో అవసరమైన సవరణలు చేయాలని సంస్థలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే ప్రతి సంస్థ తమ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలని సూచించింది. అన్ని శాఖలు తమ పరిధిలోని పిఎస్‌యూలు, కార్పొరేషన్లు, సొసైటీలకు వెంటనే ఉత్తర్వులను పంపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.



గురువారం తిరుమల ఆలయంలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న మంత్రి లోకేష్

## ఎఐ, రక్షణలో ద్వైపాక్షిక బంధం

>> సనయే తకైచి మధ్య జరిగిన వార్షిక శిఖరాగ్ర స్థాయి చర్చల సందర్భంగా పలు ఒప్పందాలు కుదిరాయి. చర్చల అనంతరం జరిగిన సంయుక్త విలేకరుల సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, ఈ భాగస్వామ్యానికి పరస్పర విశ్వాసమే అతిపెద్ద ఆస్తి అని పేర్కొన్న ప్రధాని మోదీ, స్వేచ్ఛాయుత, ఇండో పసిఫిక్ ప్రాంతం ఉమ్మడి ప్రాధాన్యతగా కొనసాగుతుందని ఉద్ఘాటించారు. అలాగే, ఎఐపై కొత్త ఉమ్మడి ప్రకటన, చారిత్రాత్మక సైనిక సహఅభివృద్ధి ప్రాజెక్ట్ భవిష్యత్తు ద్వైపాక్షిక సహకారానికి కీలక స్తంభాలుగా నిలుస్తాయని ఆయన తెలిపారు. ప్రస్తుత కాలంలో పరస్పర విశ్వాసం అత్యంత విలువైన ఆస్తి అని, భారత్ – జపాన్ ద్వైపాక్షిక భాగస్వామ్యం కాల పరీక్షకు నిలిచిందని అన్నారు. నేడు భారత్ – జపాన్ ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలలో ఉన్నాయని, స్వేచ్ఛాయుత, బహిరంగ ఇండోపసిఫిక్ ప్రాంతం రెండు దేశాలకు ఉమ్మడి ప్రాధాన్యత అని ఆయన పేర్కొన్నారు. ఆర్థిక భద్రత, ఇంధన భద్రత ప్రాముఖ్యతను రెండు దేశాలు అర్థం చేసుకున్నాయని ఆయన నొక్కి చెప్పారు. భారత్– జపాన్ సహకారంలో సాంకేతిక భాగస్వామ్యం అత్యంత ముఖ్యమైన స్తంభంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ లక్ష్యాన్ని సాకారం చేసేందుకు, భారత్ – జపాన్ ఎఐ రంగంలో ఒక ఉమ్మడి ప్రకటనను విడుదల చేశాయని మోడీ చెప్పారు. జపాన్ ఖచ్చితమైన సాంకేతికత, భారతదేశ సాఫ్ట్‌వేర్ సామర్థ్యాల కలయిక ప్రపంచ ఎఐ అభివృద్ధికి కొత్త ఊపును. బలాన్ని ఇస్తుందని ప్రధాని పేర్కొన్నారు. రక్షణ రంగంలో భారత్– జపాన్ మధ్య మొదటి సహఅభివృద్ధి ప్రాజెక్టుకు సంబంధించిన ఒప్పందంపై రెండు దేశాలు సంతకాలు చేశాయని ఆయన తెలిపారు.

**'అన్నాచెల్లెళ్లుగా' సంబంధాలను మరింత బలోపేతం: తకైచి**

పెరుగుతున్న ప్రపంచ అనిశ్చితి నేపథ్యంలో లోతైన ద్వైపాక్షిక సహకారం అవసరాన్ని ఎంతైనా ఉంది. ఉమ్మడి శ్రేయస్సును సాధించడానికి జపాన్, భారత్ తమ తమ బలాలను ఉపయోగించుకోవాలని జపాన్ ప్రధాని సనాయ్ తకైచి అన్నారు. సంయుక్త విలేకరుల సమావేశంలో జపాన్ ప్రధాని మాట్లాడుతూ, లభించిన ఆత్మీయ ఆతిథ్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, ప్రధాని మోడీ తనను "అందమైన చెల్లెల్లు" అని ఆప్యాయంగా సంబోధించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. రెండుదేశాల దృక్పథాలు ఒకేలా ఉన్నాయని, "అన్నాచెల్లెళ్లుగా" సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి కట్టుబడి ఉన్నాయని ఆమె అన్నారు. "జపాన్, భారత్ కలిసికట్టుగా మరింతబలంగా, సుసంపన్నంగా మారడానికి మన బలాలను ఉపయోగించుకోవాలి. అంతర్జాతీయ వ్యవహారాలు అస్తవ్యస్తంగా ఉన్న ఈ తరుణంలో, ఇటువంటి పరస్పర పూరక సహకార సంబంధాన్ని నెలకొల్పడం మరింత ముఖ్యమైంది" అని తకైచి పేర్కొన్నారు. భారత్–జపాన్ ప్రత్యేక వ్యూహాత్మక ప్రపంచ భాగస్వామ్యం కింద, వ్యూహాత్మక దిశను పంచుకునే విశ్వసనీయ భాగస్వాములుగా, నా పెద్దన్నయ్య అయిన ప్రధాని మోడీతో కలిసి, భారత్–జపాన్ సంబంధాలు ఒక కొత్త దశలోకి ముందుకు సాగుతున్నాయని నమ్ముతున్నాను. వచ్చేసారి జపాన్‌లో ప్రధాని మోడీకి స్వాగతం పలకడానికి నేను ఎదురు చూస్తున్నా" అని తకైచి చెప్పారు. అంతకుముందు, రాష్ట్రపతి భవన్ ప్రాంగణంలో ప్రధాని తకైచికి ఘన స్వాగతం లభించింది. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ కూడా పాల్గొన్నారు. జపాన్ ప్రధానమంత్రి మూడురోజుల భారత పర్యటన నిమిత్తం బుధవారం సాయంత్రం న్యూఢిల్లీకి చేరుకున్నారు. ప్రధానమంత్రి తకైచి భారతదేశంలో చేస్తున్న మొదటి అధికారిక పర్యటన ఇది. భారత్, జపాన్‌ల మధ్య ఉన్న ప్రత్యేక వ్యూహాత్మక, ప్రపంచ భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఈ పర్యటన ఒక ముఖ్యమైన ముందడుగు అని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

## శ్రీసిటీ ఇంటర్నేషనల్ వర్సిటీ ప్రారంభం

>> సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ మన యువతకు అపారమైన సామర్థ్యం, ఆశయాలు ఉన్నాయని, వారికి అవసరమైనదల్లా ఉపాధి అవకాశాలతో నేరుగా అనుసంధానమైన విద్యావిధానం అన్నారు. ఈ కీలక సవాలుకు పరిష్కారం చూపే ప్రయత్నంలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉండటం గర్వకారణంగా ఉందన్నారు. ఎస్ఐయూ అమలు చేస్తున్న వర్క్‌స్టడీ డ్యూయల్ మోడల్‌కు శ్రీసిటీలోని బలమైన పారిశ్రామిక ఎకోసిస్టమ్ కీలకంగా నిలుస్తోందన్నారు. 31 దేశాలకు చెందిన 250కుపైగా కంపెనీలు వివిధ రంగాల్లో కార్యకలాపాలు సాగిస్తున్నాయి. పరిశ్రమ, విద్యావ్యవస్థలను ఇంత సమగ్రంగా అనుసంధానించిన కేంద్రాలు దేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగాకూడా చాలా అరుదు అని వ్యాఖ్యానించారు. ఎస్ఐయూలో విద్యార్థులు తాము విద్యను అభ్యసించే క్యాంపస్‌కు సమీపంలోనే ప్రముఖ అంతర్జాతీయ కంపెనీలతో కలిసి నేర్చుకునే, పనిచేసే అవకాశాన్ని పొందనున్నారని పేర్కొన్నారు. నాలుగేళ్ల డిగ్రీ చదివిన విద్యార్థి, మొదటి సంవత్సరం నుండే వేతనంతో కూడిన ఇంటర్న్‌షిప్‌ల ద్వారా సంపాదించిన 2 సంవత్సరాలకు పైగా నిజమైన పరిశ్రమ అనుభవాన్ని సంపాదించిందన్నారు.

## ఆర్థిక మేధస్సుతో స్వర్ణాంధ్రవైపు అడుగులు

### -సిఎం చంద్రబాబు నాయుడు

**తిరుపతి,జులై 2ప్రభాతవార్తప్రతినిధి:** పరిపాలనలో ఆర్థిక మేధస్సుతో స్వర్ణాంధ్ర 2047 దిశగా అడుగులు వేస్తున్నామని, ప్రభుత్వ నిర్ణయాలు సంక్షేమ పథకాలు మరింత పారదర్శకంగా పాలన అందించడం వంటివి ప్రధామని రాష్ట్రముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు తెలిపారు. వీటన్నిటినీ సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు కృత్రిమ మేధస్సు(ఎఐ) రియల్‌టైమ్ డేటాను ఉపయోగించడం ద్వారా అనుకున్న లక్ష్యాలను చేరుకోగలమన్నారు. స్వర్ణ ఆంధ్ర 2047 విజన్ సాధనలో ప్రభుత్వ యంత్రాంగాన్ని అన్ని రకాలుగా సిద్ధం చేసేందుకు రెండురోజుల సదస్సు గురువారం సాయంత్రం తిరుపతిలోని ఓ హోటల్‌లో ప్రారంభమైంది. తొలిరోజు సదస్సుకు స్టాటస్టిక్స్‌ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి సౌరభ్ గార్గ్, భారత ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్, నీతి ఆయోగ్ సభ్యులు బాలసుబ్రహ్మణ్యం, ప్రొఫెసర్ కె.వి. రాజు, ప్రధాని ఆర్థిక సలహా మండలి సభ్యుడు ప్రొఫెసర్ ఎస్. మహేంద్ర దేవ్‌తో బాటు సిఎం చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. ప్రజల కోసం నిరంతరం పని చేసేందుకు సంతృప్తి పడి సరిపెట్టకుండా కొత్త విధానాలను అన్వేషిస్తూనే ఉండాలన్నారు. సాంకేతికతను వినియోగించుకోవాలని, ఈ రంగంలో సొంతంగా వ్యవస్థలను కూడా రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుని ఐక్యంగా పని చేస్తే అభివృద్ధి సాధించగలమని సిఎం ధీమా వ్యక్తం చేశారు. దేశం నాకేమిచ్చిందనే దానికంటే ఈ దేశానికి మనమేం చేశామనే రీతిలో ఆలోచించాలన్నారు. త్వరలోనే అమరావతిలో క్వాంటం కంప్యూటర్ అందుబాటులోకి వస్తుందని, క్వాంటం కంప్యూటర్లను తయారు చేసే సామర్థ్యాన్ని కూడా ఏపీ సాధించబోతోందని గర్వంగా తెలిపారు. స్వర్ణాంధ్ర 2047 ఎకనమిక్ ఇంటెలిజెన్స్ ఫర్ గవర్నెన్స్ పేరుతో కెపాసిటి బిల్డింగ్ పై నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సదస్సుకు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనేక అంశాలపై వివరించారు. ఏదేని సాధించాలని ఆశయం నిర్దేశించుకున్నపుడు తొలుతనే సంతృప్తి చెందితే స్టేటస్ కో ఇచ్చినట్టేనని, అందుకే తాను త్వరగా సంతృప్తి చెందనని అన్నారు.ఈ సందర్భంగా సదస్సులో సభికుల మధ్యనే కూర్చొని సిఎం చంద్రబాబు ప్యానల్ డిస్కషన్ ను ఆలకించారు. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న వివిధ కార్యక్రమాలను,అమలు చేస్తున్న అంశాలను ప్యానలిస్టులు ప్రస్తావించారు.

నియోజకవర్గాల వారీగా విజన్ ప్లాన్,పి4 గ్రామస్థాయి డేటా సేకరణ, పాలనలో ఎఐ అమలు వంటి అంశాలపై చంద్రబాబు చొరవను ప్రశంసించారు. నియోజకవర్గాల వారీ పి4 విజన్ ప్లాన్ వంటివి మిగిలిన ఏ రాష్ట్రాల్లోనూ లేవని,వీటిని జాతీయ స్థాయిలో అమలు చేయాల్సిన అవసరం ఉందని ప్యానల్ డిస్కషన్లో పాల్గొన్న ఆర్థిక నిపుణులు అభిప్రాయపడ్డారు.

ఒక నిర్దిష్ట అంశంపై ప్రముఖ రంగాల నిపుణుల సమక్షంలో నలుగురైదుగురు నిపుణులు కలసి చర్చించారు. పేదల స్థితిగతులు మార్చేందుకు ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు చేసే అంశాన్ని ఈ సదస్సులో సిఎం ప్రస్తావించారు. తాను స్వయంగా వెళ్లి పెన్షన్ పంపిణీ చేసిన తులశమ్మ, పద్మమ్మల జీవన స్థితిగుతులను సమావేశంలో చంద్రబాబు ప్రత్యేకంగా వివరించారు. ప్రభుత్వ పథకాలు, డ్వాక్రా రుణాల ద్వారా సదరు కుటుంబానికి జరిగిన మేలుపై వెల్లడించారు. తానూ ఆర్థికశాస్త్రం చదివానని.. దానికంటే సమాజం నుండి, ప్రజల నుండి ఎక్కువగా నేర్చుకున్నానని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ కీలక సదస్సుకు ఆర్థిక, పరిపాలన వ్యవహారాల్లో ప్రముఖ స్థానంలో ఉన్న నిపుణులు హాజరుకావడం సంతోషకరమన్నారు. దేశంలోనే తొలిసారి 2020 విజన్ రూపొందిస్తే నాడు నన్ను విమర్శించారని, దేశానికి కూడా విజన్ డాక్యుమెంట్ తయారు చేయాలని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం భావించారని గుర్తుచేశారు. ఐటీతో ప్రపంచం కుగ్రామంగా మారిందని, ఐటీతో అభివృద్ధి సాధించగలమని బలంగా నమ్మాననన్నారు. సర్వీస్ సెక్టార్ రివ ల్యూషన్ ను అందిపుచ్చుకుంటే అభివృద్ధి జరుగుతుందని విశ్వసించిదానికి అనుగుణంగా పనిచేశామని తెలిపారు. డేటానే సంపదగా మారిన రోజుల్లోకి వచ్చామని,. డేటా ఆధారిత నిర్ణయాలకే భవిష్యత్ ఉంటుందని మరోసారి అనుభవాన్ని వెల్లడించారు. ప్రజలకు ప్రభుత్వం సేవలు అందించడం ఎంత ముఖ్యమో సంపద సృష్టికి ప్రైవేట్ రంగం నుంచి పెట్టుబడులు సాధించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. స్వర్ణాంధ్ర 2047విజన్ లో ప్రైవేట్ పెట్టుబడులు అనే అంశాన్ని చేర్చామని, అన్ని రంగాలకు సంబంధించిన డేటాను సేకరించడమే కాకుండా డేటా అనుసంధానం కూడా ముఖ్యంగా తీసుకున్నామన్నారు..

## జగన్నాథ రథచక్రాల్లో నలిగిపోతారు..

>> రైల్వే కోడూరు నియోజకవర్గ ప్రజలకు తీపి కబుర్లు చెప్పారు. 156 కోట్లతో ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు, అండర్ డ్రైనేజీ కాలువల నిర్మాణానికి రూ. 8 కోట్లు, పిల్లలకు పాఠశాల భవన నిర్మాణాలకు రూ. 10 కోట్లు విడుదల చేసినట్లు, అలాగే కోడూరు వెంకటగిరి రోడ్డు 22 కిలోమీటర్లు ఫారెస్ట్ క్లియరెన్స్ ఇచ్చి త్వరితగతిన పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

విబి జీ రామ్ జీ పథకం రైల్వే కోడూరు నియోజకవర్గం నుంచి ప్రారంభమై దేశవ్యాప్తంగా అమల్లోకి రావటం చారిత్రాత్మకం. గతంలో నరేగా రాయలసీమ ప్రాంతం నుంచే ప్రారంభమైంది. ఇప్పుడు కూడా విబి జీ రామ్ జీ పథకం ఇక్కడి నుంచే ఆవిష్కృతం అయ్యింది. 13,226 గ్రామాల్లో ఒకే మారు గ్రామసభలు పెట్టి గిన్నిస్ రికార్డు సృష్టించిన ఘనత డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కే దక్కింది. 7వేల కిలోమీటర్ల మేర సిసి రోడ్లు, 40 వేల గోకులాలు, 15,500 నీటి తొట్టెలు, 1.07 లక్షల ఫార్మ్ పాండ్లు, 1,373 కిలోమీటర్ల మేర గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, 1.66 లక్షల ఎకరాల్లో పండ్ల తోటల సాగు జరిగింది. ఉపాధి హామీ పనుల నిమిత్తం 55.44 కోట్ల పని దినాలు కల్పించి,16,695 కోట్లు ఖర్చు చేశామన్నారు. లక్ష ఎకరాల్లో పండ్ల తోటలు అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పోలవరం ప్రాజెక్టును గోదావరి పుష్కరాల కంటే ముందే పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నిలబెట్టటంతో పాటు రైల్వే జోన్ సాధించామన్నారు. రాయలసీమను అన్ని రంగాల్లోనూ అగ్రస్థానంలో నిలుపుతామన్నారు.. మదనపల్లిలో హార్టీకల్చర్ హబ్‌కు త్వరలోనే శంకుస్థాపన చేస్తామన్నారు. తిరుపతిలో బుల్లెట్ మోటార్ సైకిల్ తయారీ ప్లాంట్ వస్తోంది. ప్రజల మనిషి కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అడిగిన వెంటనే సమస్యల్ని పరిష్కరించారు. బంగారం గనులు ఉన్న జొన్నగిరి పేరును చారిత్రక పేరు స్వర్ణగిరిగా మార్చాం. నిస్వార్థంగా పనిచేసే కూటమి నేతలకు ప్రజలు సహకరించాలని కోరుతున్నాను అన్నారు.

## 'జీ రామ్‌జీ'తో అభివృద్ధి వెల్లువ

>> హాజరయ్యారు ఈ సందర్భంగా కేంద్రమంత్రి చౌహాన్ మాట్లాడుతూ విబి జీ రామ్ జీ పథకం ముక్కవారి పల్లి నుంచి దేశంలోనే ప్ర ప్రథమంగా తిరుపతి జిల్లా ముక్కావారిపల్లి నుండి లాంచనంగా ప్రారంభించడం ఎంతో శుభ పరిణామం అన్నారు . రాయలసీమను రతనాలసీమగా అభివృద్ధి చేస్తామని స్వర్ణగిరి ద్వారా స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. కేంద్రం నుంచి 7,700 కోట్ల రూపాయలు రాష్ట్రంలో మరో 4 వేల కోట్లరూపాయలు వ్యయంతో విబి జీ రామ్ జీ పథకం కింద పనులు చేపడతామన్నారు. ఈ పథకంతో డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సారథ్యంలో గ్రామాల రూపు రేఖలు మారుతాయని, 125రోజులు పని దినాలతో గ్రామీణ అభివృద్ధికి కావాల్సిన ఏ పనైనా చేపట్టేందుకు విబి జీ రామ్ జీ పథకం కింద అవకాశం ఉంటుందన్నారు. రహదారులు, డ్రైనేజీ, ఇంకుడు గుంతలు పంట పొలాల వద్దకు డొంక రోడ్లు వేర్వేరు ఆస్తుల కల్పనకు ఆస్కారం ఉండేలా ఈ పథకం ముఖ్య ఉద్దేశం అన్నారు .జియో టాకింగ్. బయోమెట్రిక్ లాంటి సాంకేతికతతో పూర్తి పారదర్శకంగా ఈ పథకం నిర్వహిస్తామన్నారు గతంలో ప్రభుత్వం లాగా జరగకుండా దొంగ బిల్లులకు ఆస్కారం లేకుండా పనులు జరుగుతాయని తెలిపారు. గాలేరు నగరి నుండి కోడూరుకు నీళ్ల తీసుకొచ్చేందుకు 2,500 కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నామన్నారు. జల ద్వారా భూగర్భ జలాలకు ప్రాధాన్యమిస్తామని రాష్ట్రాలు కూడా వ్యయం చేసేలా ఈ కార్యక్రమం చేపట్టడం భారం కాదని మాకు బాధ్యతని, 13,226 కిలోమీటర్లు మేరా సిసి రోడ్లు 40 వేల గోకులాలు 15500 నీటి తొట్టెలు.1.07 కిలోమీటర్ల మేర గిరిజన ప్రాంతాలలో రోడ్లు 1.66 లక్షల ఎకరాల్లో పండ్ల తోటలు అభివృద్ధి పనులు ఉపాధి హామీ పనులు నిమిత్తం 55.44 కోట్లు పని దినాలు కల్పించి రూ.16695 కోట్లు ఖర్చు శేషం ఈ ఏడాది పదివేల కిలోమీటర్లు గ్రావెల్ రోడ్లు 1500 కిలోమీటర్లు సిమెంట్ రోడ్లు 500 కిలోమీటర్లు డ్రైన్ డ్రైనేజీ లక్స్ ఎకరాల్లో పండ్ల తోటలను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు ముఖ్యంగా పంట పొలాలకు వెళ్లే మెటల్ రోడ్డు కూడా విబి జీ రామ్ జీ పథకం కింద నిర్మిస్తామన్నారు. అంతేకాకుండా రైల్వే కోడూరు అంటే నాకు మరియు పవన్ కళ్యాణ్‌కు ఎంతో ఆప్యాయత ఉందని ప్రజలు మాపైన చూపిస్తున్న ప్రేమ అభిమానానికి రైల్వే కోడూరు అభివృద్ధి పథంలో నడిపిస్తామని రైల్వే కోడూరు బస్టాండుకు ఐదు కోట్లు డ్రైనేజీ కాలువలకు 10 కోట్ల రూపాయలు మంజూరు చేస్తామన్నారు. అనంతరం ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని భారత ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలో దేశం అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతుందని విబి జీ రామ్ జీ పథకాన్ని మన మొక్క వారి పల్లి నుంచి ప్రారంభించడం దేశంలోనే ఎంతో గర్వించదగ్గ విషయమని అన్ని విధాల ప్రజా సంక్షేమానికి రైతులు సంక్షేమానికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ అవకాశాన్ని ప్రజలు అర్హులైన వారు రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ ద్వారా ఎంతో అభివృద్ధి సాధించవచ్చునని మన ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు పల్లెలు పచ్చగా ఉండి అభివృద్ధి చెందితే రాష్ట్రం బాగుంటుందన్నారు ప్రత్యేకంగా రైల్వే కోడూరు అంటే మాకు ఎంతో అభిమానం అని రైల్వే కోడూరు అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తామన్నారు అనంతరం కూడా చైర్మన్ టిడిపి ఇన్చార్జి ముక్కారూపానంద రెడ్డి మాట్లాడుతూ అన్ని విధాల కోడూరు అభివృద్ధి చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు గత 20 సంవత్సరాలుగా లేని అభివృద్ధి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండు సంవత్సరాలలో రైల్వే కోడూరు రూపురేఖలు మారాయి అన్నారు మాకు రైల్వే కోడూరులో కొన్ని సమస్యలు ఉన్నాయని బస్టాండ్ మరియు డ్రైనేజ్ పండ్ల తోటలు రైతులకు ఉద్యానవనరైల్వే కోడూరు హబ్బుగా తీర్చిదిద్దాలని ఆయన కృతజ్ఞతలు తెలిపారు అనంతరం రైల్వే కోడూరు శాసనసభ్యులు మాట్లాడుతూ ఎపిఎమ్‌డిసి ద్వారా మా నియోజకవర్గానికి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని మంగంపేటలో ఇల్లు భూములు కోల్పోయిన వారికి ఆర్థిక భరోసా కల్పించి నియోజకవర్గ ప్రజలను అన్ని విధాల ఆర్థికంగా ఆదుకోవాలని అన్నారు మంత్రులు పెన్నసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ విబి జీ రామ్ జీ పథకం తిరుపతి నుంచి ప్రారంభించడం ఎంతో సంతోషకరమని దేశంలోనే ముక్క వారి పల్లి గ్రామాన్ని ఎంచుకోవడం ఎంతో శుభపరిణామన్నారు. ఈ పథకం ద్వారా అనేక పనులు చేపట్టి రైతు ఆర్థికంగా ఎదగవచ్చు అన్నారు మాజీ ప్రధానమంత్రి అటల్ బీహారీ వాజ్‌పేయి సేవల ప్రశంసనీయమన్నారు. కేంద్రం మరియు ఆంధ్ర సంయుక్తంగా అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుందన్నారు.

## వారం - వర్జ్యం

03-07-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆరుద్ర కార్తె
తదియ ఉ.11.18, శ్రవణ ఉ.11.44
వర్జ్యం : సా.4.04-సా.5.48
దు.ఉ.8.15-ఉ.9.07,
2) మ.12.37-మ.1.29
శుభసమయం : ఉ.10.00-11.00
రాహుకాలం - ఉ.10.30-12.00

## వారాఫలం

**మేషం:** మీ ప్రమేయంలేకపోయినా తగాదాలలోనికి లాగటానికి మీ ఓర్పును రెచ్చగొట్టేవారు అధికమవుతారు.

**వృషభం:** సంతానంపట్ల సంతృప్తికలిగి వుంటారు, అనవసర విషయాలలో జోక్యం వద్దు. అన్నివిధాల శ్రేయస్కరం.

**మిథునం:** గృహసంబంధమైన ఖర్చులను తగ్గించే యత్నమును, ఆదాయమునకు అదనపు మార్గములను అన్వేషిస్తారు.

**కర్కాటకం:** బాధ్యతలు సక్రమంగా నిర్వ హించి పలువురి ప్రశంసలు పొందుతారు. ఇంటా బయటా అనుకూల వాతావరణం ఉంటుంది.

**సింహం:** అనుకోని అవకాశాలు లభిస్తాయి. దీర్ఘకాలిక సమస్యలుతీరి ఊరట చెందుతారు. ఇంటాబయటా అనుకూలం.

**కన్య :** క్రమశిక్షణకు ప్రాధాన్యతనిచ్చి, కష్టపడి, ప్రతిష్టాత్మకమైన మంచిఫలితాలను సాధిస్తారు. శుభవార్తలు వింటారు.

**తుల :** ముఖ్యమైన విషయాలలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది. తండ్రి ద్వారా ఆస్తిలాభం పొందుతారు.

**వృశ్చికం:** ఉద్యోగస్తులకు కార్యాలయంలో అనుకూల వాతావరణం ఉంటుంది. తనఖా వస్తువులను విడిపిస్తారు.

**ధనుస్సు:** కీలక నిర్ణయాలలో జీవితభాగస్వామి సలహాలు తీసుకుంటారు. వ్యాపారాలు అభివృద్ధిచెందుతాయి.

**మకరం:** ఆర్థికవ్యవహారాలలో జీవిత భాగస్వామి తోడ్పాటు మీకు వెసులుబాటు కలిగిస్తుంది. ఆస్తి వివాదాలు తీరుతాయి.

**కుంభం:** స్థిరాస్తివివాదాలనుండి బయట పడతారు. అప్రయత్నంగా పనులు పూర్తి చేస్తారు. ఆభరణాలు కొనుగోలుచేస్తారు.

**మీనం:** నూతనవ్యక్తులతో పరిచయాలు పెంచుకొని మిత్రబృందాలను పెంచు కుంటారు. ఇంటిలో శుభకార్యాలు జరుగుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# తిరుమల సమాచారం

## ప్రపంచంలో అగ్రగామి దేశంగా భారత్



**తిరుమల, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచంలోనే భారతదేశం అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా ముందుకు వెళ్లాలని, అందుకు ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు కోరినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. భారత ప్రధానిగా నరేంద్రమోదీ 13 సంవత్సరాలు సిఎంగా, 12సంవత్సరాలు ప్రధానిగా ధర్మం, సేవానిరతితో పాలనసాగిస్తున్నారన్నారు. ఆయన ఆశయాలు, ఆయన నిరంతర కృషితోనే భారత్ అగ్రగామిదేశంగా నిలుస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా తక్కువ వర్షాలు కురుస్తాయని అంచనాలు వ్యక్తమవుతోందని, జూన్‌లో రావాల్సిన వర్షాలు 40 నుంచి 50 శాతం మాత్రమే నమోదయ్యాయని పేర్కొన్నారు. మన దేశ అవసరాలు తీరాలంటే మంచి వర్షాలు పడాలని, అందుకే లోకకల్యాణం కోసం స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే ప్రతి నీటిచుక్కను వృథా కాకుండా కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. జులై నెలలో మంచి వర్షాలు కురవాలని, ప్రస్తుత సమస్యలు పరిష్కారం కావాలని ప్రార్థిస్తున్నానని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆయన ఆలయంలోనికి వేరుకున్నారు. టిటిడి అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## తెలుగురాష్ట్రాల్లో మంచి వర్షాలు కురవాలి



**తిరుమల, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశం,రాష్ట్రంఅన్ని రంగాల్లో ముందుండాలని తిరుమల శ్రీవారిని ప్రార్థించినట్లు బిజెపి నేతలు బండారు దత్తాత్రేయ, మాధవ్ తెలిపారు. ధర్మానికి భారత దేశం పెట్టినిల్లుఅని, టిటిడి అనేక ధార్మిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. టిటిడిలో అన్యమతస్తులు ఉండరాదని హిందూ ధర్మంపై నమ్మకంతోనే పనిచేయాలన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో సకాలంలో మంచి వర్షాలు కురవాలని, తాగునీటికి సాగునీటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని వేంకటేశ్వర స్వామిని వేడుకున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి అనుగ్రహంతోనే పద్మశ్రీ అవార్డు



**తిరుమల, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశ అత్యున్నత పౌర పురస్కారాల్లో ఒకటైన పద్మశ్రీ అవార్డు తనకు లభించడం వెనుక శ్రీవారి అనుగ్రహం మెండుగా ఉందని సినీనటుడు పద్మశ్రీ రాజేంద్రప్రసాద్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఇది పూర్తిగా అభిమానులు, శ్రేయోభిలాషులకే అంకితమని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డు రావడం పట్ల తాను ఎంతో ఆనందంగా, కృతజ్ఞతతో ఉన్నానని సవినయంగా తెలిపారు. ప్రతిసారి తిరుమల వచ్చినప్పుడు కలిగే ఆధ్యాత్మిక అనుభూతిని మాటల్లో వర్ణించలేనని, ఈసారి కూడా దర్శనం అత్యంత ప్రశాంతంగా జరిగిందని వివరించారు. ప్రస్తుతం తాను పలు విభిన్న చిత్రాల్లో బిజీగా నటిస్తున్నానని, త్వరలో ప్రేక్షకులను విస్మయపరిచే కొత్త పాత్రల్లో అలరించడానికి సిద్ధంగా ఉన్నానని రాజేంద్రప్రసాద్ ఆనందంగా ప్రకటించారు. గురువారం ఉదయం తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్ విరామ సమయంలో స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదమంత్రోచ్ఛారణలతో వేదాశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు.

## త్వరలో రాజాధిరాజ చిత్రం విడుదల



**తిరుమల, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** తాను ఇప్పటికే అనేక చిత్రాల్లో నటిస్తున్నానని, త్వరలోనే రాజాధిరాజ చిత్రం విడుదల కానుందని సినీనటుడు సాయికుమార్ తెలిపారు. రవితేజతో నటిస్తున్నానని, ఆగస్టులో ఐదుముది చిత్రం విడుదల కానుందని చెప్పారు. యాభైసంవత్సరాల తెలుగుచిత్ర పరిశ్రమలో అనేక చిత్రాల్లో నటించానన్నారు. తన కుమారుడు ఆది చిత్రరంగానికి పరిచయమయ్యాడని, అతనిని కూడా ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. డైలాగ్ కింగ్ సాయికుమార్ గురువారం ఉదయం కుటుంబంతో కలసి తిరుమల వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో ఆలయంలోనికి వేరుకున్నారు. తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. నిరంతరం సినిమా షూటింగులతో బిజీగా ఉండే సాయికుమార్ కాస్త సమయం తీసుకుని స్వామివారి ఆశీస్సులు అందుకోవడానికి తిరుమలకు విచ్చేశారు. ప్రేక్షకులను అలరించడానికి పలు చిత్రాలు రానున్నాయన్నారు.

## శ్రీవారిసేవలో పర్యవేక్షకుల పాత్ర కీలకం

**తిరుమల, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మికసంస్థ టిటిడి నిర్వహిస్తున్న శ్రీవారిసేవలో గ్రూప్ సూపర్వైజర్ల పాత్ర అత్యంత కీలకమని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ల వెంకయ్య చౌదరి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 2000వ సంవత్సరంలో మొదటిసారిగా టిటిడి శ్రీవారిసేవ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ప్రస్తుతం శ్రీవారిసేవకులకు వారి ప్రాంతాల్లోనే శిక్షణ ఇచ్చేందుకు గ్రూప్ సూపర్వైజర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే తొలి బ్యాచ్‌లో 1,400 మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. రెండో విడుతలో 2,600 మందికి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రత్యేక శిక్షణకి ఐఐఎం అహ్మదాబాద్ వారి సహకారంతో శిక్షణ మెటీరియల్ రూపొందించడం జరిగిందన్నారు. ఇందులో ఆధ్యాత్మికతతో పాటు నిర్వహణ నైపుణ్యాలను నేర్చుకునేలా తీర్చిదిద్దినట్లు చెప్పారు. తిరుమలలోని సేవ సదన్2 లో గురువారం ఉదయం ప్రారంభమైన శ్రీవారిసేవ గ్రూప్ సూపర్వైజర్లకు రెండో విడత శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు ఇఒ చౌదరి విచ్చేశారు. శ్రీవారి సేవకులు తమ పాత్రను అర్థం చేసుకుని బాధ్యత, సహనంతో భక్తులకు సేవలందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీవారిసేవా విభాగాధిపతి ,సిపిఆర్‌ఒ డాక్టర్ తలారి రవి, శ్రీవారిసేవ శిక్షకులు డాక్టర్ ఎస్.ఎల్.ఎన్.టి శ్రీనివాస్, డాక్టర్ శరత్ కుమార్, పొలమడ రమేష్ బాబు, శ్రీవారిసేవ సిబ్బంది పాల్గొన్నారు.

# మీ ఆప్యాయత... అనుబంధం మరచిపోలేను

**• యువగళంలో వెంట నడిచిన వారిని మరిచిపోని మంత్రి లోకేష్**



**తిరుపతి, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో క్లిష్టసమయంలో గత ఎన్నికలకు ముందు చేపట్టిన యువగళం పాదయాత్రలో తనవెంట ఉండి నడచిన, చేదోడువాదోడుగా తనతో కలసి వచ్చిన యువకుల సేవలను మరచిపోలేనని రాష్ట్రమంత్రి నారా లోకేశ్ తన అనుభూతిని వ్యక్తం చేశారు. యువగళం పాదయాత్రలో ఆప్యాయంగా తన వెంట నడిచిన వారిని మర్చిపోని మంత్రి నారా లోకేష్ పాదయాత్ర బంధం శాశ్వతమని చాటిచెప్పారు. ఏ వేదికైనా, ఏ వేడుకైనా అక్కడ యువగళం పాదయాత్రలో పాల్గొన్నవారు కనిపిస్తే పేరు పెట్టి పలకరించి, ఆగి మాట్లాడి వెళ్లే లోకేష్ యువగళం బంధం.. తరగని అనుబంధం అని మరోసారి నిరూపించారు. గురువారం ఉదయం తిరుపతిలోని భూపాల్ హౌసింగ్‌లో జరిగిన కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి వివాహం సందర్భంగా కాబోయే నూతన దంపతులను ఆశీర్వదించేందుకు వధువు ఇంటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ యువగళం పాదయాత్రలో తనతోపాటు ఎండనక , వాననక నడిచిన టిడిపి సైనికులు కనిపించారు. మంత్రి అక్కడే ఆగి వారందరిని పేరుపేరునా పలకరించి వారితోపాటు సమానంగానే కూర్చున్నారు. దాదాపు 15 నిమిషాల పాటు వారితో మాట్లాడిన లోకేష్ యువగళం పాదయాత్ర నాటి సంగతులు గుర్తుకు తెచ్చుకున్నారు. నాటి వైసిపి ప్రభుత్వం అణచివేతను ఎదిరించి మరీ పాదయాత్రను ముందుకు తీసుకెళ్లడంలో ఒక సైన్యంలా పనిచేశారని ప్రశంసించారు. పాదయాత్రలో ఉద్యోగాల కల్పన అవసరాన్ని గుర్తించి ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల కల్పన హామీ నెరవేర్చేందుకు తీసుకువచ్చిన పెట్టుబడులు కల్పించిన ఉద్యోగాలను యువగళం దళానికి వివరించారు. జాబ్ క్యాలెండర్, టీచర్ పోస్టుల భర్తీ, కానిస్టేబుళ్ల నియామకాలు చేపట్టామని తెలిపారు. కార్యకర్తే అధినేత నినాదంతో టిడిపి కేడర్ సాధికారత సాధించేందుకు చేస్తున్న కృషిని తెలియజేశారు. సూర్య ప్రకాష్ ఎలా ఉన్నావు అంటూ యోగక్షేమాలు కనుక్కున్నారు. ఏమప్పా! వెంకటప్ప కుశలమేనా అని పలకరించారు. చంద్రా బాగున్నావా? అని ఆరా తీశారు. ఎల్లప్ప, లక్ష్మీపతిలతో పాదయాత్ర జ్ఞాపకాలు పంచుకున్నారు. ఒక ఇంటి వాడు కాబోతున్న నాదెండ్ల బ్రహ్మం చౌదరికి శుభాకాంక్షలు తెలిపారు. కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. జస్వంత్, రవి నాయుడులతో మిగిలిన యువ బృందం గురించి అడిగి తెలుసుకున్నారు.

# పవర్ గ్రిడ్ కార్పొరేషన్ సిఎండితో మంత్రి జనార్దన్ రెడ్డి భేటీ

**• మౌలిక సదుపాయాల అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి • సానుకూలంగా స్పందించిన సిఎండి**



**విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** నంద్యాల జిల్లా బనగానపల్లె ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పనకు కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద నిధులు విడుదల మంజూరు చేయాలని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సిఎండి వంశీరామమోహన్‌ను రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి కోరారు. హర్యానాలోని గురుగ్రామ్‌లో గల పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి, సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి)గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న తెలుగు వ్యక్తి బుర్రా వంశీ రామమోహన్‌తో ఆయన మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సిఎండిని శాలువాతో సత్కరించి, వినాయకుని ప్రతిమను ఆయనకు అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సమావేశంలో బనగానపల్లె నియోజకవర్గ పరిధిలోని కొలిమిగుండ్ల మండలం నందిపాడు గ్రామంలో పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న హై ఓల్టేజ్ ట్రాన్స్‌మిషన్ లైన్స్ ప్రాజెక్టుపై చర్చించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం ప్రస్తుతం కొనసాగుతున్న నేపథ్యంలో బనగానపల్లె ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పనకు కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద నిధులు విడుదల చేయాలని మంత్రి కోరారు. ముఖ్యంగా వర్షాకాలంలో జుర్రేరు వాగు వరద ప్రవాహం వల్ల స్థానిక నివాస ప్రాంతాలు, వ్యవసాయ పంట భూములు ముంపునకు గురవుతున్న విషయాన్ని మంత్రి సిఎండి దృష్టికి తీసుకెళ్లారు. జుర్రేరు వాగు సుందరీకరణ, వరద నివారణ కోసం రూ.4.95 కోట్లతో చేపట్టదలచిన రిటైనింగ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు రూ.2 కోట్ల విలువైన ఆధునిక వైద్య పరికరాలను సిఎస్‌ఆర్ నిధుల కింద సమకూర్చాలని కోరారు. మంత్రి ప్రతిపాదనలపై పవర్ గ్రిడ్ సిఎండి బుర్రా వంశీరామమోహన్ సానుకూలంగా స్పందించారు. సిఎస్‌ఆర్ నిధుల ద్వారా బనగానపల్లె ప్రాంత అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కాగా, ఆంధ్రప్రదేశ్‌లో పవర్ గ్రిడ్ సంస్థ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం ఉంటుందని, కొత్త ప్రాజెక్టులతో ఏపిలో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఈ సందర్భంగా మంత్రి ఆహ్వానించారు.

## శ్రీనివాస్ రాజీనామాకు ప్రభుత్వం ఆమోదం

**విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎజిఐసిఎల్) చైర్మన్ ఎస్‌విఆర్ శ్రీనివాస్ పదిరోజుల క్రితం రాజీనామా సమర్పించారు. ప్రభుత్వం ఈ రాజీనామాను ఆమోదించింది. బుధవారం నుంచే ఆయన ఉద్యోగ బాధ్యతల్లో లేరనే విషయాన్ని స్పష్టంచేస్తూ గురువారం నోట్‌లో తెలిపింది.. సిఆర్‌డిఏ ఏర్పాటైన తరువాత ఉన్నతస్థాయిలో ఉన్న వ్యక్తి రాజీనామా సమర్పించడం ఇదే తొలిసారి. తల్లి ఆరోగ్యం బాగోలేదని అందువల్లే తాను రాజీనామా సమర్పిస్తున్నానని లేఖలో పేర్కొన్నారు. కార్యాలయ నిర్వహణ, సిబ్బంది లేకపోవడం, నియామకానికి వీలుగా చర్యలు తీసుకోకపోవడంతో రాజీనామా సమర్పించినట్లు సమాచారం. రాజధానిలో కీలకమైన రివర్ ఫ్రంట్, ఎన్‌టిఆర్ విగ్రహం ఏర్పాటు, ఎయిర్‌పోర్టు, ఇన్నర్ రింగురోడ్డు, స్మార్ట్ ఇండస్ట్రీలు, రోప్‌వే, ఐకానిక్ బ్రిడ్జి వంటి పనులతో పాటు భవిష్యత్‌లో చేపట్టే పనులనూ ఎజిఐసిఎల్‌కు అప్పగించారు. అయితే పనుల పర్యవేక్షణ, నిర్వహణ అంశాల్లో తొలి నుండి ఉత్సాహంగానే వ్యవహరించిన శ్రీనివాస్ సమీక్షల సమయంలో అతని పట్ల వ్యవహరించిన తీరు, ప్రతి విషయానికి కమిషనర్‌ను సంప్రదించాలని చెప్పడం వంటి కారణాలతో కొంత అసహనానికి గురై రాజీనామా సమర్పించారని సమాచారం.

## టెట్ ఆన్‌లైన్ దరఖాస్తులో తప్పులు సవరించుకోవడానికి 5 వరకు అవకాశం

**విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ప్రయత్నం చేస్తున్న అభ్యర్థులకు రాష్ట్ర విద్యాశాఖ కీలక ఊరటనిచ్చింది. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియలో అభ్యర్థులు పొరపాటున నమోదు చేసిన తప్పులను సరిదిద్దుకునేందుకు ప్రభుత్వం ఒక అవకాశాన్ని కల్పించింది. దరఖాస్తు సమర్పించిన తర్వాత ఏవైనా పొరపాటులు గుర్తిస్తే వాటిని సవరించుకోడానికి గతంలో ఉన్న ఇబ్బందులను తొలగిస్తూ వన్‌టైమ్ డిలీట్ అనే సరికొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. టెట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ దరఖాస్తు ఫామలో పేరు, విద్యార్హతలు, లేదా ఇతర వ్యక్తిగత వివరాలను నమోదు చేసేటప్పుడు కొన్నిసార్లు తప్పులు చేస్తుంటారు. ఇటువంటి తప్పులు వల్ల భవిష్యత్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ సమయంలో ఇబ్బందులు ఎదురవుతాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని అభ్యర్థులు ఇప్పటికే సమర్పించిన దరఖాస్తును పూర్తిగా డిలీట్ చేసి, సరైన వివరాలతో మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు టెట్ కన్వీనర్ వెంకట్ కృష్ణారెడ్డి అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఈ సవరణ ప్రక్రియ నిరంతరం అందుబాటులో ఉండదు. కేవలం పరిమిత కాలం మాత్రమే ఈ అవకాశం ఉంటుంది. గురువారం (జులై 2) నుంచి ఐదో తేదీ వరకు మాత్రమే అభ్యర్థులు ఈ వన్ టైమ్ డిలీట్ ఆప్షన్ వినియోగించుకోవచ్చు. నిర్ణీత గడువు ముగిసిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లో దరఖాస్తుల సవరణకు అవకాశం ఉండదని అధికారులు స్పష్టం చేశారు. అభ్యర్థుల అధికారిక టెట్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమ లాగిన్ వివరాలతో ప్రవేశించాలి. అక్కడ వన్‌టైమ్ డిలీట్ అనే ఐచ్ఛికాన్ని ఎంచుకోవాలి. దీని వల్ల పాత దరఖాస్తు వ్యవస్థ నుంచి డిలీట్ అవుతుంది. ఆ తర్వాత అభ్యర్థులు తాజా వివరాలతో ఎటువంటి తప్పులు లేకుండా దరఖాస్తు తిరిగి సబ్‌మిట్ చేయాలి అని సూచించారు.

## ఎపిఎన్ఆర్‌టి కోఆర్డినేటర్ల నియామకం

**విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వం ఎపిఎన్ఆర్‌టి కోఆర్డినేటర్లను ప్రకటించింది. దేశవిదేశాల్లోని ప్రవాసాంధ్రుల సంక్షేమం కోసం ప్రాంతీయ, రాష్ట్ర, దేశస్థాయిలో 600 మందికి పైగా కోఆర్డినేటర్ల నియామకం చేపట్టింది. వీరు ప్రవాసాంధ్రుల సంక్షేమం, అభ్యున్నతికి కృషి చేయనున్నారు. ఎపిఎన్ఆర్‌టితో సమన్వయం చేస్తూ భారత ఎంబసీలు, స్థానిక ప్రభుత్వాలతో సమన్వయం చేస్తూ సేవలందించనున్నారు.

## కె.వెంకటరామిరెడ్డికి 14 రోజుల రిమాండ్

**విజయనగరం (బొబ్బిలి), జులై 2 ప్రభాతవార్త:** హైదరాబాద్‌కు చెందిన కె.వి.ఆర్ టీవీ నిర్వాహకుడు కె.వెంకటరామిరెడ్డికి 14 రోజులు రిమాండ్ విధిస్తూ గురువారం బొబ్బిలి కోర్టు సీనియర్ సివిల్ జడ్జ్ ఎం.రోహిణీరావు తీర్పు వెలువరిం చారు. మంగళవారం హైదరాబాద్ లోని ఆయన నివాసంలో పోలీసులు అరెస్టు చేసి బుధవారం మధ్యాహ్నం బొబ్బిలి స్టేషన్‌కి తీసుకువచ్చారు. బొబ్బిలి రూరల్ సీఐ ఎస్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు అతన్ని అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా అతనికి రిమాండ్ విధించారు. కె.వి.రెడ్డి రాజ్యాంగాన్ని అసభ్యకర పదజాలాలతో బూతులతో కించపరిచారన్న అభియోగంపై ఏప్రిల్ 10న బాడంగి పోలీస్ స్టేషన్‌లో కండి రమేష్ అన్న బాడంగి వ్యక్తి కేసు పెట్టారు. సీఎం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై విమర్శలు చేసినట్లు ఆరోపణ ఆయన వ్యాఖ్యానాలు యూట్యూబ్‌లో ప్రచారం అయ్యాయని అవి తమను ఎంతో కించపరిచాయని బాడంగికి చెందిన మాజీ సర్పంచ్ కండి రమేష్ పోలీస్ స్టేషన్లో కేసు వేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి బాడంగి పోలీసులు కెవి రెడ్డిని అరెస్టు చేసేందుకు వెళ్లి విఫలమయ్యారు. రాజ్యాంగాన్ని కించపరిచినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడు పై నాన్బెల్ వారెంట్ జారీ చేశారు. ఈ ఆదేశాల మేరకే సీఎస్ శ్రీనివాస్ తన సిబ్బంది తీవ్ర ప్రతిఘటన మధ్య నిందితుడిని అరెస్టు చేసి బొబ్బిలి తరలించారు. ఏవీ రెడ్డిని బొబ్బిలి కోర్టులో హాజరు పరిచేందుకు జరిగిన సన్నాహాల్లో భాగంగా ముందుగా అతడు స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. స్థానిక కోర్టుకు ఇతర సిబ్బంది వచ్చి సమాచారాన్ని కోర్టు అధికారులకు తెలిపారు ఈలోగా ఏమి జరుగుతుందో ఏమో గాని నిందితుడిని కోర్టులో ఆధారపరచలేదు. నిందితుడు రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఉంచారు ఉదయం బొబ్బిలి కోర్టులో హాజరపరిచారు. జూనియర్ సివిల్ జడ్జ్ ఎం.రోహిణీరావు ఆదేశాల మేరకు కేవీరెడ్డిని స్థానిక సభ్యులు తరలించారు నిందితుడిని తన కస్టడీకి తీసుకొని విచారించాలన్న పోలీసు అభ్యర్థులను కోర్టు ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.



## వైవాహిక జీవితం సుఖమయంగా సాగాలి

**• నూతన దంపతులను ఆశీర్వదించిన మంత్రి లోకేశ్**

**తిరుమల, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** వైవాహిక జీవితంలోకి అడుగుపెడుతున్న నూతన దంపతులు సుఖమయంగా ఉండాలని, అంతా మంచి జరగాలని రాష్ట్రమంత్రి నారాలోకేశ్ ఆశీర్వదించారు. తిరుమలలోని కర్నాటక భవన్‌లో గురువారం ఉదయం జరిగిన టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి కుమార్తె డాక్టర్ వైష్ణవి, డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డిల వివాహానికి మంతి హాజరయ్యారు. వివాహ మహోత్సవంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. నూతన దంపతులకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి వెంట భానుప్రకాశ్ రెడ్డి, కుమారుడు జి.పృథ్వీరెడ్డి ఉన్నారు. గురువారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్న అనంతరం లోకేశ్ కర్నాటక భవన్‌కు చేరుకున్నారు.



## నాదెండ్ల బ్రహ్మం చౌదరి దంపతులకు మంత్రి లోకేశ్ ఆశీస్సులు

తిరుమల,జులై 2ప్రభాతవార్తప్రతినిధి: తిరుపతి నగరంలోని భూపాల్ హౌసింగ్ లో గురువారం ఉదయం జరిగిన టిడిపి సామాజిక మాధ్యమం యాక్టివిస్ట్ కే.గౌతమి శ్వేత నివాసానికి రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ విచ్చేశారు.కాబోయే నూతన వధూవరులు రాష్ట్ర కమ్మ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి, గౌతమి శ్వేతలను మంత్రి లోకేష్ ఆశీర్వదించారు. ఇక్కడ మంత్రి లోకేష్ సమక్షంలో వధూవరులు ఉంగరాలు మార్చుకున్నారు. ఇదిలా ఉండగా గురువారం రాత్రి తిరుమలలోని శృంగేరీ శారద పీఠంలో నాదెండ్ల బ్రహ్మం చౌదరి, గౌతమి శ్వేతల వివాహం అత్యంత వేడుకగా జరిగింది. పలువురు ప్రముఖులు, టిడిపి ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

# ఎపికి మేనమామ నవుతా..!

**• మార్కెట్ ఇంటర్వెన్షన్ కింద తోతాపురి మామిడి కొనుగోళ్లకు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ హామీ**



**ఓబులవారిపల్లి (తిరుపతి కలెక్టరేట్), జులై 2 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం ముక్కావారిపల్లి గ్రామంలో 4.55 లక్షల వ్యయంతో ప్రతిపాదించిన మూడు పనుల్ని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్‌కల్యాణ్ గరువారం ఉదయం లాంఛనంగా ప్రారంభించారు. సామాజిక వర్షపు నీటి సంరక్షణ కుంట, మ్యాజిక్ డ్రెయిన్, మొక్కల పెంపకం కార్యక్రమాలను వీబీ జీ రామ్ జీ మిషన్ కింద తొలుత చేపట్టారు. దేశంలోని గ్రామాలను అభివృద్ధి చేసేందుకే వీబీజీ రామ్ జీ కింద రూ.7.5 లక్షల కోట్లు వ్యయం చేయాలని నిర్ణయించామని అన్నారు. ఈ 9 నెలల కాలానికి ఈ పథకం కింద ఏపీకి కేంద్రం నుంచి రూ.7,700 కోట్లు విడుదల చేస్తామని అన్నారు. స్వయంగా గ్రామ సభలే పంచాయితీలో పనుల్ని నిర్దేశించుకుంటాయని తెలిపారు. తనను మధ్యప్రదేశ్ లో అంతా మామాజీ అని పిలుస్తారని.. ఇప్పుడు ఏపీకి కూడా తాను మేనమామ అయ్యానని మంత్రి వ్యాఖ్యానించారు. ఏ మేనమామ ఖాళీ చేతులతో రాడని, ఏపీకి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద 74,212 పక్కా ఇళ్లు, గ్రామీణ ప్రాంతాలను అనుసంధానించే రోడ్ల నిర్మాణానికి రూ.422 కోట్ల నిధులు ఇవ్వనున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించిన పత్రాలను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎంలకు ఆయన అందజేశారు. అలాగే 2,16,250 మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడిని మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద కేంద్రం కొనుగోలు చేస్తుందని ఆయన ప్రకటించారు. దీనికి సంబంధించిన పత్రాలను కూడా సీఎం చంద్రబాబుకు ఆయన అందజేశారు. ఎపికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఎక్కడా చేయి విడిచి పెట్టేది లేదని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ తమ పుట్టిన రోజున కనీసం ఒక మొక్క నాటేలా సంకల్పం తీసుకోవాలని మంత్రి పిలుపు ఇచ్చారు.

# గ్రామీణ పేదలకు విబి జిరామ్‌జితో ఉపాధి భరోసా

**• కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వెల్లడి**




**కొడవలూరు (నెల్లూరు), జులై 2 ప్రభాతవార్త:** గ్రామీణ పేద కుటుంబాలకు స్థిరమైన ఉపాధి, ఆదాయ భద్రత కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత్ భారత్-గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అండ్ ఆ జీవిక మిషన్-గ్రామీణ్ (వీబీ- జీ రామ్- జీ) పథకం గ్రామీణ జీవనోపాధికి వరంగా నిలుస్తుందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. గురువారం కొడవలూరు మండలం రామన్నపాళెం పంచాయతీలో నిర్వహించిన పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వీబీ- జీ రామ్- జీ పథకంతో జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్లో ప్రారంభం కావడం రాష్ట్రానికి గౌరవకరమని తెలిపారు. గ్రామాల్లో ఉపాధి అవకాశాల పెంపు, పేద కుటుంబాలకు జీవనోపాధి భద్రత, మౌలిక సదుపాయాల అభివృద్ధి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని వివరించారు. వ్యవసాయ పనులకు అంతరాయం కలగకుండా పంట నాట్లు, కోతల సమయంలో 60 రోజుల పని విరామం కల్పిస్తూ, గ్రామీణ పేదలకు ఏడాదికి 125 రోజుల ఉపాధి కల్పించేలా పథకాన్ని రూపొందించినట్లు తెలిపారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత రెండేళ్లలో కేంద్రం నుంచి రూ.14 లక్షల కోట్ల విలువైన నిధులు లభించాయని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కొడవలూరు మండల అధ్యక్షుడు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, ఎంపీడీవో వెంకట సుబ్బారావు, ఏపీడీఓ మృదుల, ఈసీ సోఫియా సుల్తాన్, టెక్నికల్ అసిస్టెంట్ సుప్రజ, సొసైటీ చైర్మన్ బద్వేల్ వినీల్ రెడ్డి, దేగ దయాకర్ రెడ్డి, కాకి సీనయ్యతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

EASTERN POWER DISTRIBUTION COMPANY OF A.P. LTD
Corporate Office, P&T Colony, Seethammadhara, Visakhapatnam-530 013.

ape-Procurement Tender Notice

Tenders are invited from APEPDCL for supply of Fabricated materials, 11KV, 2 MVAR Capacitor Banks through ape-Procurement. For further details please visit www.apeprocurement.gov.in.

Phone No.: 0891-2582302,303
Email: cgm_pmm@apeasternpower.com Advt-29
Sd/-
Chief General Manager /P&MM

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండరు నోటీసు
నిట్ నెం.4/ఈఈ/2026-2027. తేది : 30.06.2026
కార్యనిర్వాహక ఇంజనీరు, (ర.భ) డివిజను, ఏలూరు పరిధిలో మరమ్మతులు 01 పని నిమిత్తమై మొత్తం విలువ : రూ.40.00 లక్షలకు టెండర్ ఆహ్వానించడమైనది. టెండర్ స్వీకరించు తేదీలు: 06.07.2026 నుండి 14.07.2026, మ.3.00గం.ల వరకు. తదుపరి వివరాలను https://tender.apeprocurement.gov.in నందు చూడవచ్చును. ఫోన్ నెం: 9440818053.
సం/-. కార్యనిర్వాహక ఇంజనీరు (ర.భ), ఏలూరు.
DIPR.NO. 20804/CL/ADVT/1/1/2022-23 తేది: 02.07.2026

వార్త

పట్టణాల శోభ ఎక్కడైనా ఒక్కటే, ప్రకృతి అందాలే పల్లెకొవిధంగా పరిమళిస్తుంటాయి.

-తిరుక్కురళ్

# పతనం అంచున ప్రజారోగ్యం!


జనారోగ్యమే జాతి మహాభాగ్యమనే ఆశయం, లక్ష్యాల కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని దేశ ప్రజలందరికి వైద్యసేవలు అందుబాటులోకి తెస్తామని పాలకులు ఎంతగా చెప్తున్నా ఆచరణకు వచ్చేసరికి కనీస వైద్యసదుపాయాలు అందించలేకపోతున్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఈ లక్ష్యసాధన కోసం ఎన్నో లక్షల కోట్ల రూపాయలు వెచ్చించారు, వెచ్చిస్తున్నారు.అయినా ఆశించిన ఫలితాలు చేకూరడం లేదు. దేశానికిపట్టుగొమ్మలైన గ్రామసీమల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగానే ఉందని చెప్పొచ్చు. అందరికి వైద్యం అనేది దశాబ్దాలు దాటిపోయినా కనుచూపు మేరలో కన్పించడం లేదు. ఇప్పటికీ భారత్‌లో దాదాపు నలభైఏడు కోట్ల మందికి పైగా అత్యవసర మందులు, వైద్యం అందుబాటులో లేవని చెప్తున్నారు. అన్నిటికంటే ముఖ్యంగా దేశంలో మధ్యతరగతి ప్రజలు పెట్టే ఖర్చులో దాదాపు డెబ్భై శాతం పైగా మందుల కొనుగోళ్లకే ఖర్చు చేస్తున్నారు. ప్రధానంగా సీజన్ మారినప్పుడల్లా ప్రజారోగ్యంపై రోగాలదాడి ఊహించని రీతిలో పెరిగిపోతున్నది. కొత్త కొత్త మందులు,సాంకేతిక పరిజ్ఞానంతో చికిత్సలు అందిస్తున్నా అంతకు రెట్టింపుస్థాయిలో రకరకాల వ్యాధులు విస్తరిస్తూనే ఉన్నాయి. ఈ వ్యాధులను నియంత్రించడంలో సమర్థవంతంగా వ్యవహరించలేకపోతున్నారని చెప్పొచ్చు. మొన్నటి కరోనా సృష్టించిన బీభత్సం నుండి ఇంకా కొందరు సంపూర్ణ ఆరోగ్యవంతులు కాలేకపోతున్నారు. ఆ వ్యాధి నుండి బయటపడేందుకు అప్పుడు వాడిన మందుల ప్రభావం నుండి నేటికీ కొలుకోలేకపోతున్నారు. ముఖ్యంగా గుండెజబ్బులు, కిడ్నీ తదితర వ్యాధులు విస్తరించిపోతున్నాయి. ఇక సీజన్‌తోపాటు వచ్చే వ్యాధుల గురించి చెప్పక్కర్లేదు. మలేరియా నిర్మూలనకు పెద్దఎత్తున చర్యలు తీసుకుంటున్నామని పాలకులు ఎంతగా చెప్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులువేరుగా ఉన్నాయి.ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో వైద్యం అందుబాటులో లేదనే చెప్పొచ్చు. కలుషిత నీరు, దోమల కారణంగా డెంగ్యూ, స్వైన్‌ఫ్లూ, చికెన్‌గున్యా లాంటి వ్యాధులు ప్రబలిపోతున్నాయి. గిరిజన ప్రాంతాల్లో మందులు అందుబాటులో లేకపోవడంతో పసర్లు, వేర్లు, ఆకులతో వచ్చీరాని నాటువైద్యంతో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఇకపోతే పట్టణాల్లో, నగరాల్లో ముఖ్యంగా మురికివాడుల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ప్రభుత్వ ఆస్పత్రులే కాదు ప్రైవేట్ ఆస్పత్రులు కూడా రకరకాలజ్వరాల బాధితులతో కిటకిటలాడుతున్నాయి. వీటన్నింటికంటే మించి నకిలీ, నాసిరకం మందులు జనారోగ్యాన్ని పతానంచుకు తీసుకుపోతున్నాయి. దేశవ్యాప్తంగా నమోదైన మందుల రకాల కంటే రెట్టింపు స్థాయిలో నకిలీ, నాసిరకం మందులు చెలామణి అవుతున్నాయి. ఇవి విచ్చలవిడిగా సరఫరా చేస్తున్నారు. ప్రజారోగ్యాన్ని గుల్లచేస్తున్న ఈ నకిలీ మందులు ఒక వ్యూహం ప్రకారం ప్రవేశపెడుతున్నారు. అప్పుడప్పుడు పట్టుబడుతున్నా ఏదో నామమాత్రపు కేసులతో కాలం గడుపుతున్నారే తప్ప నిర్దిష్టమైన చర్యలు తీసుకొని మళ్లీమళ్లీ పునరావృతంకాకుండా చేయలేకపోతున్నారు. మందుల్లో ప్రామాణికత దెబ్బతినడంవల్ల చోటు చేసుకుంటున్న అనర్థాలు అన్నీఇన్నీకావు. గతంలో నకిలీ మందులు వాడటంతో ఎందరో ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. వాస్తవంగా ఆనాడే ప్రభుత్వం చర్యలకు శ్రీకారం చుట్టింది. ముంబాయిలో నాసిరకం మందులతో పది మందికిపైగా మరణించడంతోప్రభుత్వం జస్టిస్ లెంటిన్ కమిషన్‌ను నియమించింది. మంత్రిత్వ స్థాయి మొదలు దిగువ స్థాయి వరకు ఆరోగ్య, ఔషధ విభాగాల్లోని లొసుగులను వైఫల్యాలను అవినీతిని ఎత్తి చూపుతూ లెంటిన్ తన నివేదికలో ఆనాడే స్పష్టంగా పేర్కొన్నారు. ఆ నివేదికలో చేసిన ప్రతిపాదనలు పాలకులు అంతగా పట్టించుకోలేదనే చెప్పొచ్చు.నకిలీ మందుల వల్ల కలిగే దుష్ప్రభావాలు అటుంచి జబ్బు తగ్గకపోతే వైద్యుడి వైఫల్యమా? ఉపయోగించిన మందులు కారణమా అర్థంకాక వైద్యుడు మళ్లీ మళ్లీ పరీక్షలు చేయిస్తూ ఇతర మందులతో రోగులపై ప్రయోగాలు చేస్తున్నారు. దానివల్ల రోగి ఆరోగ్యంతోపాటు ఆర్థికంగా కూడా కుప్పకూలిపోతున్నాడు. అసలు వైద్య, ఆరోగ్య విషయంలో నిర్దిష్టమైన ప్రణాళిక,ముందుచూపు లేకపోవడంతోనే ఈ పరిస్థితులు దాపురిస్తున్నాయి. గత రెండు,మూడు వారాలుగా దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న విషజ్వరాలుప్రధానంగా గ్రామీణ ప్రాంతాలను అతలాకుతలం చేస్తున్నాయి.ఇందులో మలేరియా, డెంగ్యూ అగ్రస్థానంలో ఉన్నట్లువార్తలు అందుతున్నాయి. అయితే గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధిని ముఖ్యంగా డెంగ్యూను సకాలంలో గుర్తించలేకపోతున్నారు.వ్యాధి ముదిరి ప్రాణాలకు ముప్పు తెస్తున్నది. అన్నిటికంటే ముఖ్యంగా డెంగ్యూ వ్యాధికి ఇప్పటివరకు ఖచ్చితమైన ఔషధం, టీకా లేకపోవడంతో విస్తరణను అడ్డుకోలేకపోతున్నారు. పెరుగుతున్న వ్యాధుల బారిన పడుతున్న రోగులకు తగినట్టుగా ఆస్పత్రులు కానీ, సిబ్బంది కానీ లేవనిచెప్పొచ్చు.దారిద్ర్యరేఖకు దిగువనున్న బడుగు వర్గాల కుటుంబాలకు వైద్యం అందుబాటులో లేదు. దీంతో కొన్ని గ్రామాల్లో వచ్చీరాని వైద్యంతో డాక్టర్లుగా చెలామణి అవుతూ తోచిన మందులు ఇచ్చేవారు కూడా తక్కువ సంఖ్యలో లేరు. కనీసం మందుల పేర్లు స్పష్టంగా రాయలేనివారు కూడా డాక్టర్ల జాబితాలో చేరిపోతున్నారు. చిన్న చిన్న ఆపరేషన్లు చేయడానికి కూడా వెనుకాడడం లేదు. రాబోయే రోజుల్లో ప్రజారోగ్యం అత్యంత క్లిష్టపరిస్థితులు ఎదుర్కోబోతున్నట్లు వైద్యనిపుణులే అభిప్రాయపడుతున్నారు. పాలకులు ఇప్పటికైనా గత అనుభవాలతో పాఠాలు నేర్చుకొని ప్రజారోగ్యం ఎదుర్కోబోతున్న సవాళ్లకు అనుగుణంగా సమాయత్తం కావాలి.

మనకుగల శక్తిని బట్టి మనలను మనం అంచనా వేసుకుంటాం. మనం చేసిన పనులను బట్టి ఇతరులు మనల్ని అంచనా వేస్తారు.



హెచ్. పోర్టర్

మామూలు మనుషులు కాలాన్ని ఎలా ఖర్చు చేయాలా అని ఆలోచిస్తే తెలివిమంతుడు కాలాన్ని ఉపయోగించుకోవడానికి ప్రయత్నిస్తాడు.



సెయింట్ బెర్నార్డ్

## ప్రజావాక్కు



### రైళ్లలో నాణ్యమైన ఆహారం అందేనా?

ముంబై వెళ్తున్న తేజస్ ఎక్స్‌ప్రెస్‌లో ఓ ప్రయాణికుడికి అందించిన వెజ్ బిర్యానీలో ఈగ కనిపించిన ఘటన మరోసారి భారతీయ రైల్వేల్లో అందిస్తున్న ఆహార నాణ్యతపై ప్రశ్నలు లేవనెత్తింది. ప్రయాణికులు పూర్తి ధర చెల్లించి భోజనం కొనుగోలు చేస్తున్నప్పటికీ, కొన్ని సందర్భాల్లో నాణ్యతలేని, అపరిశుభ్రమైన ఆహారం అందుతుండటం ఆందోళనకలిగిస్తోంది. ఈఘటనపై సంబంధిత విక్రేతకు రూ.1 లక్ష జరిమానా విధించి, లైసెన్స్ రద్దుకు షోకాజ్ నోటీసు జారీ చేయడం స్వాగతించదగ్గ చర్యే. అయితేఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడటమే అసలు లక్ష్యం కావాలి. రైలులో అందించే ఆహారం కేవలం సేవ మాత్రమే కాదు, ప్రయాణికుల ఆరోగ్యానికి సంబంధించిన అంశం కూడా. అపరిశుభ్రమైన ఆహారం వల్ల ఫుడ్ పాయిజనింగ్ వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. భారతీయ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ఆహార నాణ్యతపై మరింత కఠినమైన పర్యవేక్షణ వ్యవస్థను అమలు చేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### తల్లిదండ్రుల బాధ్యత పిల్లలదే..

నవమాసాలు మోసి కని పెంచి విద్యాబుద్ధులు నేర్పి, ఎదుగుదలకుకృషి చేసిన తల్లిదండ్రులను ముదివయస్సు రాగానే నిర్లక్ష్యం చేయడం తగదు. ఆస్తిపాస్తులు అందగానే భారంగా భావించివృద్ధాశ్రమం, బస్టాండు, రైల్వే స్టేషన్‌లో వదిలిచేతులు దులుపుకోవడం ఇటీవల ఎక్కువ అవుతుండడం ఆందోళనకరం.మానవతానికి మాయని మచ్చఅంటే అతిశయోక్తికాదు.జీవిత చరమాంకంలో మన వాళ్లతో ప్రేమ, ఆప్యాయతల పలకరింపు కోసమై ఎదురు చూస్తుంటారు. నడిచే దేవుళ్లు జననీజనకులు. వార్ధక్యం దశ చిన్న పిల్లలంటారు. కావున కంటికి రెపపలా కాపాడుకోవాలి. రేపటిపౌరులు కూడా ఇదేబాటలో నడుస్తారు. ప్రత్యేక చట్టం అమలులో ఉండడం ఆనందదాయకం.

- ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూర్లు

### కార్మికులను పట్టించుకోరా..

నేటి భారతంలో అధిక పనుల పేరిట ఆదివారం కూడా ఆకలి మంటలకోసం అహర్నిశలు కృషి చేస్తూ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా ప్రైవేట్ ఆఫీసులు,ఆసుపత్రుల బంధిఖానలో తీవ్రఅనారోగ్యానికి గురవుతున్న కార్మికులు కుటుంబం గురించి ఆలోచించి ముందుకు సాగాలి.

- ఎం. శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### బ్లాక్ మెయిల్ కార్యకర్తలపై నిషేధం

సమాచారహక్కు చట్టాన్ని దుర్వినియోగపరుస్తూ అధికారులను బ్లాక్ మెయిల్ చేస్తున్న కొంతమంది కార్యకర్తలపై నిషేధం విధించాలని ఈమధ్య ఆర్టీఐ చీఫ్ కమిషనర్ ఆదేశించారు.ఎందుకంటే ఇలాంటివారి వలన అసలైన కార్యకర్తలకు చెడ్డపేరు వస్తుంది. బ్లాక్ మెయిలర్స్‌కు ఖచ్చితంగా అడ్డుకట్ట వెయ్యాలి. అయితే చీఫ్ కమిషనర్ కార్యకర్తలు అడిగిన సమాచారాన్ని తగినకాలంలో ఇవ్వని పీఐఒ పై, మొదటి అప్పిల్లేట్ అధికారులపై, సకాలంలో సమాధానం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారులపై కూడా శాఖాపరమైన చర్యలు గాని, జరిమానా విధించటం గానీ ఖచ్చితంగా అమలుపరచినప్పుడే కమిషనర్లను కార్యకర్తలు నమ్ముతారు. ఎంతమంది అధికారులపై చర్యలు తీసుకున్నారో లేక జరిమానావిధించారో కూడాకమిషనర్ పత్రికలకు ఇస్తేకార్యకర్తలకు ధైర్యం వస్తుంది.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### పే కమిషన్ నత్తనడక

ఒక కమిషన్ వేసి సంవత్సరాలు ఆలస్యం చేసి మొత్తం దేశం అంతా దానిని ఊరేగించి పెద్దల ఎదుట పెట్టి (పార్లమెంట్ ) హారతిఇప్పించి చేయడానికి 2సంవత్సరాలు పడటం నిజంగా హాస్యాస్పదం.దానికిఫైనాన్స్ మినిస్టర్‌నిట్టూర్పులు ఇక ఎన్నో చెప్పలేము. ఆవిడ అందరికీ వరాల జల్లులు కురిపిస్తారు పాపం ఉద్యోగుల మొహాలు చూస్తే ఆవిడకెందుకో నచ్చదు. డిఏలు, బేసిక్లు, హెచ్‌ఆర్‌ఏలు, ఏరియర్లు అంతకన్నా ముఖ్యంగా టాక్స్‌రిలీఫ్‌లు కనపడతాయి. అదే ఎంపిలకు ఒక లక్ష పెంచడానికి ఆవిడ సూపర్ సోనిక్ రాకెట్‌ను ఉపయోగిస్తారు. ఒక గంట అనుకోవడం వేరే నిమిషంలో ఆర్డర్స్. ఈ ఎనిమిదోవ పే కమిషన్ గూడ్స్ ఎప్పుడు మన స్టేషనకి వస్తుందో.

- గార్లపాటీ సీతారామయ్య, హైదరాబాద్

### ఉద్యోగావకాశాల కల్పన

భారతదేశంలోనే మొట్టమొదటి క్వాంటం టెక్ పార్క్‌గా గుర్తింపు పొందనున్న అమరావతి క్వాంటం వ్యాలీ ప్రాజెక్ట్ ఉద్ధండ రాయునిపాలెంలో ఏర్పాటు అవుతోంది. దీని ప్రధాన లక్ష్యం 133క్యూబిట్లక్వాంటం కంప్యూటర్(సిస్టమ్2)ను నెలకొల్పడం. ఐబీఎం, టీసీఎస్ వంటి గ్లోబల్‌సంస్థల సహకారంతో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా పరిశోధకులు, స్టార్టప్‌లకు అత్యాధునిక సాంకేతిక వనరులు అందుబాటులోకి వస్తాయి.ఈ ప్రాజెక్ట్ వల్ల దాదాపు లక్ష ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

-కె.రామకృష్ణ, నల్గొండ జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# సామాజిక ఉద్యమమే శాశ్వత పరిష్కారం!

**'కూరగాయల మార్కెట్‌కు వెళ్లేటప్పుడు చేతిలో ఒక బట్ట సంచి పట్టుకెళ్లడం' అనే ఒక చిన్న అలవాటు రేపటి తరం భవిష్యత్తును మార్చగలదు. వ్యాపారులు లాభాపేక్షను పక్కనపెట్టి, వినియోగదారులు బద్ధకాన్ని వదిలిపెట్టి స్వచ్ఛందంగా 3ఆర్ (రిడ్యూస్, రీయూస్, రీసైకిల్) సూత్రాన్ని నిత్యజీవితంలో అమలు చేయాలి. ఒక చేత్తో ప్లాస్టిక్ మహమ్మారిని బహిష్కరిస్తూ, మరో చేత్తో పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ఆహ్వానించినప్పుడే ఈ యుద్ధంలో మనం గెలుస్తాం. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని కేవలం ఒక రోజు నినాదాల వేడుకగా కాకుండా, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం ప్రభుత్వాల బాధ్యతతో ముగిసే కార్యక్రమంకాదు, ప్రతి పౌరుడు చేపట్టాల్సిన జీవన ఉద్యమం. అది కేవలం పర్యావరణ పరిరక్షణ కోసం కాదు, రాబోయే తరాల మనుగడ కోసం చరిత్ర మనపై ఉంచిన బాధ్యత.**



ఫిరోజ్ ఖాన్

మనం ప్లాస్టిక్‌ను వాడుతున్నామా.. లేక ప్లాస్టిక్కేమనల్ని వాడుకుంటూ నిశ్శబ్దంగా మన సమాధిని తవ్వుతోందా? ఆధునిక మానవాళి అలవాటు చేసుకున్న 'యూజ్ అండ్ త్రో' సంస్కృతి నేడు భూగోళానికి నిశ్శబ్ద ముప్పుగా మారింది. ఉదయం లేచింది మొదలు పాలు, కూరగాయల నుంచి రాత్రి పడుకునే వరకు ప్రతి అవసరానికి ప్లాస్టిక్ కవర్లపై ఆధారపడటం ఒక సామాజిక వ్యసనంగా మారింది. కేవలం 12 నిమిషాల సగటు కాల పరిమితి కోసం మనం వాడి విసిరేసే ఈ ఒక్క సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సంచి, ఈ భూమిపై పూర్తిగా విచ్ఛిన్నం కావడానికి 500 నుండి 1000 సంవత్సరాల సమయం పడుతుందనే నిజం మనల్ని నిలువునా వణికించకమానదు. ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం విడుదల చేసిన పర్యావరణ నివేదికల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా ప్రతి నిమిషానికి 10 లక్షల ప్లాస్టిక్ సంచులు వినియోగంలోకి వస్తున్నాయి. వాటిలో అత్యధికం చివరికి చెత్తకుప్పలకే చేరుతున్నాయి.ఇక్కడ ఉద్భవిస్తున్న పదునైన ప్రశ్న ఒక్కటే. పర్యావరణాన్ని నిశ్శబ్దంగా మింగేస్తున్న ఈ మహమ్మారిని అరికట్టడానికి తెచ్చిన కఠినమైన చట్టాలు, క్షేత్రస్థాయిలో ఎందుకు కాగితాలకే పరిమితమవుతున్నాయి? ప్రస్తుత వర్షాకాలంలో విచ్చలవిడిగా పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు భూమి, ఆకాశం, జలాలను కలుషితం చేస్తూ పర్యావరణ సమతుల్యతను దారుణంగా దెబ్బతీస్తున్నాయి. ప్లాస్టిక్ సంచుల వల్ల మురుగు కాల్వలు, డ్రైనేజీ వ్యవస్థలు పూడిపోయి నగరాలు స్వల్ప వర్షాలకే జలమయమవుతున్నాయి. అందుకు 2005 జులైలో ముంబై నగరంలో సంభవించిన భారీ వరదలకు ప్లాస్టిక్ వ్యర్థాలే ప్రధాన కారణమని నిపుణుల కమిటీలు అధికారికంగా తేల్చడం ఒక చారిత్రకసాక్ష్యం అంతకంటే భయంకరమైన విషయం ఏమిటంటే, ఎల్లెన్ మాక్‌ఆర్థర్ ఫౌండేషన్ పరిశోధనా పత్రాల ప్రకారం, ఇదే పరిస్థితి కొనసాగితే 2050 నాటికి సముద్రాలలో చేపల మొత్తం బరువు కంటే ప్లాస్టిక్ వ్యర్థాల బరువే ఎక్కువగా ఉంటుందని అంచనా. ఈవ్యర్థాలు నీటిలో విచ్ఛిన్నమై మైక్రోప్లాస్టిక్స్(కంటికి కనిపించని ప్లాస్టిక్ రేణువులు) రూపంలో మారి సముద్ర జీవుల శరీరాల్లోకి, వాటి ద్వారా తిరిగి మానవ ఆహార గొలుసులోకి ప్రవేశిస్తున్నాయి. మనం పారేసిన విషం తిరిగి మన ప్లేట్లలోకే వస్తోందని, దీనివల్ల మానవ శరీరంలో క్యాన్సర్ కారకాలు, హార్మోన్ల అసమతుల్యత పెరుగుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలు హెచ్చరిస్తున్నాయి. పట్టణాలు, గ్రామాల్లో రోడ్లపై పారేసే ప్లాస్టిక్ చెత్తను ఆహారంగా భ్రమించి అమాయక పశువులు తింటున్నాయి, ఫలితంగా వాటి జీర్ణ వ్యవస్థలు దెబ్బతిని ప్రతిఏటా వేలాది మూగజీవాలు మృత్యువాత పడుతున్నట్లు



వెటర్నరీ నివేదికలు నిరూపిస్తున్నాయి.భారతదేశంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల జరుగుతున్న నష్టాన్ని నివారించడానికి కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ 2022 జులై 1 నుండి దేశవ్యాప్తంగా 19 రకాల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల ఉత్పత్తి, నిల్వ, పంపిణీ, అమ్మకాలపై అధికారికంగా కఠిన నిషేధం విధిస్తూ గెజెట్ నోటిఫికేషన్ జారీ చేసింది. చట్టం ప్రకారం ఉల్లంఘనలకు పాల్పడిన వారికి పర్యావరణ పరిరక్షణ చట్టం1986 కింద భారీ జరిమానాలతో పాటు ఐదేళ్ల జైలు శిక్ష విధించే నిబంధనలు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్లాస్టిక్ సంచుల వినియోగం ఇంకా యథేచ్ఛగా కొనసాగుతుండటం పాలనాపరమైన వైఫల్యాన్ని బట్టబయలు చేస్తోంది. ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 127 దేశాలు ప్లాస్టిక్ సంచులపై పూర్తిగా లేదా పాక్షికంగా నియంత్రణ చట్టాలు తెచ్చినప్పటికీ, ఆశించిన ఫలితాలు రాలేదు. అయితే, ఈ సమస్యకు మరో కోణం కూడా ఉంది. ఆల్ ఇండియా ప్లాస్టిక్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ గణాంకాల ప్రకారం, ప్లాస్టిక్ పరిశ్రమలపై ఆధారపడి దేశంలోలక్షలాది మంది కార్మికులు, చిన్న వ్యాపారులు జీవనోపాధి పొందుతున్నారు.వీరికి సరైన పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలను, రాయితీలతో కూడిన బట్ట సంచులు లేదా జూట్ బ్యాగుల తయారీ పరిశ్రమలనుప్రభుత్వం భారీగా ప్రోత్సహించకపోవడం, తగినంత సమయం ఇవ్వకుండా ఆకస్మిక చర్యలకు దిగడం కూడా చట్టం పూర్తి స్థాయిలో విజయవంతం కాకపోవడానికి ఒక ప్రధాన కారణంగా నిలుస్తోంది. ఈ భూమి మన సొంత ఆస్తి కాదు, రేపటి తరాలకు మనం ఇవ్వాల్సిన పచ్చని ఆస్తి. దీనిని ప్లాస్టిక్ సమాధిగా మార్చే హక్కు ఏ మనిషికీ లేదు. కేవలం ప్రభుత్వాల లాఠీలు, జరిమానాల వల్లే సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదు. చట్టాల పట్ల భయం కంటే సమాజంలో పర్యా వరణం పట్ల నైతిక భయం పెరగాలి. 2024లో జరిగిన ఐక్యరాజ్యసమితి ప్లాస్టిక్ ఒప్పంద చర్చలు సైతం కేవలం వినియోగాన్ని మార్చడం మాత్రమే కాదు, ఉత్పత్తి స్థాయిలోనే ప్లాస్టిక్‌ను నియంత్రించాలని స్పష్టం చేశాయి. 'కూరగాయల మార్కెట్‌కు వెళ్లేటప్పుడు చేతిలో ఒక బట్ట సంచి పట్టుకెళ్లడం' అనే ఒక చిన్న అలవాటు రేపటి తరం భవిష్యత్తును మార్చగలదు. వ్యాపారులు లాభాపేక్షను పక్కనపెట్టి, వినియోగదారులు బద్ధకాన్ని వదిలిపెట్టి స్వచ్ఛందంగా 3ఆర్ (రిడ్యూస్, రీయూస్, రీసైకిల్) సూత్రాన్ని నిత్యజీవితంలో అమలు చేయాలి. ఒక చేత్తో ప్లాస్టిక్ మహమ్మారిని బహి ష్కరిస్తూ, మరో చేత్తో పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ఆహ్వానించినప్పుడే ఈ యుద్ధంలో మనం గెలుస్తాం. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని కేవలం ఒక రోజు నినాదాల వేడుకగా కాకుండా, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం ప్రభుత్వాల బాధ్యతతో ముగిసే కార్యక్రమంకాదు, ప్రతి పౌరుడు చేపట్టాల్సిన జీవన ఉద్యమం. అది కేవలం పర్యావరణ పరిరక్షణ కోసం కాదు, రాబోయే తరాల మనుగడ కోసం చరిత్ర మనపై ఉంచిన బాధ్యత. ●

# ఇయు దేశాల్లోనూ పెరుగుతున్న ఆర్థిక సంక్షోభం

బొల్లిముంత సాంబశివరావు

యూరోపియన్యూనియన్ అనేది 27దేశాల మధ్య ఏర్పడిన ఒకప్రత్యేకమైన రాజకీయ, ఆర్థిక వ్యవస్థ. సభ్య దేశాల మధ్య వాణిజ్యాన్ని సులభతరం చేయడం, ఉమ్మడి చట్టాలను రూపొందించడం, ప్రజల స్వేచ్ఛాసంచారాన్ని ప్రోత్సహించడం దాని ముఖ్యఉద్దేశం. దీనికి యూరో కరెన్సీ ప్రత్యేకంగా ఉంది. 20 దేశాలు యూరో కరెన్సీని ఉపయోగిస్తున్నాయి.దీనిని యూరో జోన్ అంటారు. ఈయూ ప్రజలచే ఎన్నుకోబడిన పార్లమెంట్, యూరోపియన్ కమిషన్ ఈయూ పరిపాలన నిర్వహిస్తాయి. ఇది పెద్ద ఆర్థికవ్యవస్థను కలిగిఉంది. ప్రస్తుతం యూరోపియన్ యూనియన్ దేశాలు ఆర్థిక సంక్షోభంలో ఉన్నాయి. 2008 నాటి ప్రపంచ ఆర్థికమాంద్యం తర్వాత యూరప్ దేశాలు తమ ప్రభుత్వరంగాలను ద్రవ్యలోటును అదుపు చేయలేకపోయాయి.ఈ దేశాలన్నిటికీ ఒకే కరెన్సీ యూరో ఉండటం వల్ల, ఆర్థికకంగా వెనుకబడిన దేశాలు తమ సొంత కరెన్సీ ఏర్పాటు చేసుకునే అవకాశం కోల్పోయాయి. రియల్‌ఎస్టేట్ రంగంలో సమస్యలు, ప్రైవేట్ అప్పులు పెరిగిపోవడంవల్ల అనేక బ్యాంకులు దివాలా స్థాయికి చేరుకున్నాయి. యూరప్ సెంట్రల్ బ్యాంకు స్వతంత్రంగా పనిచేసినప్పటికీ, గ్లోబల్ ఫైనాన్షియల్ మార్కెట్లు, డాలర్ మారకం రేటు యూరప్ ఆర్థిక నిర్ణ యాలను తీవ్ర ప్రభావితం చేస్తున్నాయి. పెట్టుబడిదారీ దేశాల ఆర్థిక విధానాలు పేదరికాన్ని, సంపన్నవర్గాలను సృష్టిస్తుంది. యూరోపియన్యూనియన్లో ఈ విభజన ఎక్కు వగానే ఉంది. ఈ యూనియన్లో 27 దేశాలు ఉన్నాయి. ఈ దేశాల జనాభా 45 కోట్లు. ఇందులో 9.27 కోట్లమంది పేదరికంలో ఉన్నారు. ఇది మొత్తం జనాభాలో 20.9 గాఉన్నారు. ఇక్కడ పేదరికం కొలమానం వేరుగా ఉంటుంది. అంటే కనీస అవసరాలు లేనివారు కాకుండా, జాతీయ ఆదాయంలో 60శాతం కంటే తక్కువ ఆదాయం ఉన్నవారు పేదలుగా గుర్తించబడతారు.ఈయూలోని బల్గేరియా 29శాతం, గ్రీస్27.5 శాతం, రుమేనియా 27.4 శాతంతో అత్యధిక పేదరికం కలిగి ఉండగా, ప్రధాన ఆర్థికవ్యవస్థలుగా ఉన్న స్పెయిన్లో 25.7 శాతం, ఇటలీలో 22.6శాతం, జర్మనీలో




21.2 శాతం పేదరికంలోఉన్నారు. యూరప్యూనియన్లో సంపద, అసమానతలు, ఆదాయ అసమానతల కంటే ఎక్కువగా ఉన్నాయి. ఇందులోని ధనిక దేశాల్లో కూడా సంపద పంపిణీలో భారీ వ్యత్యాసాలున్నాయి. అత్యంత ధనవంతులుగా ఉన్న 10 శాతం జనాభా,మొత్తం సంపదలో సుమారు 67శాతం కలిగిఉన్నారు. దిగువ 50 శాతం మంది ప్రజల వద్ద కేవలం 1.2 శాతం సంపద మాత్రమే ఉంది. అత్యంత ధనవంతులైన 1శాతం కుబేరుల చేతుల్లో యూరప్ మొత్తం సంపదలో 24 శాతం పోగుబడి ఉంది. పూర్వపు సోషలిస్టు దేశాలైన స్లోవేకియా, హంగరీ,పోలెండ్ వంటి దేశాల్లో సంపద అసమానతలు తక్కువగాఉన్నాయి. దీన్ని గమనిస్తే ఆ దేశాల్లో గతంలో అమలు జరిపిన సోషలిస్టు ఆర్థిక విధానాలే కారణం అన్న వాస్తవాన్ని తెలియ చేస్తున్నది. జర్మనీ, నెదర్లాండ్ వంటి దేశాల్లో సంపద కేంద్రీకరణ ఎక్కువ ఉంది. బల్గేరియా,రుమేనియా, గ్రీస్, స్పెయిన్ దేశాల్లో ప్రతినలుగురులో ఒకరు పేదరికంలో ఉన్నారు. యూరోపియన్యూనియన్ అప్పులు విపరీతంగా పెరుగుతున్నాయి.అందుకు కారణం దాని ఆర్థిక సంక్షోభం. ఈయు నిబంధనల ప్రకారం జిడిపిలో అప్పుల శాతం 60 మించి ఉండకూడదు. అందుకు విరుద్ధంగా 81.7 శాతం ఉంది. యూరోజోన్ దేశాల అప్పులు 87.8శాతం వరకు ఉన్నాయి.కొన్నిదేశాలు ముఖ్యంగా గ్రీస్ 146 శాతం,ఇటలీ 136.8 శాతం, ఫ్రాన్స్ 117.7 శాతం ,బెల్జియం 107.1 శాతం,స్పెయిన్ 103.2 శాతం వాటి జిడిపిలో అత్యధిక అప్పులు కలిగి ఉన్నాయి. యూరోపియన్యూనియన్లో నిరుద్యోగం 6శాతంగా ఉంది. కోటి,32 లక్షలమంది ప్రజలు ఉపాధికి దూరంగా ఉన్నారు.యూనియన్ దేశాలైనఫిన్లాండ్ 10.5 శాతం, స్పెయిన్ 10.3 శాతం, గ్రీస్ 9.5శాతంతో అత్యధిక నిరుద్యోగం ఉంది. ఈయూలో యువత సగటు నిరుద్యోగం 15.1శాతంగా ఉంది. ముఖ్యంగా స్పెయిన్, గ్రీస్, ఇటలీ వంటి దక్షిణ ఐరోపా దేశాలలో యువతలో నిరుద్యోగం 24శాతంగా ఉంది. ప్రతి నలుగురులో ఒకరు నిరుద్యోగిగా ఉన్నారు. గుత్తపెట్టుబడిదారుల మధ్య మార్కెట్ల కోసం పోటీ, అత్యధిక ప్రజల అవసరాలకు కాకుండా కొద్ది సంపన్నుల అవసరాలకు అనుగుణమైన ఉత్పత్తులు అధికంగా చేయడం, మార్కెట్ సంక్షోభం,ఆర్థికవ్యత్యాసాలు గుత్తపెట్టుబడిదారుల పోటీవల్ల ఏర్పడినవే.ఆర్థిక సంక్షోభం, కొద్ది మంది వద్దే సంపద కేంద్రీకరణ, ప్రజల పేదరికం. పెట్టుబడిదారీ దేశాల్లో ఆర్థికసంక్షోభాలు తొలగాలంటే సోషలిస్టు విప్లవాలు విజయవంతం కావాలి. ●

# వ్యవస్థ కాపలాదారులే దోపిడీదారులైతే..



పాపని నాగరాజు

దేశంలో ప్రజాస్వామ్యానికి, సుపరిపాలనకు వెన్నెముక సివిల్ సర్వీసెస్ వ్యవస్థ. చట్టాన్ని అమలు చేయడం, ప్రజా వనరులను సంరక్షించడం, ప్రభుత్వ విధానాలను ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగాఅమలు చేయడం ఈ వ్యవస్థ ప్రధానబాధ్యత. కానీ చట్టాన్ని కాపాడాల్సిన వారే చట్టంలోని బలహీనతలను తమ లాభాల కోసం వినియోగించడం ప్రారంభిస్తే, ప్రజాస్వామ్యానికి అది తీవ్రమైన హెచ్చరికగా మారుతుంది. మధ్యప్రదేశ్‌లో వెలుగు చూసిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల భూ కుంభకోణం, అదే రాష్ట్ర లోకాయుక్త పనితీరుపై బయటపడిన గణాంకాలు, అలాగే తెలంగాణలో బయటపడుతున్న భూవ్యవహారాల వివాదాలు, ఇవన్నీ కలిసి భారత పాలనా వ్యవస్థలో దాగి ఉన్న ఒక అసౌకర్యకరమైన సత్యాన్ని బయటపెడుతున్నాయి. అవినీతిని అరికట్టడానికి ఏర్పాటైన వ్యవస్థలే అవినీతికి అద్దం పట్టే పరిస్థితి ఏర్పడింది. మధ్యప్రదేశ్ లోకాయుక్త స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ గత ఇరవై ఏళ్ల అధికారిక గణాంకాలు ఒక చేదు వాస్తవాన్ని చెబుతున్నాయి. 2006 నుంచి 2026 వరకు కోర్టులు లోకాయుక్త కేసుల్లో 2,067 మందిని దోషులుగా నిర్ధారించాయి.మొదటి చూపులో ఇది విజయం అనిపించవచ్చు. కానీ అదే కాలంలో 966 మంది నిర్దోషులుగా విడుదల కాగా, మరో 105 మంది కేసులు విచారణ దశకే చేరలేదు. మొత్తం 1,071 కేసుల్లో, అంటే దాదాపు 34 శాతం సందర్భాల్లో, అవినీతి నిరోధక వ్యవస్థ కోర్టులో తన వాదనను నిలబెట్టలేకపోయింది. ఇటీవలి పరిస్థితి మరింత ఆందోళనకరం.2025-26లో కేవలం 71 మందికే శిక్షపడగా, 62 మంది నిర్దోషులుగా బయటపడ్డారు. అంటే లోకాయుక్త వలలో చిక్కిన వ్యక్తి కోర్టులో తప్పించుకునే అవకాశాలు దాదాపు సమానంగా ఉన్నాయన్న మాట. ఇది దర్యాప్తు నాణ్యత, సాక్ష్యాల సమర్పణ, కేసుల నిర్వహణలో తీవ్రమైన లోపాలను సూచిస్తోంది. దోషులుగా తేలిన వారి వర్గీకరణను పరిశీలిస్తే అసలు అసమానత స్పష్టమవుతుంది. శిక్షపడిన వారిలో 85 శాతం మంది అత్యల్ప స్థాయి ఉద్యోగులే. రెవెన్యూ శాఖలో 652 కన్విక్షన్లలో 558 మంది పట్వారీలు. పోలీస్ శాఖలో 321 కేసుల్లో 242 మంది కానిస్టేబుళ్లు లేదా హెడ్ కానిస్టేబుళ్లు. విద్యుత్ శాఖలో 194 కేసుల్లో 91 మంది లైన్‌మెన్లు. కానీ ఐఏఎస్, ఐపీఎస్, డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులవాటా ఒక శాతానికి చేరలేదు.ఇక్కడే వ్యవస్థలోని వర్గ వివక్ష బయటపడుతోంది. చిన్న స్థాయి ఉద్యోగులు శిక్షను ఎదుర్కొంటుంటే, పైస్థాయి అధికారులపై చట్టం ప్రభావం చూపలేకపోతోంది. ఈ అసమానతకు భోపాల్ సమీపంలోని గురాడీ ఘాట్ భూ వ్యవహారం ప్రత్యక్ష ఉదాహరణ. 2022 ఏప్రిల్ 4న ఒకే రోజున, ఒకే రిజిస్టర్డ్ పత్రం ద్వారా మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ, తెలంగాణ కేడర్లకు చెందిన దాదాపు 50 మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు గురాడీ



ఘాట్ గ్రామంలో 2.023 హెక్టార్ల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారు. ఆ భూమి మార్కెట్ విలువ సుమారు 7.78 కోట్లు కాగా, కొనుగోలు ధర కేవలం 5.50 కోట్లు మాత్రమే. భూమి కొనుగోలు జరిగిన కేవలం 16 నెలలకే, 2023 ఆగస్టులో రాష్ట్ర ప్రభుత్వం 3,200 కోట్ల వ్యయంతో వెస్టర్న్ బైపాస్ ప్రాజెక్టును ఆమోదించింది. ఆశ్చర్యకరంగా ఆ ప్రతిపాదిత రహదారి ఈ భూమికి కేవలం 500 మీటర్ల దూరంలోనే వెళ్లేలా ప్రణాళిక రూపొందింది.ప్రభుత్వ ప్రాజెక్టులపై ముందస్తు సమాచారం లేకుండా ఇలాంటి పెట్టుబడి సాధ్యమా అన్న ప్రశ్న తప్పనిసరిగాతలెత్తుతుంది. అంతటితో ఆగకుండా, 2024 జూన్‌లో అదే భూమిని వ్యవసాయ వినియోగం నుంచి నివాస వినియోగానికి మార్చారు. దీంతో భూమి ధరలు అమాంతం పెరిగాయి. 2022లో చదరపు అడుగు ధర 81.75 ఉండగా, బైపాస్ ప్రకటన తర్వాత 557కు చేరింది. ప్రస్తుతం అది 2,500 నుంచి 3,000 వరకు పెరిగింది. కేవలం నాలుగేళ్ల వ్యవధిలో ఎలాంటి ఉత్పాదక శ్రమ లేకుండా, కేవలం అధికార సమాచారం మరియు విధాన నిర్ణయాల ఆధారంగా 50 నుంచి 60 కోట్ల లాభం ఆర్జించబడింది. ఇంతటి తీవ్ర ఆరోపణలు వెలుగులోకి వచ్చినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం మరింత ఆందోళనకరం. దేశవ్యాప్తంగా చర్చ జరిగినప్పటికీ అధికారిక విచారణ ప్రకటించలేదు. చివరకు 62 మంది మాజీ సివిల్ సర్వెంట్లతో కూడిన ఒక బృందం ముఖ్యమంత్రికి లేఖ రాసి స్వతంత్ర విచారణ జరపాలని డిమాండ్ చేయాల్సి వచ్చింది. ఇది వ్యక్తిగత అవినీతిసమస్య మాత్రమే కాదని, వ్యవస్థాగత అవినీతి రూపమని వారు హెచ్చరించారు. మధ్యప్రదేశ్ మాత్రమే కాదు, తెలంగాణలోనూ ఇదే ధోరణి కనిపిస్తోంది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం భూదాన్ భూముల వ్యవహారంలో ఉన్నతాధికారులు, వారి బంధువులు, బినామీల పేర్లతో అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయన్న ఆరోపణలను హైకోర్టు సీరియస్‌గా పరిగణించింది. భూములు, ప్రజా వనరుల కేటాయింపుల్లో సీనియర్ అధికారుల పాత్రపై తరచుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. దిగువ స్థాయి ఉద్యోగులపై విచారణలు వేగంగా సాగుతుంటే, ఉన్నతాధికారుల కేసులు సంవత్సరాల పాటు విచారణలకే పరిమితమవడం ఒకే వ్యవస్థలో రెండు న్యాయాలున్నాయనే భావనను మరింత బలపరుస్తోంది. ఇక్కడ ఒకేవ్యవస్థలో రెండురకాల న్యాయం కనిపిస్తోంది. ఉదా. 500లంచం తీసుకున్న పట్వారీ లోకాయుక్త వలలో పడతాడు.అతని పేరు మీడియాలో వస్తుంది. అతను సస్పెండ్ అవుతాడు,జైలుకు వెళ్తాడు. అదే సమయంలో ప్రభుత్వ రహస్య సమాచారం ఆధారంగా కోట్ల రూపాయల లాభం పొందిన ఉన్నతాధికారులు లేదా ప్రజా భూములను ప్రభావంతో మళ్లించిన అధికార వర్గాలు విచారణకే పరిమితమవుతున్నాయి. చిన్న ఉద్యోగి చేసినది నేరమైతే, పెద్ద అధికారి చేసినది పెట్టుబడిగా మారుతోంది. అవినీతిని నిర్వచించే శక్తి కూడా అధికార వర్గాల చేతుల్లో ఉండటంతో చట్ట సమానత్వం కేవలం నినాదంగా మిగిలిపోతోంది. రాజ్యాంగ నిర్మాత బి. ఆర్. అంబేద్కర్ హెచ్చరించినట్లే, చట్టం ఎంత గొప్పదైనా దాన్ని అమలు చేసే వ్యవస్థ న్యాయబద్ధంగా లేకపోతే సమానత్వం కాగితాలకే పరిమితమవుతుంది. మధ్యప్రదేశ్ లోకాయుక్త గణాంకాలు, గురాడీ ఘాట్ భూ కుంభకోణం, తెలంగాణ భూదాన్ భూముల వివాదాలు కలిసి ఒక అసౌకర్యకరమైన నిజాన్ని చెబుతున్నాయి. ఇది కేవలం అమలు వైఫల్యం కాదు, వ్యవస్థ రూపకల్పనలోనే ఉన్న అసమానత. ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి ఉన్నతాధికారులపై వచ్చిన అవినీతి ఆరోపణలపై స్వతంత్ర విచారణలు జరిపించాలి. లోకాయుక్త, ఏసీబీవంటి సంస్థలకు పూర్తి స్వతంత్రత,పైస్థాయి అధికారులపై కూడా నిర్భయంగా చర్యలు తీసుకునే సామర్థ్యం కల్పించాలి. ●

# న్యాయప్రక్రియలో ఎఐ అవసరమా?




## ఆగ్రహించిన సుప్రీం కోర్టు

### సమగ్ర అధ్యయనానికి నిపుణులతో కమిటీ

### ఎఐతో తయారు చేసిన తీర్పులపై కఠినచర్యలని హెచ్చరిక

**న్యూఢిల్లీ, జులై 2:** న్యాయ ప్రక్రియలో ఎఐ వినియోగించడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. ఒక ముఖ్యమైన పరిణామంలో, ఒక దివాలా వివాదాన్ని పరిష్కరించే క్రమంలో నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి), నేషనల్ కంపెనీ లా అప్పీలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌ఎటి) రెండూ ఉనికిలో లేని, ఎఐ సృష్టించిన "భ్రమలతో కూడిన" న్యాయపరమైన తీర్పులపై ఆధార పడ్డాయని గుర్తించిన సుప్రీంకోర్టు, ఆ రెండు ఫోరమ్‌లు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేసింది. న్యాయవాద వృత్తిలో ఎఐ వల్ల ఎదురవుతున్న పెరుగుతున్న సవాళ్లను పరిష్కరించేందుకు, తీర్పు ప్రక్రియలో కృత్రిమ మేధస్సు వాడకం వల్ల తలెత్తే సమస్యలను పరిశీలించడానికి నిపుణులతో కూడిన ఒక కమిటీని ఏర్పాటు చేయాలని జస్టిస్ పిఎస్ నరసింహా, జస్టిస్ అలోక్ అరధేలతో కూడిన ధర్మాసనం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఆదేశించింది.

"ఈ సమస్యలను వివరంగా పరిశీలించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను కూడా ఆదేశించామ్ము అని కోర్టు పేర్కొంది. బార్ కౌన్సిల్ ఈ విషయాన్ని అత్యంత తీవ్రంగా పరిగణించి, శ్రద్ధగా చర్చించి, నిబంధనల ఉల్లంఘనపై తీసుకునే క్రమశిక్షణా చర్యలతో పాటు, ఇలాంటి సంఘటనలను నివారించడానికి ఒక మార్గదర్శక సూత్రాన్ని నిర్దేశించాలి. తీర్పు ప్రక్రియలో సహాయపడటానికి ఎఐని ఉపయోగించవచ్చుని, కానీ అది మానవ తార్కికతను ఎప్పటికీ భర్తీ చేయలేదని కోర్టు పేర్కొంది. తీర్పు ప్రక్రియ ప్రతి దశలోనూ మానవుల "సంపూర్ణ, పూర్తి నియంత్రణ్ణ లోనే ఉండాలని నొక్కి చెప్పింది. "ట్రిబ్యునల్ తన తీర్పుకు మద్దతుగా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా సృష్టించబడిన, ఉనికిలో లేని నకిలీ, కల్పిత సమాచారాన్ని పూర్వతీర్పులుగా భావించి దానిపై ఆధారపడిన కేసు ఇది. కింద పేర్కొన్న కారణాల దృష్ట్యా, తీర్పు ప్రక్రియ, దాని సమగ్రతను ధ్రువీకరించడానికి, కాపాడటానికి, ఎన్‌సిఎల్‌టి తీర్పును, అలాగే అప్పీల్‌లోని తీర్పును కూడా రద్దు చేశామ్ము అని కోర్టు వ్యాఖ్యానించింది. వివాదాస్పద ఉత్తర్వులను రద్దు చేయడమే కాకుండా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పట్ల న్యాయవ్యవస్థ వైఖరిని నిర్వచించడానికి ఈ కేసు ఒక అవకాశాన్ని కల్పించిందని కోర్టు అభిప్రాయపడింది. "అటువంటి తీర్పును పక్కన పెట్టడం వల్ల కలిగే అనివార్య పరిణామం కంటే, మా నిర్ణయాలు తీసుకోవడంలో ముఖ్యమైన విషయం ఏమిటంటే, తీర్పుల ప్రక్రియలో సహాయపడటానికి కృత్రిమ మేధ సాంకేతికతను స్వీకరించాలనే మా సంకల్పం. అదే సమయంలో, ప్రతి దశలోనూ మానవ ప్రమే యంతో తీర్పులపై పూర్తి, సంపూర్ణ నియంత్రణను కలిగి ఉంటామని చెబుతున్నాము, ప్రకటిస్తున్నాము" అని ధర్మాసనం పేర్కొంది. కృత్రిమ మేథతో తయారు చేసిన తీర్పులను ఎవరైనా కోర్టుల్లో ప్రదర్శిస్తే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కోర్టు పూర్వ తీర్పు ఆదేశాలను వెరిఫికేషన్ లేకుండా గుడ్డిగా నమ్మరాదు అని ధర్మాసనం సూచించింది.



# తమిళనాట అన్నాడిఎంకెకు భారీ షాక్

## మాజీ మంత్రులుసహా 15 వేలమంది మద్దతుదారులు టివికెలో చేరిక

**చెన్నై, జులై 2:** తమిళనాడులో అన్నాడీఎంకేకు కోలుకోలేనివిధంగా షాక్ తగిలింది. పార్టీకి చెందిన కీలకనేతలు, మాజీ మంత్రులు డాక్టర్ సి. విజయ భాస్కర్, ఎంఆర్ విజయభాస్కర్ అధికార తమిళగ వెట్రి కళగం (టివికె) పార్టీలో చేరారు. వీరితో పాటు సుమారు 15వేల మంది మద్దతుదారులు కూడా పార్టీ మారడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశ మైంది. చెన్నై సమీపంలోని మామల్లపురంలో గల ఒక ప్రైవేట్ రిసార్టులో గురువారం ఈ భారీ చేరికల కార్యక్రమం జరిగింది. టివికె ప్రధాన కార్యదర్శి ఎన్. ఆనంద్ ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించారు. మంత్రి ఆధవ్ అర్జున కొత్తగా చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అన్నాడీఎంకే నాయకత్వంపై తీవ్ర అసంతృప్తితోనే తాము పార్టీ మారుతున్నట్లు మాజీ మంత్రులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సి. విజయ భాస్కర్ మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు మరియు తర్వాతకూడా టివికెతో పొత్తు పెట్టుకోవాలని తాము పార్టీ అధిష్ఠానానికి పలుమార్లు సూచించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంజిఆర్ సిద్ధాంతాలకు విరుద్ధంగా డిఎంకేతో పొత్తుకు ప్రయత్నిస్తుండటంతో తాము పార్టీలో ఇమడలేకపోయామని తెలిపారు. ప్రజల్లో అపారమైన విశ్వాసం నింపిన విజయ్ నాయకత్వంలోని టివికెలో చేరడమే సముచితమైన నిర్ణయమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల అనంతరం జరిగిన అతిపెద్ద చేరికల్లో ఇది ఒకటి. ఈ ఇద్దరు మాజీ మంత్రులతో పాటు మరో మాజీ మంత్రి ఎస్. వలర్మతి, ఎఎస్‌ఎం ఆనందన్, పలువురు మాజీఎమ్మెల్యేలు, 208 మంది యూనియన్ కార్యదర్శులు కూడా టీవీకేలో చేరారు. కరూర్, పుదుక్కోట్టై జిల్లాల నుంచి సుమారు 200 బస్సులు, 600 కార్లలో భారీ సంఖ్యలో మద్దతుదారులు ఈ కార్యక్రమానికి తరలివచ్చారు.



# 1500 అడుగుల ఎత్తులో పెళ్లికి ప్రపోజ్‌చేసిన ప్రియుడు

## కట్‌చేస్తే అదుపులోకి తీసుకుని అరెస్టుచేసిన పోలీసులు

**వాషింగ్టన్, జులై 2:** అమెరికాలోని ప్రముఖ ఎంపైర్ స్టేట్ భవనంపైకి ఎక్కిన రష్యాకు చెందిన ఓ జంట అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. 1,454 అడుగుల ఎత్తులో ఉన్న ట్రాన్స్‌మిషన్ టవర్ శిఖరానికి చేరుకున్న వారు ప్రపంచ శాంతిని కోరుతూ ఓ బ్యానర్‌ను ప్రదర్శించారు. అనంతరం యువకుడు యువతికి లవ ప్రపోజ్ చేయగా ఆమె అంగీకరించింది. ఇద్దరూ ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ముద్దు పెట్టుకున్నారు. అయితే ఈ సాహసం చివరకు వారి అరెస్ట్‌కు దారితీసింది. ఏంజెలా నికోలా, వాన్యా బీర్కస్ అనే ఈ జంట ముఖాలకు మాస్కులు ధరించి టవర్‌పైకి ఎక్కింది. అక్కడి నుంచి తమ సాహసాన్ని సోషల్ మీడియాలో ప్రత్యక్ష ప్రసారం చేశారు. అనంతరం టవర్ దిగువ ప్లాట్‌ఫామ్‌కు చేరుకున్న తర్వాత వాన్యా మోకాలిపై కూర్చుని ఏంజెలాకు ప్రపోజ్ చేశాడు. ఆమె అంగీకరించడంతో ఇద్దరూ తమ ఎంగేజ్‌మెంట్‌ను అక్కడే జరుపుకొన్నారు. ఈ ఘటనతో అప్రమత్తమైన పోలీసులు భవనం అబ్జర్వేషన్ డెక్‌ను ఖాళీ చేయించారు. పరిసర ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేశారు. అనంతరం ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. టవర్‌పైకి వారు ఎలా చేరుకున్నారనే దానిపై దర్యాప్తు కొనసాగుతోంది. అనుమతి లేకుండా ఇంత ప్రమాదకరమైన ప్రాంతంలోకి వెళ్లడం తీవ్రముప్పని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# బండరాళ్లుపడి ఎనిమిది మంది కూలీలు మృతి



**బెంగళూరు, జులై 2:** కర్ణాటకలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బెంగళూరు దక్షిణ తాలూకాలోని మడ పట్టణంలో గురువారం భారీ బండరాయి కార్మికులపై పడటంతో ఎనిమిదిమంది మృతిచెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. కావేరి స్టోన్ క్రషర్ కంపెనీలో కూలీలు పనులు చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులను బీహార్‌కు చెందిన వలస కూలీలుగా పోలీసులు గుర్తించారు. ప్రమాదం జరిగిన సమయంలో క్వారీలో సుమారు 15 నుంచి 20 మంది కార్మికులు ఉన్నారని వారు తెలిపారు. కొత్త క్రషర్ యూనిట్ ఏర్పాటు కోసం దాదాపు 100 అడుగుల ఎత్తులో ఒక హిటాచీ యంత్రం పని చేస్తోందని పోలీసులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఒక పెద్ద బండరాయి జారి కింద ఉన్న కార్మికులపై పడిందని పోలీసులు వివరించారు. దీంతో ఏడుగురు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. క్షతగాత్రులను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. శిథిలాలను తొలగించి చిక్కుకుపోయిన కార్మికులను రక్షించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. మరోవైపు బాధిత కుటుంబాలకు సమాచారం అందించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. క్వారీలో నిర్లక్ష్యం లేదా భద్రతా నిబంధనల ఉల్లంఘన జరిగిందా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రమాదంపై కర్ణాటక సిఎం శివకుమార్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలకు ఈ దుఃఖాన్ని తట్టుకునే శక్తి లభించాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికుల భద్రత, రక్షణ అనేది క్వారీ యజమానుల బాధ్యత అని ముఖ్యమంత్రి నొక్కిచెప్పారు. భద్రతా నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు తేలిన క్వారీలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని సిఎం శివకుమార్ హెచ్చరించారు.

# ఉక్రెయిన్‌పై విరుచుకుపడిన రష్యా

## పేలుళ్ల శబ్దాలకు వణికిన జనం



**కీవ్, జులై 2:** రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మరోసారి తీవ్రరూపం దాల్చుతోంది. చమురుశుద్ధి కార్మాగారాలు లక్ష్యంగా ఉక్రెయిన్ దాడులు చేయడంతో రష్యాలో ఇంధన కొరత నెలకొన్న సంగతి తెలిసిందే. ఇందుకు ప్రతిస్పందనగా అర్ధరాత్రి ఉక్రెయిన్‌పై మాస్కో దళాలు విరుచుకుపడ్డాయి. కొన్ని గంటలపాటు క్షిపణులు, డ్రోన్ల వర్షం కురిపించాయి. రాజధాని నగరం కీవ్‌లో భారీ పేలుళ్లు వినిపించడంతో ప్రజలు వణికిపోయారు. ఈ దాడుల్లో నివాస భవనాలు ధ్వంసమయ్యాయి. ఈ దాడిలో రష్యా బాలిస్టిక్, క్రూజ్ క్షిపణులు ఉపయోగించింది. దీంతో నిప్రో నదికి ఇరువైపులా ఉన్న ప్రాంతాల్లో తీవ్రనష్టం వాటిల్లింది. ఆ దాడుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధ్యక్షుడు జెలెన్స్కీ హెచ్చరించడంతో.. పలువురు మెట్రో స్టేషన్లలో ఆశ్రయం పొందారు. ఇది భయంకరమైన శత్రుదాడి అని ఉక్రెయిన్ ప్రభుత్వం అభివర్ణించింది. ఇప్పటి వరకు ఒకరు మరణించారని, 11 మంది గాయపడ్డారని వెల్లడించింది. ఇదిలా ఉంటే.. కొన్ని రోజులుగా ఉక్రెయిన్ ప్రతి రోజూ వందల డ్రోన్లతో విరుచుకుపడటంతో రష్యా ఉక్కిరిబిక్కిరి అయింది. డ్రోన్లు, క్షిపణుల విడిభాగాలు తయారుచేసే కార్మాగారాలు సహా సైనిక, ఇంధన స్థావరాలపై దాడులు చేసింది. ఆ తర్వాత మాస్కోలో బ్లాక్ రెయిన్ కురిసినట్లు వార్తలు కూడా వచ్చాయి. ఈ దాడులతో ఇంధన కొరత ఏర్పడింది. ఈ విషయాన్ని రష్యా అధ్య క్షుడు పుతిన్ కూడా స్వయంగా అంగీకరించారు. ప్రస్తుతం బంకులవద్ద ప్రజలు బారులు తీరుతు న్నారు. పెట్రోలు ధరలు పెరిగాయి. ప్రభుత్వం ఇంధనాన్ని రేషన్ పద్ధతిలో అందిస్తోంది. ఈ కొరతను అధిగమించేందుకు భారత్ నుంచి రష్యా పెట్రోల్ దిగుమతి చేసుకుంటోందని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.

# ఇండో-యుఎస్ వాణిజ్య ఒప్పందం 99% కొలిక్కి

## - కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్



**న్యూఢిల్లీ,జులై 2:** భారత్, అమెరికా మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చర్చలు తుది దశకు చేరుకున్నాయి. ఈ ఒప్పందానికి సంబంధించిన ప్రక్రియ దాదాపు 99 శాతం పూర్తయిందని, కేవలం ఒకే ఒక్క కీలక అంశంపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. ఈ ఒప్పందం ద్వారా అమెరికా మార్కెట్‌లో ప్రాంతీయ పోటీదారుల కంటే భారత్‌కు విశేష ప్రాధాన్యత లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో నిర్వహించిన ఇండోపాన్ స్ట్రాటజిక్ డైలాగ్ కార్యక్రమంలో పీయూష్ గోయల్ ప్రసంగించారు. ఈ ఒప్పందం ఇరు దేశాలకూ అత్యంత న్యాయబద్ధంగా, సమతుల్యంగా ఉంటుందని ఆయన అభివర్ణించారు. అమెరికా సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో, భారత్‌కు సుంకాల పరంగా లబ్ధి చేకూర్చేందుకు అవసరమైన చట్టబద్ధమైన యంత్రాంగాన్ని రూపొందించడమే ప్రస్తుతం మిగిలి ఉన్న ఆ ఒక శాతం అడ్డంకి అని ఆయన వివరించారు. తయారీ రంగంలో ప్రధాన పోటీదారులైన చైనా, ఆగ్నేయాసియా దేశాల కంటే భారత్‌కు మెరుగైన ప్రాధాన్యత లభించాలని కోరుతున్నామని, దీనిపై అమెరికా సానుకూలంగా స్పందిస్తూ పరిష్కారం కోసం చురుగ్గా కృషి చేస్తోందని తెలిపారు. 2025 ప్రారంభంలో ఈ సమగ్ర ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు మొదలయ్యాయి.

ఈ యేడాది ఫిబ్రవరిలో మధ్యంతర ఒప్పందానికి సంబంధించిన ముసాయిదాను ఇరు దేశాలు ప్రకటించాయి. భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ సైతం ఈ ఒప్పందం తుది దశకు చేరుకుందని, కేవలం ఒక శాతం మాత్రమే పెండింగ్‌లో ఉందని ఇటీవల వ్యాఖ్యానించారు. జూలై 24న అమెరికా తాత్కాలిక టారిఫ్ చర్యల గడువు ముగియనున్న నేపథ్యంలో, ఆలోపే తొలి విడత ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# సంక్షిప్త వార్తలు

## అరేబియా సముద్రంలో అమెరికా హెలికాప్టర్ ఎమర్జెన్సీ ల్యాండింగ్: ఒకరు గల్లంతు



**వాషింగ్టన్, జులై 2:** అరేబియా సముద్రంలో గస్తీ కాస్తున్న అమెరికా ఎంహెచ్-60 ఎస్ సీహాక్ హెలికాప్టర్ ఎమర్జెన్సీ ల్యాండ్ అయింది. ఈ ఘటనలో అందులోని సిబ్బంది ఒకరు గల్లంతయ్యారు. ఈ విషయాన్ని అమెరికా నేవీ ఫిఫ్త్ ఫ్లీట్ కూడా ధ్రువీకరించింది. 'సముద్రంలో గల్లంతైన అమెరికా ఎయిర్ క్రూమెన్ కోసం మా దళాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. ఈ ఎమర్జెన్సీ ల్యాండింగ్‌పై దర్యాప్తు చేపట్టాము' అని ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రాంతంలోని అమెరికా విమానకవాహక నౌక యుఎస్ఎస్ జార్జ్ హెచ్‌డబ్ల్యు బుష్‌పై మోహరించిన హెలికాప్టర్ ఇది.

## కొత్త ఎయిర్‌ఫోర్స్‌వన్‌లో ప్రయాణించిన ట్రంప్



**నార్త్ డకోటా(యుఎస్),జూలై 2:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, సుమారు 37 యేళ్ల తర్వాత ఆధునికీకరించిన నూతన ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో తొలిసారిగా ప్రయాణించారు. నార్త్ డకోటాలో ఏర్పాటు చేసిన థియోడర్ రూజ్‌వెల్ట్ ప్రెసిడెన్షియల్ లైబ్రరీ ప్రారంభోత్సవానికి ఆయన ఈ కొత్త విమానంలోనే విచ్చేశారు. దాదాపు నాలుగు దశాబ్దాల విరామం అనంతరం అందుబాటులోకి వచ్చిన కొత్త అధ్యక్ష విమానంలో ఇదే తన తొలి ప్రయాణమని ట్రంప్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. మెడోరాలో నిర్వహించిన కార్యక్రమంలో మద్దతుదారులను ఉద్దేశించి ట్రంప్ ప్రసంగించారు.

## ఇస్రో ఛైర్మన్ కార్యాలయానికి బాంబు బెదరింపు

**బెంగళూరు,జులై 2:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రధాన కార్యాలయంలో గురువారం బాంబు బెదిరింపు కలకలం రేపింది. బెంగళూరులోని ఇస్రో కేంద్రానికి ఈమెయిల్ ద్వారా వచ్చిన ఈ బెదిరింపు నకిలీదని పోలీసులు నిర్ధారించారు. దీంతో అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ఇస్రో కేంద్రంలోని ఛైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ కార్యాలయానికి ఈ బెదిరింపు మెయిల్ అందింది. వెంటనే అప్రమత్తమైన ఇస్రో సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. దీంతో బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ముందుజాగ్రత్త చర్యగా ప్రాంగణాన్ని ఖాళీచేయించి క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు కానీ, అనుమానాస్పద వస్తువులు కానీ లభ్యం కాలేదని అధికారులు స్పష్టం చేశారు.

## అమర్‌నాథ్ యాత్రికుల తొలిబృందానికి ఘనస్వాగతం

**శ్రీనగర్,జూలై 2:** అమర్‌నాథ్ యాత్రకు సర్వం సిద్ధమైంది. ఈ యాత్రలో భాగంగా బల్తాల్ మార్గంలో బయల్దేరిన తొలి బృందం యాత్రికులకు నేడు ఘన స్వాగతం లభించింది. జమ్మూశ్రీనగర్ జాతీయ రహదారిపై ఉన్న రాంబన్ జిల్లాలోని చందర్‌కోట్ వద్ద ఏర్పాటు చేసిన లంగర్ (ఉచిత భోజనశాల) వద్ద అధికారులు, స్థానికులు యాత్రికులను సాదరంగా ఆహ్వానించారు. రాంబన్ జిల్లా యంత్రాంగం, పౌర సమాజ ప్రతినిధులు, పలు లంగర్ సంస్థలు కలిసి యాత్రికులకు శుభాకాంక్షలు తెలిపి, వారి యాత్ర ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షించారు.

## మణిపూర్‌లో మళ్లీ హింస, 20 ఇళ్లకు నిప్పు

**ఇంఫాల్,జులై 2:** మణిపూర్ రాష్ట్రంలో హింస మళ్లీ ప్రజ్వరిల్లింది. భారత్‌మయన్మార్ సరిహద్దు సమీపంలోని కామ్‌జోంగ్ జిల్లాలో నాగా, కుకీ సామాజిక వర్గాల మధ్య సాయుధ ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఇరు వర్గాలకు చెందిన సాయుధ బృందాలు పరస్పరం దాడులు చేసుకోవడంతో పాటు గ్రామాల్లోని 20కి పైగా ఇళ్లకు నిప్పు పెట్టారు. ఉదయం వేళ ఒక కుకీ గ్రామం నుండి వచ్చిన సాయుధులు సమీపంలోని నాగా గ్రామంపై దాడి చేసి 10 ఇళ్లను తగలబెట్టడంతో ఈ హింస ప్రారంభమైంది. ఆ తర్వాత మధ్యాహ్నం దీనికి ప్రతీకారంగా మరో వర్గం జరిపిన ఎదురు దాడుల్లో నాగా కమ్యూనిటీకి చెందిన ఇంకో 12 ఇళ్లు అగ్నికి ఆహుతయ్యాయి.

# అయోధ్య రామమందిరం విరాళాల అక్రమాలపై కీలక భేటీ

## 6న ట్రస్ట్ అత్యవసర సమావేశం

**అయోధ్య, జులై 2:** రామమందిరంలో భక్తుల విరాళాల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ జూలై 6న కీలక సమావేశాన్ని నిర్వహించనుంది. ట్రస్ట్‌కు చెందిన అన్ని ట్రస్టీలతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సమావేశంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ డాక్టర్ అనిల్ మిశ్రా సమర్పించిన రాజీనామాలపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం. విరాళాల దొంగతనం కేసు వెలుగులోకి వచ్చిన అనంతరం గత నెల 27న చంపత్ రాయ్, డాక్టర్ అనిల్ మిశ్రా తమ పదవులకు రాజీనామా చేశారు. ట్రస్ట్ నిబంధనల ప్రకారం వారి రాజీనామాలను ఆమోదించాలంటే సమావేశానికి హాజరయ్యే సభ్యుల్లో మూడింట రెండొంతుల మెజారిటీ మద్దతు అవసరం. ట్రస్ట్ నిబంధనల ప్రకారం పదవికి మాత్రమే రాజీనామా ఆమోదించబడుతుంది. అయితే ట్రస్టీ సభ్యత్వం మాత్రం కొనసాగుతుంది. దీంతో రాజీనామాలు ఆమోదమైనా చంపత్ రాయ్, అనిల్ మిశ్రా తమ అధికారిక బాధ్యతల నుంచి మాత్రమే తప్పుకుంటారు. ట్రస్ట్ జీవితకాల సభ్యులుగా మాత్రం కొనసాగుతారు.

ఇదే నిబంధన ఇతర పదాధికారులకు కూడా వర్తిస్తుంది. ప్రస్తుతం ట్రస్ట్‌లో మొత్తం 14 మంది సభ్యులు ఉండగా, ఇద్దరు రాజీనామా చేయడంతో మిగిలిన 12 మంది ట్రస్టీలు ఈ అంశంపై ఓటింగ్ ద్వారా తమ అభిప్రాయాన్ని వెల్లడించనున్నారు. ఇదిలా ఉండగా, ఈ వ్యవహారంలో మాజీ ట్రస్ట్ పదాధికారులపై న్యాయపరమైన ఒత్తిడి కూడా పెరుగుతోంది. ఫైజాబాద్ బార్ అసోసియేషన్ చంపత్ రాయ్, డాక్టర్ అనిల్ మిశ్రా, ఆలయ నిర్మాణ బాధ్యుడు గోపాల్ రావుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేసింది.

# కాంగ్రెస్‌లో విలీనం కానున్న శరద్‌పవార్ ఎన్సీపీ?

**ముంబయి, జులై 2:** మహారాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులకు దారితీసే ఒక సంచలన పరిణామం తెరపైకి వచ్చింది. సీనియర్ నేత శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ (ఎన్సీ శరద్ పవార్ శ్రేణి) పార్టీని, కాంగ్రెస్‌లో విలీనం చేసేదిశగా ఇరుపార్టీల మహారాష్ట్ర రాష్ట్రస్థాయి విభాగాలమధ్య అత్యంత రహస్యంగా చర్చలు జరుగుతున్నట్లు విశ్వసనీయసమాచారం వెలుగులోకి వచ్చింది. ఒకవేళ ఈ విలీనంగనుక సఫలమైతే, మహారాష్ట్ర ప్రతిపక్ష రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోనుంది. ప్రస్తుతం ఈ విలీన ప్రతిపాదనలపై రాష్ట్రస్థాయిలోనే ప్రాథమిక చర్చలు జరుగుతున్నాయి. ఎన్సీపీ (ఎస్పీ) తమ పార్టీ అంతర్గతంగా నేతలందరి మధ్య ఒక ఏకాభిప్రాయాన్నిసాధించిన తర్వాత, ఈ అంశాన్ని ఢిల్లీలోని కాంగ్రెస్ అధిష్ఠానం వద్దకు తీసుకెళ్లి తుది నిర్ణయం తీసుకోనున్నారు. నిజానికి, 2024 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఈ విలీన ఆలోచన వచ్చినప్పటికీ ఎన్నికల ప్రచారం, వ్యూహాల బిజీ వల్ల దీనిని తాత్కాలికంగా పక్కన పెట్టారు. ఇప్పుడు ఎన్నికలు ముగిసిన తర్వాత ఈ ప్రక్రియ మళ్లీ ఊపందుకుంది. ఈ విలీన వార్తలు మహా వికాస్ అఘాడీ (ఎంవిఎ కాంగ్రెస్, ఎన్సీపీ శరద్ పవార్, శివసేన ఉద్ధవ్ థాకరే) కూటమిలో తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఇటీవల ఉద్ధవ్ థాకరే వర్గంలో జరిగిన తిరుగుబాట్లు, అలాగే కూటమి ఐక్యతపై స్వయంగా ఉద్ధవ్ థాకరే బహిరంగంగానే అనుమానాలు వ్యక్తం చేయడంతో ఎంవిఎ భాగస్వామ్య పక్షాల మధ్య ఇప్పటికే తీవ్రమైన భేదాభిప్రాయాలు నడుస్తున్నాయి. ఈ తరుణంలో కాంగ్రెస్, ఎన్సీపి విలీన ప్రయత్నాలు కూటమి భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. 1999లో సోనియా గాంధీ విదేశీ మూలాల వివాదం నేపథ్యంలో శరద్ పవార్ కాంగ్రెస్ నుండి బయటకు వచ్చి నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)ని స్థాపించారు. సరిగ్గా 27 ఏళ్ల తర్వాత మళ్లీ అదే కాంగ్రెస్ గూటికి శరద్ పవార్ చేరబోతుండటం గమనార్హం. 2023లో ఆయన సోదరుడి కుమారుడు అజిత్ పవార్ సొంతంగా చీలిక తెచ్చి అధికార పక్షంతో చేతులు కలపడంవల్ల ఎన్సీపీ మరింత బలహీన పడింది. ఇటీవల అజిత్ పవార్ గ్రూపుతో విలీనాన్ని పూర్తిగా తోసిపుచ్చిన శరద్ పవార్.. ఇప్పుడు కాంగ్రెస్‌తో చేతులు కలిపేందుకు సిద్ధమవ్వడం మహారాష్ట్ర పాలిటిక్స్‌లో అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది.

# చేతన్, సియాలకు పాలిగ్రాఫ్ టెస్ట్ తప్పనిసరి



## కోర్టులో పిటిషన్ దాఖలుచేసిన పోలీసులు

### ఎవరు తోసివేసారనేందుకు ఆధారాలు లేవని వెల్లడి

**పూణె, జులై 2:** రియాల్టీ వ్యాపారి కేతన్ అగర్వాల్ హత్యకేసులో పోలీసులు నిందితురాలు సియా గోయల్, ఆమె ప్రియుడు చేతన్ చౌదరిలకు పాలిగ్రాఫ్ ఫరీక్ష నిర్వహించేందుకు అనుమతించాలంటూ కోర్టులో పిటిషన్ దాఖలుచేసారు. న్యాయపరమైన ప్రక్రియ అనుసరించేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పర్యవేక్షణలో ఈ పిటిషన్ దాఖలయింది. దర్యాప్తు అధికారులు ఇందుకు సంబంధించి విభిన్నరకాలుగా నిందితులు ఇచ్చిన వాంగ్మూలాలను పరిశీలించారు. అలాగే కేతన్‌ను లోయలోకి ఎవరు తోసివేసారనడానికి ఆధారాలు కూడా లేవని దర్యాప్తు అధికారులు కోర్టుకు నివేదించారు. ప్రస్తుతం నిందితులిద్దరూ శుక్రవారం వరకూ పోలీసుల కస్టడీలోనే ఉన్నారు. కేతన్ మొబైల్ ఫోన్ హత్యతర్వాత కొంతసేపటివరకూ సియావద్దనే ఉందని, ఆ తర్వాత ఆతని కుటుంబానికి అందచేసినట్లు గుర్తించారు. ఆ ఫోన్‌తో ఏంచేసారన్నదే ఇపుడు విచారణలో తేలాల్సి ఉందన్నారు. సియా, ఆమె బాయ్‌ఫ్రెండ్ చేతన్ ఇద్దరూ డేటాను ధ్వంసం చేసారనేందుకు ఆధారాలు లేవని అన్నారు. అయితే కీలకమైన సాక్ష్యం ఏదయినా తొలగించారా అన్నది పరిశీలిస్తున్నట్లు ఒక పోలీస్ అధికారి తెలిపారు. పూణె రూరల్ పోలీసులు క్రైమ్‌సీన్‌ను ఇప్పటికే రీకన్‌స్ట్రక్షన్ చేసారు. చేతన్ చౌదరిని కూడా తీసుకెళ్లి హత్యాస్థలంలో రీకన్‌స్ట్రక్షన్ చేసారు. ఈ సమయంలోనే ఒక డమ్మికేతన్ బొమ్మను సియా, కేతన్‌లతోనే లోయలోకి తోసివేయించి సంఘటన క్రమాన్ని నమోదుచేసుకున్నారు.

## జగన్‌వి అనాలోచిత వ్యాఖ్యలు



విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి: వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమరావతి పై అనాలోచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆరోపించారు. అమరావతి రాజధాని అభివృద్ధిని చూసి ఓర్వ లేని స్థితికి దిగజారరన్నారు. మూడు రాజధానుల పేరుతో ఎన్నికలకు వెళ్లే వైసిపికి 11 సీట్లు వచ్చాయన్నారు. ఇప్పుడు మావిగన్ అనే పిచ్చివేషంతో ఎన్నికలకు వెళ్తే సున్నాకే పరిమితం అవుతారంటూ వ్యాఖ్యానించారు. గురువారం టిడిపి కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేయాలనే లక్ష్యంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మూడు రాజధానుల పేరుతో ఒక్క ఇటుక కూడా పెట్టకుండా రూ.450 కోట్లు ఖర్చుపెట్టి తన కోసం ప్యాలెస్ నిర్మించుకున్నారని ఆరోపించారు. అమరావతి నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని చూసి తట్టుకోలేని స్థితిలో జగన్ విషం కక్కారని మంత్రి వ్యాఖ్యానించారు. అమరావతికి తనకు ఎటువంటి వ్యతిరేకతలేదని, 33వేల ఎకరాలు కావాలని చెప్పిన వ్యక్తి జగన్ అని గుర్తుచేశారు. అమరావతిలోనే ఇల్లు కట్టుకున్నానని ఆనాడు ప్రజల్ని నమ్మించారన్నారు. అందుకే ప్రజలు బుద్ధి చెప్పి వైసిపిని 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. జగన్ తన పతనాన్ని తానే కొనితెచ్చుకుంటున్నారన్నారు. అమరావతి రాజధాని నిర్మాణాన్ని ఆయన అడ్డుకోలేరని మంత్రి మండిపడ్డారు.

## రాజధానిపై జగన్‌ది పూటకో మాట



విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి: వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర రాజధానిపై పూటకో మాట మారుస్తున్నారని మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎలా ముందుకు తీసుకెళ్లాలా అని చూస్తుంటే, జగన్ మాత్రం అభివృద్ధిని అడ్డుకో వడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చంద్రబాబు ముందుకెళ్తుంటే, జగన్ కుట్రపూరితంగా మాట్లాడుతున్నారని విరుచుకు పడ్డారు. సైకో ఆలోచనలు కలిగిన వ్యక్తి ఏ విధంగా ఉంటాడనే దానికి జగన్ మాట్లాడిన మాటలే నిదర్శనమన్నారు. జగన్ కాసేపు అమరావతే రాజధాని అని అంటారని.. మరికాసేపులేదు, మా స్టాండ్ మావిగన్ అని మాట్లాడతారని ఎద్దేవా చేశారు. ఎవరైనా పచ్చగా ఉంటే చూడలేని మనస్తత్వం ఉన్నవాడినే సైకో అంటారని పేర్కొన్నారు. ఏం మాట్లాడుతారో, ఏం చేస్తారో తెలియని పరిస్థితి జగన్‌దని ఎద్దేవా చేశారు. జగన్ మొన్న తన మనుషులను పంపించి రాజధానిలో సిఆర్‌డిఎ పరిరక్షణ కమిటీ పేరుతో కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. దీంతో అక్కడి రైతులు, ప్రజలు వారిని తరిమి కొట్టారని ఎద్దేవా చేశారు.ఇ ంకా ఈ దొంగ డ్రామాలు, నాటకాలు ఆడుతూ ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టాలా? అని జగన్‌ని కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. కులాలు, మతాల మధ్య వైషమ్యాలు సృష్టించాలని కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రజలందరూ పరిస్థితిని దయచేసి గమనించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

## జగన్ అసెంబ్లీకి రారు, ప్రజల్లోకి రారు



సచివాలయం, జులై 2 ప్రభాతవార్త: "ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇప్పుడు మాటలు వినే మూడ్‌లో లేరు, కళ్లముందు ఫలితాలను చూసే దశకు వచ్చారు. కాబట్టే ప్రజలు మిమ్మల్ని 151సీట్ల నుండి కేవలం 11స్థానాలకే పరిమితం చేసి ఇంటికి సాగనంపారు" అని రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ, జగన్ అసెంబ్లీకి రారు, ప్రజల్లోకి రారు, అడిగిన దానికి జవాబు చెప్పారు, ఒక పక్క ఓట్లేసిన ప్రజలకు సొంత కార్యకర్తలకు సమాధానం చెప్పుకోలేని పరిస్థితి అని ఎద్దేవా చేశారు "గత ఐదేళ్ళలో మూడు రాజధానులు అనే చిత్ర విచిత్ర వేషాలతో ఈ రాష్ట్రంలోని స్కూల్ పిల్లల్లో సైతం రాజధాని ఏదో తెలియని తీవ్ర అయోమయాన్ని సృష్టించారు. ఆ మూడు రాజధానుల్లో కనీసం ఒక్క ఇటుకైన పెట్టారా? ఒక దోసెడు ఇసుకైనా వేశారా? లేదు. కానీ ప్రజాధనం రూ.500 కోట్లు తగలేసి రిషికొండకు గుండు గీకి ఒక లగ్జరీ ప్యాలెస్ నిర్మించుకున్నారు. మీ ప్యాలెస్‌ల పిచ్చి రాష్ట్రానికి పెను ప్రమాదమని గ్రహించే ప్రజలు మిమ్మల్ని ఓడించారు" అని మంత్రి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తుందని, ప్రతిపక్షం ఇప్పటికైనా తన ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని మంత్రి హితవు పలికారు.

## అభివృద్ధికి, విధ్వంస రాజకీయాలకు మధ్యే పోటీ



విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి: అమరావతిపై వైసిపి అధినేత జగన్ చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా గందరగోళంగా ఉన్నాయని మాజీ మంత్రి, టిడిపి సీనియర్ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. ఒకప్పుడు అమరావతికి మద్దతు తెలిపిన జగన్, తర్వాత మూడు రాజధానుల ప్రతిపాదన తీసు కొచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు మావిగన్ పేరుతో మరో కొత్తనినాదం తీసుకురావడం ప్రజలను అయోమయంలోకి నెట్టే ప్రయత్నమేనని ఆరోపించారు. అభివృద్ధికి, విధ్వంస రాజకీయాలకు మధ్యే అసలు పోటీ జరుగుతోందన్నారు. అమరావతిలో ఇప్పటికే వేల కోట్ల రూపా యల పెట్టుబడులు వచ్చాయని సోమిరెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలతో పాటు జాతీయ బ్యాంకులు, విద్యాసంస్థలు, ప్రైవేట్ కంపెనీలు అక్కడ ఏర్పాటవుతున్నాయని చెప్పారు. క్వాంటమ్ వ్యాలీ, ఏఐ యూని వర్సిటీ, ఎన్‌ఐడీ, ఎయిమ్స్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు అమరావతికి వస్తు న్నాయని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో రాజధానిపై అనిశ్చితి సృష్టిం చడం రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధమన్నారు. ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిపైనే దృష్టి పెట్టిందని, ఆ లక్ష్యసాధన కోసం సిఎం చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని, మంత్రి లోకేశ్ పెట్టుబడులు తీసుకురావడానికి ప్రపంచవ్యాప్తం గా పర్యటిస్తున్నారని వివరించారు. రాష్ట్ర భవిష్యత్తుతో రాజకీయాలు చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు.

# ప్రభుత్వ స్కూళ్లకు కార్పొరేట్ హంగులు

- విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు
- ఆర్‌ఎస్‌ఆర్ స్కూల్‌లో మంత్రి నారాయణ ఉన్నత స్థాయి సమీక్ష

నెల్లూరు (వైద్యం), జులై 2, ప్రభాతవార్త: నెల్లూరు ప్రభుత్వ స్కూళ్లకు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అమలు చేస్తున్న విద్యా విధానంతో కార్పొరేట్ హంగులు కనిపిస్తున్నాయని, ప్రభుత్వ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పు లు వచ్చాయని రాష్ట్ర పరిపాలన, పట్టణా భివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. గురువారం ఆర్.ఎస్.ఆర్ స్కూల్‌లో మంత్రి నారాయణ ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహిం చారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్య అందిస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, పొంగూరు శరణిలతో కలిసి ఉపాధ్యాయులతో పాల్గొన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో విద్యా ప్రమాణాలపై జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిరంతర సమీక్షలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. నగరంలోని 15 పాఠశాలల తో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని జెడ్పీ స్కూళ్లను కూడా మోడల్ స్కూల్స్‌గా తీర్చిదిద్దు తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.



నెల్లూరులోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి విద్యావ్యవస్థలో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతున్నట్లు మంత్రి తెలిపారు. గత ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి గురై మూతపడి ఉన్న వి.ఆర్ స్కూల్‌ను, కూటమి ప్రభుత్వం రాగానే ఇచ్చిన హామీ మేరకు వెంటనే పునఃప్రారంభిం చామని తెలిపారు. ఈ స్కూల్లో కేవలం 1,000 సీట్లు ఉంటే, రికార్డు స్థాయిలో 2,000 మందికి పైగా విద్యార్థులు అడ్మిషన్ల కోసం పోటీ పడటం ప్రభుత్వ పాఠశాలలపై పెరిగిన నమ్మకానికి నిదర్శనమన్నారు. ఇదే స్ఫూర్తితో నెల్లూరు నగరంలోని మరో 15 పాఠశాలలను దాతల సహకారంతో కార్పొరేట్ స్థాయిలో డెవలప్ చేయాలని నిర్ణయించామని, దాతలు దేవిరెడ్డి సుధాకర్ రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిల ఆర్థిక సహాయంతో నూతన భవనాలను నిర్మించామన్నారు. మౌలిక సదుపా యాలకే పరిమితం కాకుండా, ప్రభుత్వ పాఠశా లల్లో చదివే పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించేందుకు నారాయణ విద్యాసంస్థల ప్రతినిధి పొంగూరు షరణి నేతృ త్వంలో ప్రత్యేక ఫౌండేషన్ కోర్సులు, స్టడీ మెటీరియల్, క్వశ్చన్ పేపర్లను ఉచితంగా అందజేస్తూ అండగా నిలుస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ స్కూళ్లలో ప్రతిభావంతులైన ఉపాధ్యా యులు, కష్టపడే విద్యార్థులు ఉన్నారని, వారికి సరైన మార్గదర్శకత్వం అందిస్తే అద్భుతాలు సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్, డిఈఓ బాలాజీరావు, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ, మాజీ జెడ్పిటిసి విజేతా రెడ్డి, కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి, హైస్కూల్స్ ప్రధానోపాధ్యా యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రసవ సమయంలో అత్యవసర చికిత్సపై శిక్షణ



విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి: గర్భిణుల ప్రసవ సమయంలో అధిక రక్తస్రావం, అధిక రక్తపోటు (బిపి) వల్ల మాతృ మరణాల వంటి సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గైనకాలజిస్టులు, పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్ నర్సులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల (సిహెచ్‌ఓ)లకు శిక్షణ ఇప్పించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ నిర్ణయించింది. ఈ క్రమంలో సన్నద్ధ (ఎన్‌జిఒ), ఫెడరేషన్ ఆఫ్ అబ్‌స్ట్రిక్ అండ్ గైనకాలజికల్ సొసైటీస్ ఆఫ్ ఇండియా (ఫాగ్స్)ల నుంచి సాంకేతిక సహకారాన్ని తీసుకోవడం ప్రారంభించింది. రాష్ట్రంలో తొలివిడత కింద అనంతపురం, బాపట్ల జిల్లాల్లో పనిచేసే గైనకా లజిస్టులు, పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్ నర్సుల (సుమారు 75 మంది) కు మంగళగిరిలో రెండురోజుల శిక్షణ గురువారంతో ముగిసిందని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఇంఛార్జి కమిషనర్ చక్రధర్ బాబు వెల్లడిం చారు. దశలవారీగా మిగిలిన జిల్లాలోని వారికి శిక్షణ ఇస్తామని చెప్పారు.

## పలుగు చేత పట్టిన మంత్రి శ్రీనివాస్

- జిన్నాంలో విబి జి రామ్‌జి పనులు ప్రారంభం



విజయనగరం, జులై 2 ప్రభాతవార్త: విజయనగరం మండలం జిన్నాం గ్రామంలో విబి జి రామ్‌జి పథకం పనుల ప్రారంభ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పలుగు చేత పట్టారు. జిన్నాం గ్రామంలో తామర చెరువులో విబి జి రాంజీ పనులను లాంఛనంగా ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విబి జి రామ్‌జి పథకంలో కేంద్ర ప్రభుత్వం వంద రోజుల నుంచి అదనంగా 25 రోజులు పాటు పెంచడంతో పాటు నూతనంగా తెచ్చిన పాలసీలు పేద ప్రజలకు రైతులకు ఎంతో మేలు చేసే విధంగా ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ అధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు చేపట్టి వేతనాలు పొందాలని సూచించారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఈ పథకంలో గత రెండు సంవత్సరాలుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో దేశంలో మూడవ స్థానంలో నిలవడం జరిగిందన్నారు. వేసవి సమయం లో పనులు లేనీ కారణంగా మన జిల్లా వాసులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లేవారని, ఉపాధి హామీ పనులు అటువంటి వారిని ఆదుకోవడం జరిగిందన్నారు. పేద ప్రజల ఉన్నతి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ పివి గోపాలరాజు, మక్కువ శ్రీధర్, బంగారు నాయుడు, చిన్నం నాయుడు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## విబిజి రాంజీ పథకం పేదలకు వరం

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



గాలివీడు. జులై 2 ప్రభాతవార్త: ఎంజిఎన్‌ఆర్‌ఈజిఎస్ పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న విబిజి రాంజీ పథకం పేద ప్రజలకు వరం లాంటిదని రాష్ట్ర రవాణా యువజన శాఖ మంత్రి మండి పల్లి రాంప్రసాద్ రెడ్డి కొనియాడారు. పేద ప్రజలకు ఉపాధి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచు కొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ఈ పథకాన్ని ఆయన గురు వారం మండలంలోని అరవిడి పంచాయితీలో కూలీలతో కలిసి ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ లాంటి ప్రాంతాలలోని ప్రజలకు విబి జి రాంజీ పథకం ఎం తో ఉపయోగకరంగా ఉంటాదని తెలిపారు. ఈ పథకం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలు కూలీలకు ఆర్థిక భద్రతనుస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు, నీటి భద్రత, జీవనోపాధి వనరులు, ఆస్తుల సృష్టి ద్వారా గ్రామీణ అభివృద్ధికి ఈ పథకం ఎంతో దోహదపడుతుందని కొనియాడారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలని ఈ సందర్భంగా అధికారులుకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు పురం హేమ్‌కుమార్ రెడ్డి, టిడిపి నాయకులు మందపాటి రవీంద్రబాబు, అధికారులు, ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

## సమష్టి కృషితోనే పురస్కారం

- అభినందన సభలో ఆవుల చంద్రశేఖర్



విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమిష్టికృషితోనే తనకు అంతర్జా తీయ అవార్డు దక్కిందని ఎపి ఔషధ, సుగంధ మొక్కల బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆవుల చంద్రశేఖర్ అన్నారు. లండన్ నగరంలోని బ్రిటన్ పార్లమెంట్ హాల్‌లో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అంతర్జాతీయ అవార్డును ఇటీవల అందుకుని గురువారం తొలిసారిగా కార్యాలయానికి విచ్చేసిన ఆయనకు ఘనస్వాగతం లభించింది. అనంతరం సంస్థ అధికారులు, ఉద్యో గులు, సిబ్బంది సంయుక్తంగా సిఈఓ చంద్రశేఖర్ ను ఘనంగా సత్కరిం చారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అభినందన సభలో ఆయన మాట్లాడు తూ, తన విజయం వెనక ఎందరో కృషి దాగి వుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో తనకు ఎంతగానో సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచ రికార్డు సాధించేలా ప్రోత్సహించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, ఆయుష్, రాష్ట్ర అటవీ శాఖ ఉన్నతాధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దేశంలోని వివిధవిశ్వవిద్యాలయాలు, పరిశోధనాశాలలు, మార్కెటింగ్ సంస్థల సహకారం మరువలేనిదన్నారు. ప్రజారోగ్యం కోసం భారతీయ సనాతన వైద్యాన్ని ప్రోత్సహిస్తున్న ప్రతి ఒక్కరికి తన అవార్డు అంకితమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ ప్రదీప్, బోర్డు ఉద్యోగులు పాల్గొన్నారు.

# సాక్ష్యాల నాశనానికి కుట్ర

- రికార్డులను తారుమారు చేస్తూ అడ్డంగా దొరికిపోయిన కార్యదర్శి
- పైడిభీమవరం పంచాయతీ నిధుల దుర్వినియోగం సర్వత్రా విమర్శలు

రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), జులై 2 ప్రభాతవార్త: ప్రజాధనానికి రక్షణగా నిలవాల్సిన అధికార యంత్రాంగమే అవినీతి ఊబిలో కూరుకుపోతే ఎలా ఉంటుందో చెప్పడానికి శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం, పైడిభీమవరం పంచా యతీ నిధులు గోల్‌మాల్ ఉదంతమే ప్రత్యక్ష నిదర్శనం. దాదాపు రూ.7.50కోట్లు సాధా రణ నిధుల దుర్వినియోగంపై ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా తీవ్ర దుమారం రేగుతుండగా తాజాగా ఈ అవినీతి తిమింగలాలు తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు వేసిన మరో ముఠా వ్యూహం బయటపడింది. బాధ్యులైన అధికారులు, ప్రైవేటు వ్యక్తులు కలిసి పంచా యతీకి సంబంధించిన అధికారిక రికార్డులను పైడిభీమవరం పంచాయతీ కార్యదర్శి ఇంట్లో రహస్యంగా తారుమారు చేస్తున్నట్లు కొన్ని కీలకమైన ఫోటోలు లభించడం స్థానికంగా తీవ్ర సంచలనం రేకెత్తిస్తోంది.

**ఉన్నతాధికారుల విచారణకు ముందే రికార్డుల మాయం:** ఈ భారీ కుంభకోణం ఉన్నతాధి కారులు ప్రత్యేక విచారణకు ఆదేశించే అవకాశం ఉందనే ముందస్తు సమాచారంతో అవినీతి సూత్రదారులు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. ఎలాంటి తీర్మానాలు, ముందస్తు అనుమతులు లేకుండా కేవలం 10నెలల స్వల్ప కాలంలోనే రూ.7.50కోట్లను ప్రైవేటు వ్యక్తుల ఖాతాల్లోకి మళ్లించారు. ఇప్పుడు ఆపాపం ఎక్కడ పట్టుబడుతుందో అనే భయంతో రికార్డులను తారుమారు చేస్తూ దొరికిపోవడంతో నిందితుల్లో వణుకు మొదలైంది. ఈ కుంభకోణంలో బోగస్ బిల్లులు, నకిలీ వ్యయాల పేరిట సాగిన దోపిడి వివరాలు చూస్తే సామాన్యుడు సైతం ముక్కున వేలేసుకోవాల్సిందే.


**అడ్వాన్స్‌పేరుతో దోపిడి.. నిబంధలన్నీ బేఖాతరు:** కమీషన్ల కక్కుర్తితో సి.సి రోడ్లు, డ్రైనేజీ పనుల పేరు చెప్పి నిబంధనలను పూర్తిగా గాలి కొదిలేశారు. అసలు పనులు ఏ మేరకు జరిగాయనే కనీస పర్యవేక్షణ లేకుండానే రూ.2.52కోట్లు అడ్వాన్స్ పేమెంట్ల రూపంలో ప్రైవేటు వ్యక్తుల ఖాతాల్లోకి జమైపోవడం వెనుక కొందరి హస్తం ఉందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

ప్రజలు ఆవేదన: పరిశ్రమల నుంచి ఏటా రూ.కోట్లు రూపాయలు పన్నుల రూపంలో నిధులు వస్తున్నప్పటికీ పంచాయతీలో కనీస మౌళిక సదుపాయాలు కల్పించక పోవడం దారణం. రూ.కోట్లు నిధులను కొందరు స్వార్థపరుల జేబుల్లోకి వెళ్లడం దారుణమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బహిరంగ విచారణ చేపట్టాలి: నిధుల గోల్‌మాల్‌పై బహిరంగా విచారణ చేపట్టాలని ఇటు ప్రజలు, అటు ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ వ్యవహారంపై కేవలం కంటితుడుపు ప్రాథమిక విచారణలతో సరిపెడితే ఊరుకునేది లేదని ప్రజలు, ప్రతిపక్షాలు హెచ్చరిస్తున్నాయి.



## దుర్గమ్మ ఆలయానికి భక్తుల విరాళాలు

ఇంద్రకీలాద్రి, జులై 2 ప్రభాతవార్త: దుర్గమ్మ భక్తులు గురువారం విరాళాలు సమర్పించారు. నిత్యాన్న దాన పథకమునకు కరీంనగర్ జిల్లా సుల్తానా బాద్‌కు చెందిన సింగీతం నాగమణి రూ.2లక్షల విరాళమును అందించారు. హైదరాబాద్ కు చెందిన మెరుగు గోపాల్ యాదవ్ కుటుంబ సభ్యులతో కలసి రూ.1లక్ష విరాళమును అందిం చారు. విజయవాడకు చెందిన ఉమ్మడిశెట్టి సీతా రామయ్య, వెంకటలక్ష్మి దంపతులు పరశు రామయ్య పేరు మీద రూ.1లక్ష విరాళమును అందించారు. దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.



## ఆ కాలేజీల గుర్తింపు రద్దు చేయండి

- పిడిఎస్‌యు నేతలు ఎస్.ఎండి రఫీ, కిరణ్ కుమార్



విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి: కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాల యాజమాన్యం ఐఐటి జెఇఇ మెయిన్స్, నీట్ పుస్తకాల పేర్లతో అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, తక్షణమే ఇంటర్మీడియట్ అధికారులు గుర్తింపు రద్దు చేయాలని పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌ఎండి రఫీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్పొరేటు, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు విచ్చలవిడిగా విద్యార్థుల తల్లిదండ్రుల నుండి వేలాది రూపాయలు అక్రమంగా పుస్తకాల పేరుతో ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు విధంగా పుస్తకాల వ్యాపారం చేయకూడదని ఉన్నప్పటికీ కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు వేల రూపాయలకు అమ్ముతున్నారని మండిపడ్డారు. ఇంటర్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, ఎంసెట్, నీట్, జెఇఇలకు అనుమతి లేకున్నా ఐఐటి, జెఇఇ మెయిన్స్, నీట్ అంటూ మోసం చేస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. ఇంటర్ బోర్డు నిబంధనలుకు విరుద్ధంగా నడుస్తున్న కళాశాలలను గుర్తించి గుర్తింపు రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు. కనీస వసతులు లేని ఇరుకు గదుల్లో విద్యార్థులను కూర్చోబెట్టి తరగతులు, హాస్టళ్లు నిర్వహిస్తూ వారి ప్రాణాలతో చెలగాట మాడుతున్నారని, ఇలాంటి గుర్తింపు లేని విద్యాసంస్థలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పిడిఎస్యు రాష్ట్ర ఉపాధ్యక్షులు భాను, రాష్ట్ర సహాయ కార్యదర్శి సిద్దు, రాష్ట్ర మావో, వేణు పిడిఎస్‌యు నాయకులు నవీన్, రూపా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎపిలో పోలీసు వ్యవస్థ అస్తవ్యస్తం

- మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్ర ఆరోపణలు
- క్రాంతికుమార్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా

విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి: ఎపిలో పోలీసు వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మో హన రెడ్డి ఆరోపించారు. పోలీసులను ప్రభుత్వ నేతలు స్వార్థప్రయోజనాల కోసం వినియోగించు కుంటున్నారని ఆక్షేపించారు. విజయవాడలో ఆత్మహత్య చేసుకున్న టాక్సీ డ్రైవర్ క్రాంతి కుమార్ కుటుంబాన్ని జగన్మోహన రెడ్డి గురు వారం పరామర్శించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ గత ఎనిమిదేళ్లుగా క్రాంతికుమార్ పై ఎలాంటి కేసులు లేవని, పాత కేసులను కోర్టు కొట్టివేసిందని గుర్తుచేశారు. గౌరవంగా టాక్సీ నడుపుకుంటూ జీవిస్తున్న వ్యక్తిని రోజూ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వేధింపులకు గురిచేశా రని ధ్వజమెత్తారు. ఆ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ స్థాయికి పోలీస్ వ్యవస్థ దిగజారిపోయిందని ఆరోపించారు. పోలీస్ స్టేషన్‌లో భద్రంగా ఉండాల్సిన సిసిటివి



ఫుటేజీని డిలీట్ చేశారని, నిబంధనలకు విరుద్ధంగా ఫుటేజీని ఎలా తొలగిస్తారని జగన్ ప్రశ్నించారు. మరణ వాంగ్మూలం ఆధారంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయలేదని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఎలాంటి పరిష్కారం చూపలేదని విమర్శించారు. క్రాంతికుమార్ కుటుంబానికి వైఎస్సార్సీపీ అన్ని విధాలా అండగా ఉంటుందని, న్యాయపరమైన పోరాటానికి పూర్తి సహాయసహకారాలు అందిస్తామని జగన్ భరోసా ఇచ్చారు.

## సిహెచ్ చంద్రశేఖర్ అరెస్టు అక్రమం: సిపిఎం

విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి: ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి వస్తున్న సందర్భంగా తిరుపతి జిల్లా కోడూరులో ట్రేడ్ యూనియన్ నాయకులు సిహెచ్ చంద్రశేఖర్‌ను అక్రమంగా అరెస్టు చేయడాన్ని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. ప్రస్తుతం చిట్వేల్ పోలీసు స్టేషన్ నిర్బంధంలో ఉన్నాడు. అరెస్టు చేసిన చంద్రశేఖర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నది. ఉపాధిహామీ కొత్త పథకం ప్రారంభించడానికి కేంద్ర మంత్రి వస్తున్న సందర్భంగా నిరసనలు తెలియజే యాలని వ్యవసాయ కార్మిక సంఘాలు పిలుపు నిచ్చాయి. ప్రజలకు శాపంగా మారుతున్న ఈ తప్పుడు పథకాన్ని వెంటనే ఉపసంహరించు కోవడానికి బదులు ఆందోళన చేస్తున్న వారిని నిర్బంధంచడం అప్రజాస్వామికం. గ్రామీణ పేదలకు మేలు చేసే (పాత) మహాత్మాగాంధీ ఉపాధిహామీ చట్టాన్ని కొనసాగించాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ కోరుతున్నది. ఈ మేరకు రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు.

# పులివెందులకు అత్యాధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్

ప్రజల సహకారంతో భద్రతా వ్యవస్థ బలోపేతం: కర్నూల్ రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్



పులివెందుల, జులై 2 ప్రభాతవార్త: ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు పులివెందులలో అత్యాధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ తెలిపారు. సాంకేతికతతో, సీసీ కెమెరాల ద్వారా ప్రజలకు మరింత జవాబు దారీతనంతో పోలీసు సేవలు అందించేలా వ్యవస్థను అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఐజీ మాట్లాడుతూ పట్టణంలోని రింగ్ రోడ్‌తో పాటు ప్రధాన కూడళ్లలో మున్సి పాలిటీ, వ్యాపారవేత్తలు, దాతల సహకారంతో రూ.32.62 లక్షల వ్యయంతో 120 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేరాల నివారణతో పాటు నేరస్థులను వేగంగా గుర్తించ డంలో ఈ కెమెరాలు కీలకంగా ఉపయోగపడతా యని చెప్పారు. నియోజక వర్గంలోని అన్ని పోలీస్ స్టేషన్లకు డ్రోన్ కెమెరాలను అనుసంధా నించి కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. పోలీసు సూపరింటెండెంట్ షెల్కే నచికేత్ విశ్వనాథ్ సూచనల మేరకు చేపట్టిన ఈ ప్రాజెక్టుకు పులివెందుల ప్రజలు, వ్యాపార సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు, మున్సిపాలిటీ సహకరించాయని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి సహకారంతో మున్సిపాలిటీ రూ.12 లక్షలు అందించిందని తెలిపారు. కమాండ్ కంట్రోల్ ఏర్పాటు శిలాఫలకాన్ని ఆవిష్కరిం చిన అనంతరం అర్బన్ స్టేషన్ నందు ఉన్న కంట్రోల్ కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కమాండింగ్ కంట్రోల్ కేంద్రంలో సీసీ కెమెరాల పనితీరును ఏ విధంగా నేరాలను గుర్తించడం జరుగుతుందో సాంకేతికత నాణ్యతను గురించి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి, డీఎస్పీ మురళి నాయక్, మున్సిపల్ కమిషనర్ మునికుమార్, అర్బన్ సీఐ శ్రీరామ్, రూరల్ సీఐ శాంతిలాల్, ట్రాఫిక్ సీఐ ప్రసాద్‌రావు, వేంపల్లి సీఐ నరసింహులు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది, దాతలు పాల్గొన్నారు.

# ఆదర్శ పాఠశాలగా నార్త్ రాజుపాళెం జడ్‌పిహెచ్‌ఎస్

**● కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ● విపిఆర్ అమృతధార ప్రారంభం**



**కొడవలూరు (నెల్లూరు), జులై 2, ప్రభాతవార్త:** నార్త్ రాజుపాళెం జెడ్పీహెచ్ఎస్ ను అన్ని మౌలిక వసతులతో ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దనున్నట్లు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. గురువారం నార్త్ రాజుపాళెం గ్రామ పంచాయతీ పరిధిలోని జెడ్పీహెచ్ఎస్‌లో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన తరగతి గదులు, విపిఆర్ అమృతధార వాటర్ ప్లాంట్ను ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో 'నాడు-నేడు' పనులు పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో వీపీఆర్ ఫౌండేషన్, సీఎస్ఆర్ నిధుల ద్వారా తొలుత రూ.15 లక్షలు ప్రకటించగా, ప్రస్తుతం దాదాపు రూ.20 లక్షలు వెచ్చించి తరగతి గదుల అభివృద్ధి, ఇతర మౌలిక వసతులు కల్పించినట్లు చెప్పారు. మిగిలిన పనులను కూడా త్వరలో పూర్తి చేసి పాఠశాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని, విద్యార్థులకు బెంచీలు, సైకిళ్లు కూడా అందజేస్తామని తెలిపారు. పాఠశాలలో సురక్షిత తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో 'విపిఆర్ అమృతధార' వాటర్ ప్లాంట్ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు, పౌష్టికాహారం, యూనిఫారాలు, పాఠ్య పుస్తకాలు అందుతున్నాయని చెప్పారు. విద్యార్థులు కిచెన్ నుంచి భోజనం తీసుకెళ్లి వరండాలో కూర్చుని తినడం గమనించానని, ఇకపై విద్యార్థుల వద్దకే భోజనం తీసుకొచ్చి వడ్డించే విధానాన్ని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, తహశీల్దార్ కె.స్ఫూర్తి రెడ్డి, ఎంపీడీవో వెంకట సుబ్బారావు, మండల విద్యాశాఖ అధికారి వసంతకుమారి, నాయకులు కరకట్టి మల్లికార్జున్, తువ్వర ప్రవీణ్‌కుమార్, బండి కిరణ్‌మార్, సిద్ధార్థ, బాబి, భూలోకం విజయకుమార్, వెంకటరమణారెడ్డి, గరికపాటి రాజేంద్ర, జొన్న శివకుమార్, కోవూరు వెంకీ, నక్క రమణయ్య, సతీష్‌రెడ్డి, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆర్ఎస్ ప్రవీణకుమార్ భార్య బదలీ.. బిఆర్ఎస్ విమర్శలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 2:** మాజీ ఐపిఎస్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సతీమణి లక్ష్మీబాయి బదిలీ అయ్యారు. వ్యవసాయ శాఖ మార్కెటింగ్ డైరెక్టర్ నుంచి డిపార్ట్‌మెంట్ ఆఫ్ కోపరేటివ్స్‌కు బదిలీ చేశారు. ఈ బదిలీపై ప్రవీణ్‌కుమార్ స్పందించారు. అన్నింటికి తెగించే రాజకీయాల్లోకి వచ్చామని అన్నారు. తొలుత తన భద్రత తగ్గించారని, హైకోర్టుకు వెళ్తే పాక్షిక ఉపశమనం లభించిందని చెప్పారు. అయినా జీర్ణించుకోలేక తన సతీమణిని బదిలీ చేశారని, సంబంధం లేని ఇతర చోటుకు బదిలీ చేశారన్నారు. భయపడేది లేదని, ప్రజల కోసం పోరాడుతూనే ఉంటామని చెప్పారు. బిఆర్ఎస్ నేత,మాజీ ఐపిఎస్ ప్రవీణ్‌కుమార్ భార్య,మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి బదలీ అంశం వివాదంగా మారింది. ప్రవీణ్‌పై కక్షతోనే బదిలీ చేశారని బిఆర్ఎస్ నేతలు ధ్వజమెత్తారు. ఏడాదిలోపు రిటైర్మెంట్ అయ్యేవారిని బదిలీ చేయరాదనే నిబంధన ఉన్నా ఆమెను హౌసింగ్ ఫెడరేషన్ ఎండీగా బదలీ చేశారని హరీశ్‌రావు విమర్శించారు. మంత్రి శ్రీధర్‌బాబు సతీమణి(ఐఏఎస్ శైలజా రామయ్యర్) విషయంలో తాము ఎప్పుడైనా అలా చేశామా? అని ప్రశ్నించారు.

# పార్టీ కోసం శ్రమించే జనసైనికులకు గుర్తింపు

**● జనసైనికులు, వీరమహిళలతో మాట్లాడి, వారి సేవలను అడిగి తెలుసుకున్న మంత్రి దుర్గేష్**



విజయవాడ పార్లమెంట్ జనసేన పరిశీలకులతో మంత్రి దుర్గేష్

**విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** జనసేన పార్టీ ఆశయం కేవలం అధికారం మాత్రమే కాదని, సమాజ సేవకు అంకితం కావడమేనని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. దరఖాస్తులు సమర్పించడానికి వస్తున్న ప్రతి ఒక్కరిలో ఆ ప్రజా సేవా సంకల్పం స్పష్టంగా కనిపిస్తోందని ఆయన కొనియాడారు. గురువారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు, మంత్రి కందుల దుర్గేష్ మరియు సమాచార సేకరణ కమిటీ ఆధ్వర్యంలో 4వ రోజు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం అత్యంత విజయవంతంగా జరిగింది. నిరంతరం పార్టీ అభ్యున్నతి కోసం పనిచేస్తూ, భవిష్యత్తులో కీలక బాధ్యతలు చేపట్టేందుకు ఉత్సాహం చూపిస్తున్న జనసైనికులు, వీరమహిళల నుంచి మంత్రి స్వయంగా దరఖాస్తులను స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను సులభతరం చేసేందుకు విజయవాడ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు విడివిడిగా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. "ఈ దరఖాస్తుల ప్రక్రియకు క్షేత్రస్థాయి నుంచి వస్తున్న విశేష స్పందనే జనసేన పార్టీపై, మా నాయకత్వంపై శ్రేణులకు ఉన్న నమ్మకానికి నిదర్శనం. పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు, ఆకాంక్షలకు అనుగుణంగానే ఈ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. గ్రాస్ రూట్ లెవెల్ నుండి సమర్థులైన, నిబద్ధత కలిగిన నాయకత్వాన్ని గుర్తించి, పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఇవ్వడమే మా ముఖ్య ఉద్దేశ్యం. అలాంటి నిజాయితీ గల నాయకులను ఎంపిక చేసే ప్రక్రియలో నేను భాగస్వామ్యం కావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఇక్కడ సేకరించిన దరఖాస్తులన్నింటినీ కూలంకషంగా పరిశీలించిన తర్వాత, తుది నిర్ణయాన్ని అధినేత పవన్ కళ్యాణ్ తీసుకుంటారు." అని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.

# ప్రశ్న రావణ్ పై కోడిగుడ్లతో దాడి

**తమకు అప్పగించాలంటూ సర్పవరం పిఎస్ ఎదుట జనసేన ఆందోళన**



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 2 ప్రభాతవార్త:** జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై అరెస్ట్ అయిన యూట్యూబర్ ప్రశ్న రావణ్ పై జనసైనికులు కోడిగుడ్ల దాడిచేశారు. పిఠాపురంలో కేసు నమోదు కావడంతో అరెస్టు చేసిన రావణ్‌కు బెయిల్ రావడంతో మరొక కేసులో సర్పవరం పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా సర్పవరం పీఎస్ ఎదుట జనసేన నేతలు, వీర మహిళలు కోడిగుడ్లతో దాడికి ప్రయత్నించారు. దీంతో జిల్లా కేంద్రం కాకినాడ సర్పవరం పోలీస్ స్టేషన్ ఎదుట ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పవన్ కళ్యాణ్ పట్ల అభ్యంతరకరంగా మాట్లాడిన ప్రశ్న రావణ్‌ను చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే తమకు అప్పగించాలంటూ జనసేన నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. సర్పవరం పోలీస్ స్టేషన్ నుంచి రావణ్ను వైద్య పరీక్షల కోసం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ప్రొటోకాల్ వాహనంకి అడ్డు తగిలారు. పోలీస్ వాహనాలకు అడ్డుపడుతూ రావణ్ను తమకు అప్పగించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అప్రమత్తమైన పోలీసులు ఆందోళనకారులను అడ్డుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం ప్రశ్న రావణ్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇప్పటికే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కార్యాలయంలో సోషల్ మీడియా దుర్వినియోగానికి సంబంధించి ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగింది.

# విబి జిరామ్‌జితో శ్రమజీవులకు భరోసా



విబి జి రామ్‌జి పనులను ప్రారంభిస్తున్న కలెక్టర్ లక్ష్మీశా, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

**విజయవాడ, జులై 2 ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా కొత్తగా అమలులోకి వచ్చిన వీబి జీ రామ్‌జీ పథకంతో శ్రమజీవులకు ఆర్థిక భరోసా లభిస్తుందని ఎన్‌టిఆర్ కలెక్టర్ లక్ష్మీశా పేర్కొన్నారు. ఎన్‌టిఆం ‾జిల్లా జి.కొండూరు మండలం చెవుటూరులో గురువారం మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌తో కలిసి వీబీ జీ రామ్‌జీ పథకంలో భాగంగా బండ్లవాగు ఫీడర్ ఛానల్ పనులను ప్రారంభించారు. తిరుపతిజిల్లా ముక్కావారిపల్లెలో కేంద్రమంత్రి శివరాజ్ చౌహాన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొన్న కార్యాక్రమాని ్న లైవ్‌లో వీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈపథకం ద్వారా ఉపాధిహామీ పనిదినాలను 100 రోజుల నుండి 125రోజులకు పెంచటంతోపాటు, రోజువారి వేతనాన్ని రూ.307 నుండి రూ.312కు పెంచటం ద్వారా గ్రామీణ శ్రామికులకు అదనపు భరోసా కల్పిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధితోపాటు భూగర్భజలాల పెంపునకు కూడా ఈకార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఈపథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో డొంకరోడ్లు, కాలువలు, వర్షపునీటి సంరక్షణ, మొక్కల పెంపకం, వంటి పనులకు ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వాలు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి రాము, జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీకుమార్, యంపిపి లక్ష్మీతిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఏసిబికి పట్టుబడ్డ డిప్యూటీ తహశీల్దార్



**జంగారెడ్డిగూడెం, జులై 2 ప్రభాతవార్త:** కోర్టు తీర్పు కాపీని ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసిన జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కార్యాలయ డిప్యూటీ తహశీల్దార్ పి. వెంకటేశ్వరరావును ఏసీబీ అధికారులు గురువారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బాధితుడు పోతన సుకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం టెక్కినవారిగూడెం గ్రామానికి చెందిన సుకుమార్ తండ్రికి, నిమ్మలగూడెం రెవెన్యూ పరిధిలోని ఒక ఎకరం 7 సెంట్లు భూమి వారసత్వంగా సంక్రమించింది. ఈ భూమికి సంబంధించి గతంలో ఎంఆర్ఓ మ్యుటేషన్ కూడా పూర్తి చేశారు. అయితే కుటుంబ తగాదాల కారణంగా సుకుమార్ మేనత్త కుటుంబం ఈమ్యుటేషన్‌ను రద్దు చేయాలంటూ ఆర్డీఓ కోర్టులో దరఖాస్తు చేసింది. ఈ ఏడాది జనవరిలో సుకుమార్ తండ్రి మరణించడంతో, లీగల్ హెయిర్ సర్టిఫికెట్ పొందిన సుకుమార్ స్వయంగా ఆర్డీఓ కోర్టు విచారణకు హాజరవుతున్నారు. ఈ కేసు విచారణ ముగిసిన అనంతరం, దానికి సంబంధించిన తీర్పు కాపీని ఇచ్చేందుకు జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఆఫీసులో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న డిప్యూటీ తహశీల్దార్ పి. వెంకటేశ్వరరావు 50000 లంచం డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని సుకుమార్ ఏలూరు ఏసీబీ డీఎస్పీని ఆశ్రయించారు. ఏసీబీ అధికారుల వ్యూహం ప్రకారం.. గురువారం బాధితుడు సుకుమార్ నుండి డిప్యూటీ తహశీల్దార్ వెంకటేశ్వరరావు 20,000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి, నగదుతో సహా ఆయనను పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

# పిఎఫ్ విత్‌డ్రాకు కనీస నిల్వ తప్పనిసరి... 75% మాత్రమే విత్‌డ్రాకు వెసులుబాటు

**న్యూఢిల్లీ, జులై 2:** ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) పథకంలో కేంద్ర ప్రభుత్వం నిబంధనలు సవరించింది. పిఎఫ్ విత్‌డ్రా నిబంధనలను సవరిస్తూ ఉద్యోగుల భవిష్య నిధి పథకం, 2026ను నోటిఫై చేసింది. గతనెల 29 నుంచి అమల్లోకి వచ్చిన ఈ కొత్త నిబంధనల ప్రకారం, పీఎఫ్ ఖాతా నుంచి పాక్షికంగా డబ్బులు విత్‌డ్రా చేయాలంటే, ఖాతాలో కనీసం 25 శాతం బ్యాలెన్స్ ఉంచడం తప్పనిసరి. ఉద్యోగి, యాజమాన్యం వాటాలు రెండింటికీ ఈ నిబంధన వర్తిస్తుంది. విత్‌డ్రాకు అందుబాటులో ఉండే మొత్తాన్ని లెక్కించే ముందు ఈ కనీస బ్యాలెన్స్‌ను పక్కన పెట్టాల్సి ఉంటుంది. ఒకరి ఖాతాలో రూ.1 లక్ష అర్హత మొత్తం ఉంటే, అందులో రూ.25,000 కనీస బ్యాలెన్స్‌గా ఉంచి, మిగిలిన రూ.75,000 నుంచే పథకం నిబంధనలకు లోబడి విత్‌డ్రా చేసుకోవాల్సి ఉంటుంది. ఈ 25 శాతం తప్పనిసరి బ్యాలెన్స్‌ను తీసివేయగా మిగిలిన మొత్తాన్నే అర్హత ఉన్న సభ్యుని బ్యాలెన్స్‌గా ఈపీఎఫ్ఓ నిర్వచించింది. కొత్త పథకం కింద పాక్షిక విత్‌డ్రాలకు అనుమతించే కారణాల జాబితాను కూడా విస్తరించారు. గృహ సంబంధిత అవసరాలైన ఇల్లు లేదా ఫ్లాట్ కొనుగోలు, ఇంటి నిర్మాణానికి స్థలం కొనుగోలు, గృహ నిర్మాణం, గృహ రుణం తిరిగి చెల్లించడం, ఇంటి మరమ్మతులు లేదా ఆధునీకరణ వంటి వాటికి నిధులు డ్రా చేసుకోవచ్చు. వీటితో పాటు అనారోగ్యం, పిల్లల ఉన్నత విద్య, వివాహం వంటి ఖర్చుల కోసం అర్హత ఉన్న బ్యాలెన్స్‌లో 100 శాతం వరకు విత్‌డ్రా చేసుకునేందుకు అనుమతి ఇచ్చారు. ఉద్యోగంలో చేరిన 12 నెలల తర్వాత పాక్షిక విత్‌డ్రాలకు అర్హత లభిస్తుంది. ప్రత్యేక పరిస్థితుల్లో విత్‌డ్రా చేసుకునేందుకు అదనపు వివరణలు ఇవ్వాల్సిన అవసరం లేదని కూడా స్పష్టం చేశారు. పిఎఫ్ చందాదారులు తమ పీఎఫ్ డబ్బులను నేరుగా యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా తమ బ్యాంకు ఖాతాల్లోకి పొందే సదుపాయాన్ని అందుబాటులోకి తేనుంది. దీనికి సంబంధించిన టెస్టింగ్ ఇప్పటికే పూర్తయింది. ఈ విధానం ద్వారా 7 కోట్లకు పైగా సభ్యులకు సేవలు వేగంగా, సులభంగా అందనున్నాయి. మరో నెల రోజుల్లో వాట్సాప్ ద్వారా కూడా కీలక సేవలను ప్రారంభించాలని ఈపీఎఫ్ఓ యోచిస్తోంది. ఈపీఎఫ్ఓ వెరిఫైడ్ వాట్సాప్ నంబర్‌కు హాలో అని మెసేజ్ పంపడం ద్వారా చందాదారులు సేవలు పొందవచ్చు.

# తెలంగాణ వ్యవసాయంపై ఇండోనేసియా అధ్యయనం

**రాష్ట్రంలో పర్యటించిన 12 మంది ప్రతినిధి బృందం**

**హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం సందర్శన**

**హైదరాబాద్, జులై 2, ప్రభాతవార్త:** తెలంగాణ వ్యవసాయంపై ఇండోనేషియా ప్రతినిధి బృందం అధ్యయనం చేస్తోంది. ఈ మేరకు 12 మందితో కూడిన ప్రతినిధి బృందం రాష్ట్రంలో పర్యటిస్తోంది. ఇండోనేషియా ఆహార స్వయం సమృద్ధి దిశగా పయనిస్తున్న నేపథ్యంలో, ఆ దేశ ఉన్నత విద్య, పరిశోధనా రంగానికి చెందిన 12 మంది సభ్యుల బృందం రెండు రోజులుగా రాష్ట్రంలోని వ్యవసాయ పరిశోధనను అధ్యయనం చేస్తోంది. ఆహార భద్రత, సుస్థిర వ్యవసాయ రంగాలలో సహకారాలను అన్వేషించడానికి హైదరాబాద్ విశ్వ విద్యాలయాన్ని (యూఓహెచ్) సందర్శించింది. భౌగోళికసూచన ఇండోనేషియా ఉన్నత విద్య, శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ, రాష్ట్ర సచివాలయ మంత్రిత్వ శాఖల సంయుక్త చొరవ అయిన ‗వ్యవసాయ ప్రత్యామ్నాయాలను నేర్చుకోండి‗ అనే కార్యక్రమం కింద ఈ పర్యటనను నిర్వహించారు. ఆహార భద్రతను బలోపేతం చేయడం, దిగుమతులపై ఆధార పడటాన్ని తగ్గించడంపై ఇండోనేషియా జాతీయ ప్రాధాన్యతకు ఈ కార్యక్రమం అనుసంధానించబడిందని హైదరాబాద్ యూనివర్సిటీ గురువారం మీడియాకు వెల్లడించింది.

ఈ ప్రతినిధి బృందంలో ఉన్నత విద్య, శాస్త్ర, సాంకేతిక మం త్రిత్వ శాఖ, పరిశోధన, అభివృద్ధి డైరెక్టరేట్ జనరల్ కార్యదర్శి జునైదీ ఖోటిబ్‌తో పాటు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ సంస్థల ప్రతినిధులు ఉన్నారు. భారతదేశం మరియు ఇండోనేషియాలోని సంస్థల మధ్య సహకా రాలు, ఉమ్మడి పరిశోధన, జ్ఞానమార్పిడి ద్వారా సుస్థిరత, వ్యవసాయం, ఆహార వ్యవస్థలలోని ఉమ్మడి సవాళ్లను పరిష్కరించడంలో సహాయ పడగలవని హైదరాబాద్ విశ్వవిద్యాలయం విసి జె. అనురాధ తెలిపారు.

# 'స్పీడ్ గంజాయి' ముఠా అరెస్టు

**రోజూ దాదాపు 100 ఆర్డర్లకు సరఫరా**

**యేడాదికి రూ. 5 కోట్లు ఆర్జిస్తున్న ముఠా: సిపి సజ్జనార్**

**హైదరాబాద్, జులై 2, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా స్పీడ్ పోస్ట్ ద్వారా గంజాయి సరఫరా చేస్తున్న ముఠాను అరెస్ట్ చేశామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. హెచ్-న్యాబ్ అధికారులు, గుడిమల్కాపూర్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి నింది తుల్ని అరెస్ట్ చేశారన్నారు. గంజాయిను స్పీడ్ పోస్ట్ ద్వారా డోర్ డెలివరీ చేస్తున్నారని.. జార్ఖండ్‌కు చెందిన సత్యం మిశ్రాను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఇంటర్ చదివిన సత్యం మిశ్రా పెయింట్ పనిచేసి మానేశాడని.. ఆ తర్వాత లారీ డ్రైవర్‌గా పనిచేశాడన్నారు. 2018లో గంజాయికి అలవాటు పడ్డ మిశ్రా.. రాహుల్ జై, సచిన్ మిశ్రా, సంతోష్ లతో సిండికేట్‌గా ఏర్పడి.. సొంత ఊరిలోనే గంజాయి పంట వేశారని తెలిపారు. ఊరిలో చాలా మందితో గంజాయి పంట పండించి కొను గోలు చేసి కస్టమర్లకు సరఫరా చేస్తున్నారని చెప్పారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారన్నారు. స్పీడ్ పోస్ట్, కొరియర్ సేవల ద్వారా 21 రాష్ట్రాలకు గంజాయి సరఫరా చేస్తున్న ట్లు తెలిపారు. హైదరా బాద్, ముంబై, చెన్నై, ఢిల్లీ, బెంగళూరు సహా పలు నగరాలకు గంజాయి సరఫరా చేస్తున్నారని సజ్జనార్ తెలిపారు. పార్సి ళ్లలో మందులు ఉన్నట్లు తప్పుడు డిక్లరేషన్ ఇచ్చి పోస్టల్ అధికారులను మోసగిస్తున్నారని.. ఇస్రీ బజార్, పుస్రో పోస్టాఫీసుల నుంచి స్పీడ్ పోస్ట్ ద్వారా పార్సిళ్లు బుక్ చేసినట్లు గుర్తించామన్నారు. వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా ఆర్డర్లు తీసుకుని యుపిఐ ద్వారా నగదు లావాదేవీలు జరిగేవన్నారు. రోజుకు 80-100 ఆర్డర్లు వస్తుండగా.. అందులో 8 నుంచి 10 వరకు స్పీడ్ పోస్ట్ పార్సిళ్ల ద్వారా గంజాయి పంపిణీ చేస్తున్నారన్నారు.

ఒక్కో పార్సిల్‌లో 50-250 గ్రాముల గంజాయి ఉంచుతూ డెలివరీ చేస్తున్నారని.. ఒక్కో ప్యాకెట్ రూ.1,500 నుంచి రూ.8,000 వరకూ విక్రయిస్తున్నట్లు తెలిపారు. రోజుకు సుమారు రూ.1 లక్ష ఆదాయం లభించగా.. నెలకు రూ.30 లక్షల నుంచి రూ.35 లక్షలు, యేడాదికి రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల టర్నోవర్ ఉందన్నారు.



స్పీడ్ పోస్ట్ ద్వారా సరఫరా అవుతున్న గంజాయి ప్యాకెట్లనుచూపుతున్న సిపి సజ్జనార్

వచ్చిన డబ్బుతో నిందితులు బంగారం, లగ్జరీ వాహనాలు కొనుగోలు చేశారని సీపీ వెల్లడించారు. నిందితులు పలు బ్యాంక్ ఖాతాలు, ఫోన్‌పే, యుపిఐ ఐడీలతో మనీలాండరింగ్ చేసినట్లు గుర్తించా మన్నారు. ఎస్ఆర్‌నగర్, గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పార్సిల్‌పై అనుమానం కలిగి దర్యాప్తు చేశామని.. హైదరాబాద్‌కు వచ్చిన 2 పార్సిల్స్ ఫ్లైట్‌లోనే వచ్చాయన్నారు. నగరంలోని అన్ని కొరియర్ సంస్థలకు ప్రతి పార్సిల్‌ను తప్పనిసరిగా స్కాన్ చేయాలని ఆదేశాలు జారీ చేస్తాన్నారు. అనుమానాస్పద పార్సిళ్లు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. కాగా,ఈ అంతర్రాష్ట్ర ముఠా నెట్ వర్క్ ఛేదనలో 22 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నకిలీ వీసాలతో 20 మంది అరెస్టు



**శంషాబాద్ జులై 2, ప్రభాతవార్త :** నకిలీ వీసాలతో విదేశాలకు వెళ్లేందుకు ప్రయత్నించిన 20 మంది మహిళలను ఇమిగ్రేషన్ అధికారులు అరెస్ట్ చేశారు. గురువారం ఆంధ్రప్రదేశ్ తూర్పు గోదావరి జిల్లాకు చెందిన 20 మంది మహిళలు శంషా బాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానా శ్రయానికి చేరుకు న్నారు. అయితే ఇమ్మిగ్రేషన్ అధికారులు తని ఖీలు చేస్తుండగా వారు సమర్పించిన వీసాలు నకిలీ అన్ని తేలింది. మహిళ లంతా ఓమన్ ఎయిర్ వేస్ విమానంలో మస్కట్ వెళ్లేందుకు సిద్ధమవుతుండగా వారిని అరెస్టు చేసి ఎయిర్ పోర్ట్ క్రైమ్ అవుట్ పోస్ట్ పోలీసులకు అప్పగించారు.

**ఏజెంట్లను నమ్మి మోసపోవద్దు : ఎసిపి శ్రీకాంత్‌గౌడ్**

శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుండి నకిలీ వీసాలతో ఓమన్ వెళ్లుందుకు ప్రయత్నించిన మహిళలపై అనుమానం వచ్చి విచారణ చేయగా వర్క్ విసాకు బదులుగా టూరిస్ట్ వీసాతో చిన్న స్టాంప్ వేసుకొని వెళ్లేందుకు సిద్ధమైనట్లు అధికారులు గుర్తించి 20 మంది మహిళలను అదుపులోకి తీసుకోవడం జరిగిందని ఎసిపి శ్రీకాంత్‌గౌడ్ వెల్లడించారు. మహిళలను విచారించగా చేసిన తప్పును ఒప్పుకున్నారని నకిలీ విసాలను స్వాధీనం చేసుకొని మహిళల స్టేట్‌మెంట్ ఆధారంగా కేసు నమోదు చేయడం జరిగిందని అయితే విచారణలో 19 సబ్ ఏజెంట్స్ పేర్లు బయటకు వచ్చాయని వారిపైన ఇక ఏ ఏజెన్సీలు ఉన్నాయో లోతుగా దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఉపాధి కోసం తాము విదేశాలకు వెళ్లేందుకు ఒక ట్రావెల్ ఏజెంట్‌ను ఆశ్రయిం చామని, అతను అసలు వీసాలు అని చెప్పి తమవద్ద పెద్దమొత్తంలో డబ్బులు వసూలుచేసి నకిలీవీసాలు ఇచ్చి మోసం చేశాడని మహిళలు వాపోయారు.

# జులైలోనూ వర్షాలు అంతంతే

**హైదరాబాద్, జులై 2, ప్రభాతవార్త:** నైరుతి రుతుపవనాల రాక కోసం, స్థిరమైన వానచినుకుల కోసం ఆశగా ఎదురుచూస్తున్న రైతన్నలకు, సామాన్య ప్రజానీకానికి మరికొన్ని రోజులు నిరాశ తప్పేలా లేదు. జూన్ నెలలో తీవ్రమైన వర్షపాత లోటును ఎదుర్కొన్న దేశానికి, జూలై నెలలోనూ పెద్దగా ఊరట లభించే సూచనలు కనిపించడం లేదు. ఈ జూలైలో దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతమే నమోదయ్యే అవకాశాలున్నాయని భారత వాతావరణశాఖ (ఐఎండీ) విడుదల చేసిన అంచనాల్లో స్పష్టం చేసింది. దీర్ఘకాలిక సగటు 1971-2020 మధ్య కాలాన్ని పరిగణనలోకి తీసుకుని లెక్కించిన ప్రకారం జూలై నెలలో కేవలం 94 శాతం వర్షమే కురవొచ్చని ఐఎండీ తెలిపింది. సాధారణంగా జూలై నెలలో దీర్ఘకాలిక సగటు వర్షపాతం 280.4 మిల్లీమీటర్లుగా ఉంటుంది. గడిచిన జూన్ నెలలో దేశవ్యాప్తంగా ఏకంగా 40 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. ముఖ్యంగా మధ్య భారతంలో అత్యధికంగా 50.4 శాతం లోటు కనిపించింది. 1901లో వర్షపాత రికార్డులు ప్రారంభమైనప్పటి నుండి జూన్‌లో మూడవ అత్యల్ప వర్షపాతం నమోదైన నెలగా నిలిచింది. ఈ నెలలో దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం కేవలం 99.5 మిల్లీమీటర్లుగానే రికార్డైంది. దేశవ్యాప్తంగా ఆందోళనకర పరిస్థితులు ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాలకు మాత్రం తాత్కాలిక ఉపశమనం లభించనుంది. బంగాళాఖాతంలోని ఉత్తర భాగం నుంచి జమ్మూ కశ్మీర్ వరకూ 1500 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న భారీ వర్ష మేఘాలు ఉపగ్రహ చిత్రాల్లో వ్యక్తమయ్యాయి. హిమాలయాలకు సమీపంలో ఏర్పడిన ఈ రుతుపవన ద్రోణి క్రమంగా దక్షిణం వైపు కదులుతోంది. కాగా ఈ ఏడాది వర్షాలు ముఖం చాటేయడానికి గల ప్రధాన కారణాలను ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర వివరించారు. పసిఫిక్ మహా సముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల ఏర్పడే ఎల్ నినో ప్రభావం రాబోయే నెలల్లో బలపడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

# డీలిమిటేషన్ లక్ష్యంగా మోడీ వ్యూహం

**ఈ సమావేశాల్లోనే**

**ఆమోదింపచేసేందుకు పక్కా కసరత్తు**

**న్యూఢిల్లీ, జులై 2:** మోడీ 4.0 లక్ష్యంగా కొత్త వ్యూహాలు సిద్ధం అవుతున్నాయి. తాజా లెక్కలు తెర మీదకు వస్తున్నాయి. అందులో భాగంగా డీలిమిటేషన్ జమిలి నిర్వహణను ప్రధాని మోడీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. అమలు చేసి తీరాలని డిసైడ్ అయ్యారు. అందులో భాగంగా మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుకు వీలుగా జాతీయ రాజకీయాల్లో వేగంగా అడుగులు పడుతున్నాయి. పార్లమెంట్ లో వీగిన బిల్లును మరోసారి ప్రవేశ పెట్టి ఆమోదం పొందేలా వ్యూహాలు సిద్ధం చేస్తున్నారు. దీని ద్వారా జమిలి డీలిమిటేషన్ అమలు ముహూర్తం దాదాపు ఖరారైంది. అధికారిక ప్రక్రియ లాంఛనంగా మారనుంది. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కొత్త లెక్కలు సిద్ధం చేస్తోంది. లోక్‌సభలో ఇటీవల వీగిపోయిన డీలిమిటేషన్ మహిళా రిజర్వేషన్ బిల్లు ఎలాగైనా ఆమోదించుకునే వ్యూహాలను సిద్ధం చేసింది. అందులో భాగంగా తాజాగా ఎన్డీఏ వైపు టీఎంసీ, థాక్రే శివసేన ఎంపీలు మద్దతుగా నిలవటంతో ధీమా కనిపిస్తోంది. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే డీలిమిటేషన్ బిల్లు, ఒక దేశం, ఒక ఎన్నిక బిల్లు (జమిలి) రెండింటికీ పార్లమెంట్ ఆమోదం పొందాలని ప్రభుత్వం వ్యూహాత్మకంగా కార్యాచరణను సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. ఏప్రిల్‌లో డీలిమిటేషన్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టినపుడు టీఎంసీ నుంచి 29 మంది, డీఎంకే నుంచి 22 మంది ఎంపీలు బిల్లుకు వ్యతిరేకంగా ఓటేశారు. ఇండియా కూటమిలో ఉన్న టీఎంసీ, డీఎంకే పార్టీల ఆదేశాల ప్రకారం ఆయా ఎంపీలు ఇలా చేశారు. ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. టీఎంసీ నుంచి 20 మంది ఎన్డీఏ వైపు నిలుస్తున్నారు. నియోజకవర్గాల పునర్విభజన జరగాలంటే హాజరైన వారిలో మూడింట రెండు వంతుల మంది ఆ బిల్లుకు మద్దతు తెలపాల్సి ఉంటుంది. లోక్‌సభలో ఎన్డీయే కూటమికి 293 మంది (54) సభ్యుల మద్దతు ఉండగా, రాజ్యసభ లో ఎన్డీయేకు అనుకూలంగా 141 మంది (58 ) సభ్యుల మద్దతు మాత్రమే ఉంది. తాజా పరిణామా లతో టీఎంసీ (29 మంది ఎంపీలు), డీఎంకే (22 మంది ఎంపీలు) ఓటింగ్‌లో పాల్గొనకుండా గైర్హాజరైనా లేదా బిల్లుకు మద్దతు ప్రకటించినా డీలిమిటేషన్ బిల్లు లోక్‌సభలో గట్టెక్కే అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉంది. ఇండియా కూటమి నుంచి బయటకొచ్చిన ఆమ్ ఆద్మీపార్టీ (లోక్‌సభ లో ముగ్గురు ఎంపీలు), కాంగ్రెస్‌తో దూరాన్ని పాటిస్తున్న సమాజ్‌వాదీ పార్టీ (లోక్‌సభలో 37 మంది ఎంపీలు) ఒకవేళ మద్దతు ప్రకటిస్తే సునాయాసంగా లోక్‌సభలో డీలిమిటేషన్ బిల్లుకు ఆమోదం లభించవచ్చు. ఇక, రాజ్యసభలోనూ లెక్కలు మారిపోతున్నాయి. ఈ లెక్కలను విశ్లేషించిన తర్వాతే.. డీలిమిటేషన్ బిల్లును పునఃప్రవేశపెట్టేందుకు కేంద్ర హోం శాఖ మళ్లీ ప్రయత్నాలు చేస్తోంది. 2029 ఎన్నికలే లక్ష్యంగా వీటి ఆమోదం అమలు దిశగా పక్కాగా వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తోంది. దీంతో ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు రాజకీయంగా కీలకంగా మారనున్నాయి.





సెనెగల్ విజయం ఆశలపై నీళ్లు చల్లిన యూరి టైల్ మన్స్



రెండు మెరుపు గోల్స్ చేసిన హ్యారీ కేన్



గోల్ కొట్టిన అమెరికా ఫార్వర్డ్ బలోగన్‌ను అభినందిస్తున్న సహచరులు

# సెనెగల్‌కు బెల్జియం షాక్ : ఇంగ్లాండ్ గట్టెక్కించిన హ్యారీ కేన్

**కాలిఫోర్నియా, జులై 2:** సాకర్ ప్రపంచకప్‌లో నరాలు తెగే ఉత్కంఠ మ్యాచ్‌లు కొనసాగుతున్నాయి. ఇంగ్లాండ్, బెల్జియం, అమెరికా తమ ప్రత్యర్థులపై గెలుపొంది ముందంజ వేశాయి. ఓటమి అంచుల నిలిచిన బెల్జియం చివర్లో చక్కగా పుంజుకుని సెనెగల్‌పై 3-2తో గెలుపొందగా.. కాంగోపై కూడా చివర్లో మెరుపు గోల్స్‌తో ఇంగ్లాండ్ గటెక్కింది. అతిథ్య అమెరికా 2-0 గోల్స్ తేడాతో బోస్నియా-హెర్జగోవినాపై విజయం సాధించింది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో క్రొయేషియాతో పోర్చుగల్, స్విట్జర్లాండ్‌తో అల్జీరియా, ఈజిప్ట్‌తో ఆస్ట్రేలియా తలపడతాయి.

ఫిఫా ప్రపంచకప్ రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లో సెనెగల్‌తో తలపడిన బెల్జియం ఓటమి అంచుల నుంచి సంచలన కమ్ బ్యాక్ ఇచ్చింది.ఓ దశలో 0-2గోల్స్‌తో వెనుకబడిన బెల్జియం, అనూహ్యంగా పుంజుకుని 3-2 తేడాతో గెలిచి అందరినీ ఆశ్చర్యపర్చింది. మ్యాచ్ ముగియడానికి కొన్ని క్షణాల ముందు యూరి టైల్‌మన్స్ పెనాల్టీని గోల్‌గా మలిచి బెల్జియంకు అపురూప విజయాన్ని అందించాడు. ఈ గెలుపుతో బెల్జియం ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. అంతర్జాతీయ ఫుట్‌బాల్ హిస్టరీలో బెల్జియం, సెనెగల్ జట్లు తలపడటం ఇదే మొదటిసారి. మ్యాచ్ ప్రారంభమైన కొద్దిసేపటికే బెల్జియం తరఫున లియాండ్రో ట్రోసార్డ్ గోల్ చేయడానికి ప్రయత్నించినప్పటికీ, ఆ తర్వాత పూర్తి ఆధిపత్యం సెనెగల్‌దే అయ్యింది. సెనెగల్ ఆటగాళ్లు మైదానంలో చిరుతల్లా కదిలారు. ఇస్మాయిలా గోల్ చేయడానికి ప్రయత్నించగా, బంతి పోస్ట్‌కి తగిలి రీబౌండ్ అయింది. అయితే, అక్కడే ఉన్న సెనెగల్ యువ మిడ్‌ఫీల్డర్ హాబీబ్ దియారా ఆ రీబౌండ్ బంతిని ఏమాత్రం ఆలస్యం చేయకుండా గోల్ పోస్ట్‌లోకి నెట్టాడు. దీంతో మ్యాచ్ మొదటి అర్ధభాగంలో సెనెగల్ 1-0 ఆధిక్యాన్ని సంపాదించింది.

రెండో అర్ధభాగం లోనూ సెనెగల్‌దే హవా నడిచింది.కేవలం ఆరు నిమిషాలకే లాంగ్ బాల్‌ను ఇస్మాయిలా గోల్‌గా మలిచాడు.దీంతో సెనెగల్ 20తో ఆధిక్యాన్ని సాధించింది. ఆట 70వ నిమిషం దాటిన తర్వాత బెల్జియం ఆటలో వేగం పెరిగింది. బెల్జియం స్టార్ స్ట్రైకర్ రోమేలు తనదైన శైలిలో గోల్ పోస్ట్ దగ్గర నుంచి నెట్‌లోకి పంపి బెల్జియం ఖాతా తెరిచాడు. కొద్దిసేపటికే ట్రోసార్డ్ అందించిన అద్భుతమైన పాస్‌ను యూరి టైల్‌మన్స్ గోల్‌గా మలిచాడు. దీనితో స్కోరు 2-2తో సమం చేశాడు. ఎక్స్‌ట్రా సమయంలో లభించిన పెనాల్టీ కిక్‌ను గోల్‌గా మలిచి బెల్జియంకు విజయం అందుకుంది.

**బోస్నియాపై అమెరికా విజయం**

ఆతిథ్య అమెరికా జట్టు ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. రౌండ్32 మ్యాచ్‌లో బోస్నియా అండ్ హెర్జెగొవినాపై 2-0 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించి టైటిల్ రేసులో నిలిచింది. ఈ మ్యాచ్‌లో అమెరికా కేవలం 10మంది ఆటగాళ్లతోనే పోరాటం చేసింది. 64వ నిమిషంలో స్టార్ ఫార్వర్డ్ ఫొలారిన్ బలోగన్ రెడ్ కార్డ్‌కు గురై మైదానాన్ని వీడాడు. బలోగన్ 45వ నిమిషంలో గోల్ చేసి అమెరికాకు ఆధిక్యం అందించాడు. ఈ టోర్నీలో అతనికి ఇది మూడో గోల్. బలోగన్ రెడ్ కార్డ్‌కు గురైనా అమెరికా 82వ నిమిషంలో మరో గోల్ చేసి ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది. మలిక్ టిల్‌మ్యాన్ అద్భుతమైన ఫ్రీకిక్‌తో గోల్ చేసి అమెరికా విజయాన్ని ఖాయం చేశాడు. అమెరికా రౌండ్ ఆఫ్ 16కు చేరడం ఇది మూడో సారి. తదుపరి మ్యాచ్‌లో బెల్జియంతో తలపడనుంది.

**ఇంగ్లండ్‌ను గెలిపించిన హ్యారీ కేన్**

ఆరు దశాబ్దాల తర్వాత ఇంగ్లండ్ ఫుట్‌బాల్ జట్టు అద్భుతం చేసింది. ఆరంభంలో వెనుకబడినా చివరి నిమిషాల్లో గోల్స్‌తో కాంగోపై 2-1తో గెలుపొందింది. కెప్టెన్ హ్యారీ కేన్ 11 నిమిషాల వ్యవధిలో రెండు గోల్స్ చేసి ఇంగ్లండ్ జట్టును గెలిపించాడు. అంతకుముందు ఏడో నిమిషంలో బ్రియాన్ సిపెంగా గోల్‌తో కాంగో జట్టు 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత రక్షణాత్మక ఆట తీరుతో ఇంగ్లండ్ జట్టును నిలువరించి గెలుపొందాలని ప్రయత్నించింది.కానీ ఇంగ్లండ్ జట్టు అవకాశం దొరికినపుడల్లా స్కోరును సమం చేసేందుకు యత్నించింది. చివరకు 75వ నిమిషంలో సఫలమైంది. ఆంథోని గోర్డాన్ పాస్‌ను డి-ఏరియాలో అందుకున్న హ్యారీ కేన్ హెడర్ షాట్‌తో గోల్‌గా మలిచాడు. దాంతో ఇంగ్లండ్ 1-1తో స్కోరును సమం చేసింది. అనంతరం 86వ నిమిషంలో గోర్డాన్ అందించిన పాస్‌ను హ్యారీ కేన్ లక్ష్యానికి చేర్చడంతో ఇంగ్లండ్ 2-1తో విజయబావుటా ఎగురవేసింది.

# వింబుల్డన్‌లో సీడెడ్ల జోరు

## మూడో రౌండ్‌లో సిన్నర్, జొకోవిచ్; మిర్రాకు షాక్



**లండన్, జులై 2:** వింబుల్డన్‌లో సీడెడ్ ప్లేయర్లు జోరు కొనసాగుతోంది. పురుషుల సింగిల్స్‌లో ఏడుసార్లు ఛాంపియన్ నోవాక్ జొకోవిచ్, ప్రపంచ నెంబర్ వన్ జానిక్ సిన్నర్ వింబుల్డన్ మూడవ రౌండ్‌లోకి ప్రవేశించగా... మహిళల సింగిల్స్‌లో ఫ్రెంచ్ ఓపెనర్ ఛాంపియన్ మిర్రా ఆండ్రీవాకు షాక్ తగిలింది. రెండో రౌండ్‌లోనే అనూహ్య ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించింది.

ఎనిమిదోసారి వింబుల్డన్ అందుకోవాలనే పట్టుదలతో బరిలోకి దిగిన నోవాక్ జొకోవిచ్.. రెండో రౌండ్‌లో గ్రీక్ ప్లేయర్ స్టెఫానోస్ సిట్సిపాస్‌ను చిత్తుగా ఓడించాడు. 98 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో జొకోవిచ్ 6-3, 6-4, 6-2తో వరుస సెట్లలో గెలుపొందాడు. ఈమ్యాచ్‌లో అతను ఏకంగా 33విన్నర్లు కొట్టాడు. 12 ఏస్‌లు సంధించాడు. రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్ స్లామ్ సింగిల్స్ టైటిల్ గెలిచి చరిత్ర సృష్టించాలన్న జొకోవిచ్ ప్రయత్నానికి తొలి రౌండ్‌లో గట్టిపోటీ ఎదురైనా.. ఈ రౌండ్‌లో మాత్రం అతని ధాటి ముందు స్టెఫానోస్ నిలువలేకపోయాడు. వింబుల్డన్‌లో జొకోవిచ్‌కు ఇది 104వ మ్యాచ్ విజయం.పురుషుల సింగిల్స్‌లో రోజర్ ఫెదరర్ ఓపెన్ ఎరా రికార్డుకు కేవలం ఒక విజయం వెనుక ఉన్నాడు. మూడో రౌండ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన 25వ సీడ్ ఆర్థర్ రిండర్‌క్నెచ్‌తో తలపడతాడు. జొకోవిచ్ చివరి సారి వింబుల్డన్‌ను 2022లో నెగ్గాడు.

**చెమటోడ్చి నెగ్గిన సిన్నర్**

జొకోవిచ్‌కు భిన్నంగా వరల్డ్ నెంబర్ వన్ సిన్నర్... రెండోరౌండ్‌లో చెమటోడ్చా వచ్చింది. పోర్చుల్‌కు చెందిన పోర్చుగల్‌కు చెందిన నూనో బోర్జెస్ గట్టి పోటీ ఇచ్చాడు. తొలి రెండు సెట్లు టైబ్రేకర్ వరకు కొనసాగాయి. గెలుపు నీదా నాదా అన్నట్లుగా ఉత్కంఠగా సాగింది. ఇక్కడ అనుభవజ్ఞుడైన సిన్నర్‌దే పైచేయి అయింది. నూనో బెర్జెస్‌పై 7-6, 7-6, 6-4తో నెగ్గి సిన్నర్ ఊపిరిపీల్చుకున్నాడు. మూడో రౌండ్‌లో అమెరికాకు చెందిన ప్రపంచ 81వ ర్యాంకర్ జెన్సన్ బ్రూక్స్‌బైతో తలపడతాడు.

**మహిళల సింగిల్స్‌లో సంచలనం**

కాగా పారిస్‌లో తన తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గి భారీ ఆశలతో వింబుల్డన్ బరిలో దిగిన మిర్రా అండ్రీవా తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. ఈ రష్యా టీనేజర్ అండ్రీవాపై 4-6, 7-5, 6-4తో 30 ఏళ్ల చెకొస్లోవేకియా క్రీడాకారిణి బార్బొరా క్రెజిస్కి గెలుపొందింది. తొలి సెట్ నెగ్గి ఊపుమీద కనిపించిన అండ్రీవా.. రెండో సెట్‌లోనూ మ్యాచ్ పాయింట్ వరకు వచ్చి ఆ తర్వాత చేతులెత్తేసింది.

ఇక మహిళల వరల్డ్ నెంబర్ వన్ సబలెంకా, జపాన్‌కు చెందిన ఏడో సీడ్ నయోమి ఒసాకా, నాలుగో సీడ్ కొకా గాఫ్ విజయాలతో వింబుల్డన్‌లో ముందంజ వేశారు.





# శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్ : షెడ్యూల్ రిలీజ్

**కొలంబో, జులై 2:** ఇంగ్లండ్‌తో టీ20, వన్డేల సిరీస్ తర్వాత టీమిండియా...శ్రీలంకలో పర్యటించనుంది. భారత్‌తో జరిగే రెండు టెస్ట్‌ల సిరీస్ షెడ్యూల్‌ను శ్రీలంక క్రికెట్ బోర్డు ప్రకటించింది. ఈ సిరీస్‌లోని మొదటి టెస్టు మ్యాచ్ ఆగస్టు 15 నుండి 19 వరకు గాలే ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరగనుంది. రెండో టెస్టు మ్యాచ్ ఆగస్టు 23 నుండి 27వరకు కొలంబోలోని సింహాలీస్ స్పోర్ట్స్ క్లబ్ ఆతిథ్యమివ్వనుంది. ఈ రెండు మ్యాచ్‌ల సిరీస్ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో భాగంగా జరగనుంది. శ్రీలంకతో సిరీస్ టీమిండియాకు చాలా కీలకం. ఇప్పటి వరకు తొమ్మిది టెస్టులు ఆడగా, కేవలం నాలుగింటిలో మాత్రమే విజయం సాధించి పాయింట్ల పట్టికలో 5వ స్థానంలో నిలిచింది. డబ్ల్యూటీసీ ఫైనల్ ఆశలను గిల్ సేన సజీవంగా ఉంచుకోవాలంటే శ్రీలంక గడ్డపై ఖచ్చితంగా గెలవాల్సిందే. శ్రీలంక జట్టు గత కొంత కాలంగా సొంత గడ్డపై అద్భుత విజయాలతో దూసుకు



పోతోంది.కాగా 2017 తర్వాత టెస్టుల కోసం శ్రీలంక పర్యటనకు టీమిండియా వెళ్లనుండటం తొలిసారి కానుంది. అప్పట్లో విరాట్ కోహ్లీ సారథ్యంలో భారత్ 3-0తో సిరీస్‌ను కైవసం చేసుకుంది.

# ప్రజ్ఞానంద గెలుపు బోణీ, గుకేష్ డ్రా



**జాగ్రెబ్(క్రొయేషియా). జులై 2:** నార్వే చెస్ టోర్నీ ఛాంపియన్ ప్రజ్ఞానంద జోరు కొనసాగుతోంది. క్రొయేషియా రాజధాని జాగ్రెబ్‌లో జరుగుతున్న చెస్ టోర్నీ ర్యాపిండ్ విభాగంలో ప్రజ్ఞానంద తొలిగేమ్‌లో జర్మనీ గ్రాండ్ మాస్టర్ విన్సెంట్ కీమర్‌పై గెలుపొంది శుభారంభం చేశాడు. కీమర్‌పై దూకుడుగా ఆడిన ప్రజ్ఞానంద, ప్రత్యర్థి రాజుపైకి తన పావులతో దాడిని సాగించి, కేవలం 26 ఎత్తులలోనే పూర్తి 2 పాయింట్లను సాధించాడు. మాగ్జిమి లాగ్రెవ్‌తో జరిగిన రెండో గేమ్‌ను డ్రాగా ముగించాడు. ఇక ప్రపంచ ఛాంపియన్ గుకేష్ ప్రారంభం మాత్రం నిరాశతో మొదలైంది. ఇవాన్ సరిక్‌తో గేమ్‌ను గుకేష్ డ్రాతో సరిపెట్టాడు. ఫ్రాన్స్ సంచలనం అలిరెజా ఫిరౌజా రెండు గేమ్‌ల్లో గెలుపు, ఓ గేమ్ డ్రాతో అయిదు పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

## రెండోరోజూ లాభాల్లోనే ముగిసిన స్టాక్ మార్కెట్లు

# గ్లోబల్ సానుకూలతలే సెన్సెక్స్, నిఫ్టీలకు దన్ను






**ముంబయి, జులై 2:** భారత స్టాక్ మార్కెట్ గురువారం భారీ లాభాల్లో ముగిశాయి. వరుసగా రెండోరోజు మార్కెట్ లాభాల్లో ముగియడం విశేషం. సెన్సెక్స్ 579 పాయింట్లు, నిఫ్టీ 169 పాయింట్లు లాభపడ్డాయి. ఉదయం 9.15 గంటలకు ట్రేడింగ్ లాభాల్లో ప్రారంభమైంది.బీఎస్ఈ సెన్సెక్స్ 200 పాయింట్లకు పైగా లాభంతో 77,100 వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 70 పాయింట్ల లాభంతో 24,100 వద్ద ప్రారంభమైంది. చివరకు ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 579 పాయింట్లు లాభంతో 77,502 వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 169 పాయింట్ల లాభంతో 24,175 వద్ద ముగిసింది.

పశ్చిమాసియా యుద్ధం నివారణ, అంతర్జాతీయంగా సానుకూల పరిస్థితులు, చమురు ధరలు తగ్గడం, ఇరాన్, అమెరికా శాంతి చర్చలు వంటివి మార్కెట్‌కు కలిసొచ్చాయి. అదే విధంగా ఐటీషేర్లలో కొనుగోళ్లకు మద్దతు లభించడంతో మార్కెట్ మరింత లాభపడింది. సెన్సెక్స్ 30 సూచీలో టీసీఎస్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌సీఎల్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్ షేర్లు లాభాల్లో ముగిశాయి. మారుతి, ఎల్అండ్‌టి, యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్, కోటక్ బ్యాంక్, బీఈఎల్ షేర్లు నష్టపోయాయి.ఇతర ఆసియా మార్కెట్లు నష్టాల్లోనే ముగిశాయి. దక్షిణ కొరియా కోస్పి ఐదు శాతం నష్టపోయింది. జపాన్ నిక్కీ కూడా నష్టాలతోనే ముగిసింది. అమెరికా మార్కెట్లు కూడా నష్టాల బాటలోనే సాగాయి.

అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధర భారీగా తగ్గింది. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 71 డాలర్లుగా ఉంది. డబ్ల్యూటీఐ బ్యారెల్ క్రూడాయిల్ ధర 68 డాలర్లుగా ఉంది. గత మార్చి తర్వాత ఈ స్థాయిలో ధరలు తగ్గడం ఇదే మొదటిసారి. బంగారం, వెండి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ఔన్స్ బంగారం ధర 4,063 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. డాలర్‌తో రూపాయి విలువ 95.40 వద్ద కొనసాగుతోంది. బిఎస్ఇలో 2536 షేర్లు లాభాల్లో కొనసాగితే 1740 షేర్లు క్షీణించి 191 షేర్లు స్థిరంగా కొనసాగాయి. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఆగస్టు 5 నాటిధరలు రూ.1,44,488గా కొనసాగాయి.

# ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటీకరణకు కేంద్రం మరో అడుగు

**న్యూఢిల్లీ, జులై 2:** ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ప్రక్రియలో కీలకమైన ఐడీబీఐ బ్యాంకు విక్రయ ప్రక్రియకు కేంద్ర ప్రభుత్వం మరోసారి వేగం పెంచింది. వ్యూహాత్మక విక్రయ ప్రక్రియను పునరుద్ధరించే క్రమంలో ఇప్పటికే షార్ట్‌లిస్ట్ చేసిన బిడ్డర్ల నుంచి తాజా ఆర్థిక బిడ్లను ఆహ్వానించినట్లు సమాచారం.వచ్చే ఆర్థిక సంవత్సరం 2026-27లోనే ఈ వాటాల విక్రయాన్ని పూర్తి చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లావాదేవీ ద్వారా సుమారు రూ.50 వేల కోట్ల నుంచి రూ.55 వేల కోట్ల వరకు ఆదాయం సమీకరించాలని ప్రభుత్వం భావిస్తున్నది.గతంలో వచ్చిన ఆర్థిక బిడ్లు ప్రభుత్వం నిర్ణయించిన కనీస విలువ కంటే తక్కువగా ఉండటంతో విక్రయ ప్రక్రియ ఆశించిన విధంగా ముందుకు సాగలేదు. అయితే కొత్తగా బిడ్లను ఆహ్వానించకుండా, ఇప్పటికే షార్ట్‌లిస్ట్ చేసిన సంస్థలకే తమ ఆర్థిక ప్రతిపాదనలను సవరించి మళ్లీ సమర్పించాల్సిందిగా కేంద్రం సూచించింది. ఈ వ్యూహాత్మక విక్రయంలో కేంద్ర ప్రభుత్వంతో పాటు ఎల్ఐసీకి చెందిన ఐడీబీఐబ్యాంకు యాజమాన్య నియంత్రణను కూడా బదిలీ చేయనున్నారు.





## ఆయిల్ కంపెనీలకు రూ.74,781 కోట్ల నష్టం

# పెట్రోడీజిల్ ధరల తగ్గింపుపై కేంద్ర మంత్రి హర్దీప్

**న్యూఢిల్లీ, జులై 2:** పశ్చిమాసియా సంక్షోభం కారణంగా గ్లోబల్ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరిగినా దేశీయంగా ధరలను పెంచకుండా ఉంచడం వల్ల ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు గతనెలాఖరుకు రూ.74,781 కోట్ల నష్టాన్ని చవిచూసినట్లు కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ తెలిపారు.అంతర్జాతీయంగా చమురు ధరలు పడిపోయినప్పటికీ పాత క్రూడాయిల్‌నే ఇప్పటికీ ప్రాసెస్ చేస్తున్నాయని, ధరలు తగ్గకపోవడానికి ఇదే కారణమని చెప్పారు.గురువారం విలేకరులతో మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ధరలపై వివరాలు వెల్లడించారు. పెట్రో ఉత్పత్తులను ప్రాసెసే చేసేందుకు 2 నెలల ముందే క్రూడ్ ఆయిల్‌ను చమురు మార్కెటింగ్ కంపెనీలు కొనుగోలు చేస్తాయి. 2నెలల ముందు నుంచి ఈ ప్రక్రియ మొదలవుతుంది. అంటే ఇప్పుడు ప్రాసెస్ చేస్తున్న ఆయిల్ ఏప్రిల్ లేదా మే నెలలో కొన్నది. అప్పట్లో గ్లోబల్ మార్కెట్ ధరలు అధికంగా ఉన్నాయి. అమెరికా ఇరాన్ మధ్య ఒప్పందం కుదిరాక ఆయిల్ ధరలు దిగివచ్చాయి. రాబోయే





కొన్ని వారాల పాటు అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తక్కువగా ఉన్నప్పుడు ధరలు తగ్గించరా అని అడగడం సమంజసమైన ప్రశ్న అవుతుందంటూ దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు ఎప్పుడు తగ్గిస్తారు అని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం గ్లోబల్ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 71.47 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఏప్రిల్ 29వ తేదీన బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 118 డాలర్ల గరిష్ఠ స్థాయిని తాకింది. దీంతో భారత్ భారీగా విదేశీ మారకం నిల్వలను వెచ్చించాల్సి వచ్చింది. దీంతో దేశీయంగా లీటర్ పెట్రోల్ ధరను రూ.7.50 మేర పెంచాల్సి వచ్చింది.


# బ్యాంకింగ్ రంగానికి అతిపెద్ద ముప్పు ఎఐ





**న్యూఢిల్లీ, జులై 2:** :దేశ ఆర్థిక వ్యవస్థకు సంప్రదాయముప్పులైన ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్ల కంటే వేగంగా విస్తరిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(కృత్రిమ మేధ) సాంకేతికతే అత్యంత ప్రమాదకరంగా మారిందని భారతీయ రిజర్వ్ బ్యాంక్ హెచ్చరించింది. ఆర్‌బీఐ విడుదల చేసిన జూన్ 2026నాటి ఆర్థిక స్థిరత్వ నివేదికలో ఈ కీలక అంశాలను వెల్లడించింది. ఆర్థిక రంగంలో ఏఐ ప్రవేశంవల్ల పనితీరు మెరుగైనప్పటికీ, అదే స్థాయిలో వ్యవస్థ భద్రతకు ఇది ఒక పెద్ద సవాలుగా పరిణమించిందనిఆర్‌బీఐ ఆందోళన వ్యక్తంచేసింది. దేశంలోని ప్రముఖ బ్యాంకులు, ఆర్థిక సంస్థల అభిప్రాయాల ప్రకారం రాబోయే 12 నెలల్లో సంభవించే సైబర్ ముప్పులలో ఏఐ ఆధారిత సైబర్ దాడులే అత్యంత ప్రమాదకరమైనవిగా మొదటి స్థానంలో నిలిచాయి. హ్యాకింగ్, రాన్సమ్‌వేర్, ఫిషింగ్ దాడుల కంటే ఏఐ సాయంతో సైబర్ నేరగాళ్లు చేసే దాడులు అత్యంత వేగంగా, సమర్థంగా, ఊహించని స్థాయిలో వ్యవస్థలను అతలాకుతలం చేసేలా ఉంటాయని నివేదిక స్పష్టం చేసింది.

ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా కలకలం సృష్టించిన మైథోస్‌రాన్సమ్‌వేర్ దాడి ఇందుకు నిదర్శనమని పేర్కొంది. సైబర్ దాడులతో పాటు ఆర్‌బీఐ ఈ నివేదికలో మరికొన్ని ముఖ్యమైన లోపాలను ఎత్తిచూపింది. మెజారిటీ బ్యాంకులు కేవలం కొన్ని క్లౌడ్ ప్లాట్‌ఫారమ్‌లు లేదా ఏఐ టెక్నాలజీ ప్రొవైడర్లపైనే ఎక్కువగా ఆధారపడుతున్నాయి. అంతర్జాతీయ నియంత్రణ సంస్థల తరహాలోనే ఆర్‌బీఐ కూడా త్వరలోనే అత్యంత కఠినమైన ఏఐ గవర్నెన్స్ నియమాలను, సరికొత్త ఫైనాన్షియల్ సెక్టార్ సైబర్ సెక్యూరిటీ ప్రణాళికలకోసం రిజర్వ్ బ్యాంక్ కసరత్తులు చేస్తోంది.



# ఒక్కనెలలోనే రూ.49,340 కోట్లు ఎఫ్‌పిఐలు వెనక్కి!

**న్యూఢిల్లీ, జులై 2:** భారతీయ ఈక్విటీ మార్కెట్‌లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల అమ్మకాల ఒత్తిడి గత నెలలో కూడా కొనసాగింది. ఎఫ్‌పిఐలు రూ.49,340 కోట్లు (సుమారు 5.16 బిలియన్ డాలర్లు) విలువైన షేర్లను విక్రయించి మార్కెట్ నుంచి తమ షేర్లు విత్‌డ్రా చేసారు. నెల ప్రారంభంలో ప్రపంచ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, అభివృద్ధి చెందిన దేశాల మార్కెట్లపై పెట్టుబడిదారుల మొగ్గు, అమెరికా బాండ్ యీల్డ్‌ల పెరుగుదల, భారతీయ మార్కెట్‌లో అధిక విలువలు ఈ విక్రయాలకు ప్రధాన కారణాలుగా నిలిచాయి.

సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ (ఇండియా) లిమిటెడ్ (సీడీఎస్ఎల్) గణాంకాల ప్రకారం, 2026లో ఇప్పటివరకు విదేశీ పెట్టుబడిదారులు భారత ఈక్విటీల నుంచి మొత్తం రూ.2.7 లక్షల కోట్లను వెనక్కి తీసుకున్నారు. ఇది 2025 మొత్తం ఏడాదిలో ఉపసంహరించుకున్న రూ.1.66 లక్షల కోట్ల కంటే ఎక్కువ.ఈ ఏడాదిలో ఫిబ్రవరి మినహా ప్రతి నెలలోనూ ఎఫ్‌పీఐలు నికర విక్రేతలుగానే వ్యవహరించారు. జనవరిలో రూ.35,962 కోట్లు ఉపసంహరించుకున్న ఎఫ్‌పిఐలు, ఫిబ్రవరిలో మాత్రం 22,615కోట్ల పెట్టుబడులు పెట్టారు. ఇది గత 17 నెలల్లో నమోదైన అత్యధిక నెలవారీ పెట్టుబడిగా నిలిచింది.మళ్లీ మార్చిలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఆ నెలలోనే రికార్డు స్థాయిలో రూ.1.17లక్షల కోట్లను విదేశీ ఇన్వెస్టర్లు వెనక్కి తీసుకున్నారు. ఏప్రిల్‌లో రూ.60,847 కోట్లు, మేలో రూ.32,963 కోట్లు, జూన్‌లో రూ.49,340కోట్ల నికర విత్‌డ్రాలు రికార్డయ్యాయి. జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వి.కె. విజయకుమార్ మాట్లాడుతూ, డాలర్‌తో పోలిస్తే రూపాయి స్థిరపడటం,కొంత బలపడటం, అలాగే దక్షిణ కొరియా, తైవాన్ మార్కెట్లలో అధిక ఒడిదుడుకుల నేపథ్యంలో విదేశీ ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం వల్ల ఎఫ్‌పీఐల విక్రయాల తీవ్రత కొంత తగ్గిందని పేర్కొన్నారు. విదేశీ పెట్టుబడులు దేశ కరెంట్ అకౌంట్ లోటును భర్తీ చేయడంలో, చెల్లింపుల సమతుల్యతను నిలబెట్టడంలో కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో, విదేశీ మూలధనాన్ని ఆకర్షించేందుకు కేంద్ర ప్రభుత్వం, భారతీయ రిజర్వ్ బ్యాంక్ జూన్‌లో పలు చర్యలను ప్రకటించాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

# ఏరువాక సాగుతుండగా... చుట్టూ పైరుగాలి వీస్తుండగా... !!!

## పశ్చిమ డెల్టా లో ముమ్మరంగా సార్వా పనులు
## ఖరీఫ్ నాట్లు వేసేందుకు సర్వత్ర సన్నద్ధం



**ఉండి, జూలై 2 ప్రభాత వార్త** పశ్చిమ డెల్టాలో సార్వా పనులు ఊపొందుకున్నాయి. డెల్టా వ్యాప్తంగా అన్ని గ్రామాలలోనూ రైతులు ఇప్పటికే నారుమళ్లను సిద్ధం చేసుకున్నారు. నాట్లు వేసేందుకు వీలుగా పొలాలను దమ్ము చేసుకుంటున్నారు. ఈ ఏడాది జూన్ 1వ తేదీ నాటికి పశ్చిమ డైరెక్టర్ కు సాగునీటిని విడుదల చేసినప్పటికీ జూన్ 20వ తేదీ వరకు పూర్తిస్థాయిలో సాగునీటి సరఫరా జరగలేదు. మొదటిగా గ్రామాలలో అడుగంటిన మంచినీటి చెరువులకు త్రాగునీరు నింపుకునేందుకు వీలుగా అధికారులు కాలువలకు నీటిని విడుదల చేశారు. తరువాత కాలంలో శివారు ప్రాంతాలకు సైతం చేరే విధంగా కాలువలకు నీటి లెవెల్ ను పెంచారు. దీంతో గ్రామాలలోని రైతులు నారుమలను సిద్ధం చేసుకున్నారు. తొలకరి ఆరంభ దశలో వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ కాలువల ద్వారా సరఫరా అయిన నీటితో నారుమలను సిద్ధం చేసుకుని అన్నదాతలు విత్తనాలు చల్లుకున్నారు. ప్రస్తుతం పంట పొలాలకు సాగునీటితో నింపి దమ్ము ప్రక్రియను పూర్తి చేస్తున్నారు. ఇప్పటికే అనేక గ్రామాలలో నాట్లు వేసేందుకు రైతులు ఏర్పాట్లను పూర్తి చేసుకున్నారు. సకాలంలో నాట్లు ప్రక్రియ పూర్తయితే నవంబర్ నెల ఆఖరినాటికే ఖరీఫ్ కోతలను ప్రారంభించవచ్చని రైతులు చెబుతున్నారు. ఫలితంగా కోతలు మాసూళ్లు పనులకు అవరోధం జరగకుండా ఖరీఫ్ ని గట్టు ఎక్కించవచ్చని వారు అభిప్రాయపడుతున్నారు. అనేకచోట్ల కాంప్లెక్స్ ఎరువులు కొరత ఉన్నందున రైతులు ఆందోళన చెందుతున్నారు. సకాలంలో రైతులకు కాంప్లెక్స్ ఎరువులను అందుబాటులో ఉంచితే విజయవంతంగా ఖరీఫ్ సాగు జరపవచ్చని వారు వివరిస్తున్నారు. కావున దీనిపై అధికారులు, పాలకులు తగు చర్యలు తీసుకోవాలని రైతుల విజ్ఞప్తి చేస్తున్నారు.



# పొంగుటూరు రైతుల సమస్య పరిష్కారం..

## ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్థులు.



**ఏలూరు, జూలై 02 ( ప్రభాత వార్త)** ప్రజలకు సంబంధించి ఏదైనా సమస్య తన దృష్టికి వస్తే అది పరిష్కరించే వరకూ వదలకుండా పనిచేసే నేతగా జిల్లాలో ఇప్పటికే పేరు తెచ్చుకున్నారు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. తాజాగా మరోమారు పోలవరం నియోజకవర్గం లోని పొంగుటూరు గ్రామ రైతుల రహదారి సమస్యను ఇదే విధంగా 15 రోజుల్లో పరిష్కరించారు. విషయానికి వస్తే కొయ్యలగూడెం మండలం పొంగుటూరు గ్రామం మీదుగా వెళ్లిన నేషనల్ హైవే రోడ్డు నిర్మాణం తర్వాత గ్రామంలో దాదాపు 400 ఎకరాల రైతులు తమ పొలాల్లోకి వెళ్ళటానికి రహదారి లేని పరిస్థితి ఏర్పడింది. ఇందులో 200 ఎకరాలు వర్షపు నీరు పోయే దారి లేక ముంపునకు కూడా గురవుతున్నాయి. రైతులు రహదారి కాంట్రాక్టరును అనేకసార్లు కలిసి తమ ఇబ్బంది చెప్పినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. దీనితో ఈ విషయాన్ని కొడవటి రామకృష్ణ నేతృత్వంలో గ్రామ రైతులు కొద్ది రోజుల కింద ఎంపీ పుట్టా మహేష్ కుమార్ దృష్టికి తీసుకు వెళ్ళారు. రైతుల ఇబ్బందిని అర్థం చేసుకున్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెంటనే స్పందిస్తూ.. అక్కడ రైతులు తమ పొలంలోకి వెళ్ళటానికి రోడ్ మరియు తూరలు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. చెప్పినట్లుగానే కేవలం 15 రోజుల్లో తూరలు ఏర్పాటు చేసి రైతులు ఎటువంటి ఇబ్బంది లేకుండా తమ పొలాల్లోకి వెళ్లేందుకు రహదారి మార్గం ఏర్పాటు చేయించటం జరిగింది. దీనితో తమ సమస్య పరిష్కారం కోసం కృషి చేసి, స్వల్ప వ్యవధిలోనే తమ పొలాలకు మార్గం ఏర్పాటు చేయించిన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు పొంగుటూరు రైతులు , ప్రజలు కృతజ్ఞతలు తెలియచేశారు.

పశ్చిమగోదావరి,ఏలూరు
వార్త

# సహకార సంఘాల ఆధునీకరణకు మరో ముందడుగు

## --జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం జూలై 2 ప్రభాతవార్త** జిల్లాలోని ప్రాథమిక సహకార సంఘాల పనితీరును మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేపడుతున్న కంప్యూటరీకరణ కార్యక్రమంలో భాగంగా హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ మాడ్యూల్‌ను అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ విధానం ద్వారా ప్రాథమిక సహకార సంఘాల సిబ్బందికి జీతభత్యాలను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. గురువారం భీమవరం కలెక్టరేట్ వశిష్ఠ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రాథమిక సహకార సంఘాల కంప్యూటరీకరణ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. సిబ్బంది సేవల నిర్వహణను పూర్తిగా డిజిటల్ విధానంలోకి తీసుకురావడానికి హెచ్‌ఆర్‌ఎమ్‌ఎస్ మాడ్యూల్‌ను అధికారికంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 122 ప్రాథమిక సహకార సంఘాలు ఉండగా, వాటిలో 329 మంది రెగ్యులర్ సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు 256 మంది ఉద్యోగుల సేవా వివరాలను హెచ్‌ఆర్‌ఎమ్‌ఎస్‌లో డేటా ఎంట్రీ పూర్తి చేశామని, వీరి జీతభత్యాలను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానం అమల్లోకి తీసుకువచ్చామని చెప్పారు. ఇప్పటికే 57 మంది ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఎమ్‌ఎస్ ద్వారా శాలరీ స్లిప్‌లు రూపొందించగా, నాలుగు సహకార సంఘాలు ప్రస్తుతం పూల్ అకౌంట్ ద్వారా జీతాల చెల్లింపులు నిర్వహిస్తున్నాయని తెలిపారు. మిగిలిన ఉద్యోగుల వివరాలను కూడా హెచ్‌ఆర్‌ఎమ్‌ఎస్‌లో నమోదు చేసి, అవసరమైన ఆమోద ప్రక్రియ పూర్తయిన అనంతరం అందరికీ పూల్ అకౌంట్ ద్వారా జీతభత్యాలు చెల్లించే విధానాన్ని అమలు చేస్తామని చెప్పారు. హెచ్‌ఆర్‌ఎమ్‌ఎస్ అమలు ద్వారా సిబ్బంది సేవా వివరాల నిర్వహణ, జీతభత్యాల చెల్లింపులు, శాలరీ స్లిప్‌ల జారీ వంటి ప్రక్రియలు పూర్తిగా పారదర్శకంగా, వేగవంతంగా జరుగుతాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. దీంతో పరిపాలనలో జవాబుదారీతనం పెరగడంతో పాటు సిబ్బందికి మెరుగైన సేవలు అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలు, మత్స్యకార సహకార సంఘాలు తదితర సహకార సంస్థలను ఆధునీకరించడం, వాటిని ఆర్థికంగా బలోపేతం చేయడం, డిజిటల్ సేవలను విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావడమే జిల్లా సహకార అభివృద్ధి కమిటీ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి ఎస్.మురళీకృష్ణ, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ జడ్.వెంకటేశ్వరరావు, జిల్లా పౌర సరఫరా అధికారి ఎన్. మీసరోజ, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ డి.శ్రీనివాస్, పశుసంవర్ధక శాఖ అధికారి కోటిలింగం, డైరీ డెవలప్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్, డీసీసీబీ జనరల్ మేనేజర్ మాధవి, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

## కార్యకర్తల సంక్షేమానికి పెద్ద పీట వేసిన కూటమి - జోన్ కోఆర్డినేటర్, తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ

## ఎచ్చర్ల నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం

**తణుకు, జులై 2(ప్రభాత వార్త):** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు తెలుగుదేశం పార్టీ శ్రేణులంతా సిద్ధం కావాలని జోన్--1 కోఆర్డినేటర్, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం విజయనగరం పార్లమెంటు పరిధిలోని ఎచ్చెర్ల నియోజకవర్గ విస్తృతశ్రీస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలుపొందడానికి, కూటమి జెండా ఎగరవేయడానికి ప్రతి ఒక్కరు కషి చేయాలని కోరారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికి చెందుతుందని అన్నారు. లోకేష్ యువగళం పాదయాత్ర ద్వారా దాదాపు 3400 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేసి ఆనాడు రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సమస్యలను పరిగణనలోకి తీసుకుని స్పష్టమైన హామీ ఇచ్చి ఆ హామీలను నెరవేర్చుతూ ప్రతి ఒక్కరికి అభివృద్ధి, సంక్షేమాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. లోకేష్ నాయకత్వంలో 1.05 కోట్ల మంది కార్యకర్తల కుటుంబంగా ఎదిగింది అంటే ఆయన చేసిన సంస్కరణలు ఫలితమే అని అన్నారు. కార్యకర్తల్లో సాంకేతికతను అందుబాటులోకి తీసుకువచ్చి నాయకులతో సంబంధం లేకుండా కార్యకర్తే అధినేతగా గుర్తించి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వారికి గుర్తింపు ఇస్తున్నారని చెప్పారు. చదువుకున్న యువతకు రాజకీయాల్లో అవకాశం కల్పించి మంత్రులుగా చేసిన ఘనత ఆనాడు తెలుగుదేశం పార్టీదే అని గుర్తు చేశారు. అనేక సంస్కరణలకు నాంది పలికిన నందమూరి తారక రామారావు రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ



పథకాలకు ఆజ్యం పోసారని చెప్పారు. తదనంతర కాలంలో తెలుగుదేశం పార్టీను క్షేత్రస్థాయిలో బలోపేతం చేసి సంస్థాగత నిర్మాణం చేసిన చంద్రబాబునాయుడు తెలుగుదేశం పార్టీకు కోటగా కార్యకర్తలను అనుసంధానం చేసిన ఘనత ఆయనకే చెందుతుందని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పార్లమెంటు అధ్యక్షుడు కిమిడి నాగార్జున, ఎచ్చర్ల నియోజవర్గ పరిశీలకులు వజ్జ బాబురావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చౌదరి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.




# నినాదం కాదు విధానంగా మారాలి

**తణుకు, జులై 2(ప్రభాత వార్త):** డెంగీ నివారణ నినాదానికి పరిమితం కాకుండా, విధానంగా మారాలని తణుకు సబ్ యూనిట్ వైద్యాధికారులు డాక్టర్ రాజా నాగభూషణం, జి.వెంకటేశ్వరరావులు కోరారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం తణుకులోని కొమ్మాయి చెరువు గట్టు ప్రాంతంలో అవగాహన నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉంటే తక్షణమే వాటిని తొలగించి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. దోమలు పుట్టుకకు చెక్ పెట్టే ఖర్చు రహిత ఫ్రైడే డ్రైడేను ప్రతి రోజూ పాటించాలన్నారు. జ్వరం వచ్చినప్పుడు వైద్యులను సంప్రదించాలని సొంత వైద్యం చేసుకోవదన్నారు. కార్యక్రమంలో ఫైలేరియా కంట్రోల్ యూనిట్ సూపర్‌వైజర్ కె.సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్స్ వి.కిశోర్, ఎస్.తాతాజీ, స్వర్ణ వార్డ్ హెల్త్ సెక్రెటరీలు, ఏఎస్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిపోయిన డిప్యూటీ తహశీల్దార్



**జంగారెడ్డిగూడెం జులై 2 ప్రభాత వార్త** కోర్టు తీర్పు కాపీని ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసిన జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కార్యాలయ డిప్యూటీ తహశీల్దార్ పి. వెంకటేశ్వరరావును ఏసీబీ అధికారులు గురువారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.
?బాధితుడు పోతన సుకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం టెక్కినవారిగూడెం గ్రామానికి చెందిన సుకుమార్ తండ్రికి, నిమ్మలగూడెం రెవెన్యూ పరిధిలోని ఒక ఎకరం 7 సెంట్లు భూమి వారసత్వంగా సంక్రమించింది. ఈ భూమికి సంబంధించి గతంలో ఎంఆర్ఓ మ్యుటేషన్ కూడా పూర్తి చేశారు. అయితే కుటుంబ తగాదాల కారణంగా సుకుమార్ మేనత్త కుటుంబం ఈమ్యుటేషన్‌ను రద్దు చేయాలంటూ ఆర్డీఓ కోర్టులో దరఖాస్తు చేసింది. ఈ ఏడాది జనవరిలో సుకుమార్ తండ్రి మరణించడంతో, లీగల్ హెయిర్ సర్టిఫికెట్ పొందిన సుకుమార్ స్వయంగా ఆర్డీఓ కోర్టు విచారణకు హాజరవుతున్నారు. ?ఈ కేసు విచారణ ముగిసిన అనంతరం, దానికి సంబంధించిన తీర్పు కాపీని ఇచ్చేందుకు జంగారెడ్డిగూడెం



ఆర్డీఓ ఆఫీసులో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న డిప్యూటీ తహశీల్దార్ పి. వెంకటేశ్వరరావు 50000 లంచం డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని సుకుమార్ ఏలూరు ఏసీబీ డీఎస్పీని ఆశ్రయించారు. ఏసీబీ అధికారుల వ్యూహం ప్రకారం.. గురువారం బాధితుడు సుకుమార్ నుండి డిప్యూటీ తహశీల్దార్ వెంకటేశ్వరరావు 20,000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి, నగదుతో సహా ఆయనను పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

# వికసిత భారత్ - 2047 కలను సాకరం చేయాలి

## రాష్ట్ర మంత్రి పార్థసారథి, కలెక్టర్ వెట్రిసెల్వి



**ముసునూరు, జూలై 02 ప్రభాతవార్త:** ముసునూరు లో గురువారం వికసిత భారత్--గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ) ( వి.బి- జి. ఆర్. ఏ .ఎం. జి) అమలు కార్యక్రమాన్ని మంత్రి కొలుసు పార్థసారథి, సతీమణి కమలాలక్ష్మీ , జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి కలిసి ఫీడర్ ఛానల్ పనులను గుణపంతో త్రవ్వి, భూమి పూజలు చేసి, లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం గ్రామసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ వికసిత భారత్ -2047 కలను సాకరం చేసేందుకు మహిళలు భాగస్వామ్యం అత్యంత కీలకం మని అన్నారు. రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ) పథకం పల్లెసీమలు ప్రగతికి గొప్పవరం అని, ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలు అవగాహన పెంచుకుని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా బలోపేతం కావాలని పిలుపునిచ్చారు. వికసిత్ భారత్ - గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ) అనేది మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త గ్రామీణ ఉపాధి, సంక్షేమ కార్యక్రమం అని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి అర్హత గల గ్రామీణ కుటుంబానికి సంవత్సరంలో 125 రోజులు వేతన ఉపాధికి చట్ట బద్ధమైన హామీని ఇస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో శారీరక శ్రమ చేయడానికి సిద్ధంగా ఉన్న ప్రతి కుటుంబానికి 125 రోజులు పాటు ఉపాధి కల్పిస్తారని, వ్యవసాయ పనులు సమయంలో ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వాలు ముందుస్తు ప్రకటన ద్వారా 60 రోజులు పాటు పనులను తాత్కాలికంగా నిలిపివేసే వెసులుబాటు ఉంటుందని అన్నారు. మిగిలిన 305 రోజుల్లో 125 రోజులు ఉపాధి హామీ అందుబాటులో ఉంటుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యనిధులు వాటా 60:40 నిష్పత్తిలో ఉంటుందని అన్నారు. మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించడం దీనిలో ఒక ముఖ్యమైన భాగం అని, సాంకేతికత, పారదర్శకత కోసం సోషల్ ఆడిట్‌ను, సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తున్నారని తెలిపారు. ఈ కొత్త చట్టం ద్వారా గ్రామీణ జీవనోపాధిని బలోపేతం చేయడంతో పాటు, 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే (వికసిత్ భారత్ 2047) లక్ష్యానికి అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు, ప్రజలు, గ్రామాలు ఆస్తులు సృష్టి జరుగుతుందని అన్నారు .ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు, ప్రజలకు అందుతున్న సేవలు, గ్రామీణాభివృద్ధి లక్ష్యాలుపై ప్రజలకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం, ప్రభుత్వ పథకాలు సద్వినియోగం, సమగ్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం చేపడుతున్న చర్యలను విపులంగా వివరించారు. గ్రామీణ మహిళలు, యువత స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని సూచించారు. అర్హత ఉండి అడిగిన వారందరికీ జాబు కార్డులు, పనిదినాలు కల్పిస్తామని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ఉపాధి, జీవనోపాధి పథకాల ద్వారా లబ్ధిదారులు ఆదాయాన్ని పెంచుకోవాలని అన్నారు. స్వయం సహాయక సంఘాలు సభ్యులకు అందుబాటులో ఉన్న శిక్షణా కార్యక్రమాలు, రుణ సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి అవకాశాలను పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. గ్రామీణ కుటుంబాలు అభివృద్ధికి రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ కీలక వేదికగా నిలుస్తుందని తెలిపారు. గ్రామాల్లో పాఠశాలలు, అంగన్వాడి సెంటర్లు, సోలార్ ప్లాంట్లు కూడా ఏర్పాటు చేసుకునే



వెసులుబాటు ఈ కార్యక్రమంలో ఉందని తెలిపారు.కార్యక్రమంలో సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, అసిస్టెంటు కలెక్టరు సి.హెచ్. శ్రావణ్ కుమార్ రెడ్డి, డ్వామా పిడి కె.వెంకట సుబ్బారావు, జిల్లా ఉద్యానవన శాఖ కె.షాజా నాయక్, అడిషనల్ పిడి యం.రాజశేఖర్, డిఎల్డివో, అసిస్టెంటు పిడి పి.శ్రీనివాస రావు, వివిధ శాఖలు అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, రైతులు మహిళా రైతులు, కౌలు రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారే లక్ష్యం

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**తాడేపల్లిగూడెం జులై 2 (ప్రభాతవార్త)** జిల్లాలో ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని వేగవంతంగా, పారదర్శకంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. తాడేపల్లిగూడెం మండలంలోని బంగారుగూడెం గ్రామంలోని ఎన్టీఆర్ నగర్‌లో విధులు నిర్వహిస్తున్న బూత్ లెవల్ అధికారుల (బీఎల్‌వోలు) పనితీరును జిల్లా కలెక్టర్ గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఎన్యుమరేషన్, ఓటర్ల ధృవీకరణ, మ్యాపింగ్, ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియలను క్షుణ్ణంగా పరిశీలించి బీఎల్‌వోలతో మాట్లాడారు. ప్రతి ఇంటికి ఎన్యుమరేషన్ ఫారాలు అందించారా, ఎంత శాతం పంపిణీ పూర్తయింది, ఓటర్ల వివరాల మ్యాపింగ్ ఎంతవరకు పూర్తయింది, కొత్త ఓటర్ల నమోదు, ఫారాల డిజిటలైజేషన్ పురోగతి ఎలా ఉందనే అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్వయంగా ఇంటింటికీ వెళ్లి ఓటర్లతో మాట్లాడారు. ప్రతి అర్హత ఓటరికి ఎన్యుమరేషన్ ఫారం అందిందా అని తెలుసుకుని, ఫారాలను పూర్తిగా నింపి వీలైనంత త్వరగా బీఎల్‌వోలకు అందజేయాలని సూచించారు. ముఖ్యంగా 2004 సంవత్సరం తరువాత జన్మించిన అర్హులైన యువత తమ తల్లిదండ్రుల వివరాలతో పాటు అవసరమైన సమాచారాన్ని





పూర్తి స్థాయిలో నమోదు చేసి సమర్పించాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, జిల్లాలో ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం వేగంగా కొనసాగుతుందని, ఇప్పటి వరకు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ 98.6 శాతం పూర్తయిందని, మిగిలిన పంపిణీని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పంపిణీతో పాటు ఫారాలను తిరిగి సేకరించి, వాటిని డిజిటలైజేషన్ చేసి ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న బీఎల్‌వోలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే రెవెన్యూ యంత్రాంగం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం స్వచ్ఛమైన, ఖచ్చితమైన, పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించడమేనని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి ఓటరును సరైన పోలింగ్ కేంద్రానికి మ్యాప్ చేయడం అత్యంత కీలకమని, మ్యాపింగ్ శాతాన్ని పెంచడంతో పాటు ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని బీఎల్‌వోలను ఆదేశించారు. ప్రజలందరూ ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములై, ఎన్యుమరేషన్ ఫారాలను సకాలంలో పూర్తి చేసి అందజేయడం ద్వారా స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీలో సహకరించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మన్నే సూర్యారావు, తహసీల్దార్ సునీల్ కుమార్, బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పచ్చని గ్రామాలే వికసిత్ భారత్ లక్ష్యం : ఎమ్మెల్యే పితాని



పెనుమంట్ర, జులై-01, (ప్రభాతవార్త) గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, ఉపాధి కల్పన, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వికసిత్ భారత్--గ్రామీణ ఉపాధి, జీవనోపాధి హామీ (వీబీ-గ్రామ్-జీ) కార్యక్రమం గ్రామాల అభివృద్ధికి బలమైన పునాది వేస్తుందని ఆచంట నియోజకవర్గ శాసనసభ్యులు, ఆంధ్రప్రదేశ్ శాసనసభ హక్కుల కమిటీ చైర్మన్, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. పెనుమంట్ర గ్రామంలోని దానమ్మతల్లి గుడి పుంత రోడ్డులో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఎమ్మెల్యే పితాని పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం వెలగలవారిపాలెం గ్రామ సచివాలయం వెనుక ఏర్పాటు చేసిన ప్లాంటేషన్ కార్యక్రమంలో కూడా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పితాని మాట్లాడుతూ, "పచ్చని గ్రామాలే వికసిత్ భారత్‌కు నిజమైన పునాది. గ్రామాల్లో చెట్ల సంఖ్య పెరిగితే వర్షపాతం పెరగడంతో పాటు భూగర్భ జలాలు పరిరక్షించబడతాయి. రాబోయే తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలి" అని అన్నారు.అంతేకాకుండా, వీబీ-గ్రామ్-జీ ద్వారా గ్రామీణ ప్రజలకు ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని, చెరువులు, కాలువలు, గ్రామ రహదారులు, పచ్చదనం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధి వేగవంతమవుతుందని పేర్కొన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో "వికసిత్ భారత్--2047" లక్ష్య సాధనలో ప్రతి గ్రామం భాగస్వామి కావాలని, గ్రామాల స్వయం సమృద్ధి, పరిశుభ్రత, హరితహారం, నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు ప్రజలంతా బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని, ప్రజల భాగస్వామ్యంతోనే ఆదర్శ గ్రామాల నిర్మాణం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బడేటి బ్రహ్మజీ, ఎంపీడీవోలు తోలేటి మూర్తి, చింతా వెంకటరెడ్డి, టీడీపీ నాయకులు చింతపల్లి రామకృష్ణ,గూడూరి మురళి, షేక్ జిన్నా, గంటా వాసు, టీడీపీ, జనసేన, బిజెపి నాయకులు,కార్యకర్తలు, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల అభివృద్ధి



చాట్రాయి, జులై 2 ప్రభాతవార్త కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్రామీణ్ వీ బీ జీరామ్ జీ పథకం ద్వారా కూలీలు ఉపాధి పొందుతూ గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చని నూజివీడు నియోజక వర్గ తెలుగు రైతు అధ్యక్షుడు మోరంపూడి శ్రీనివాస రావు అన్నారు.గురువారం చాట్రాయి మండలం, చనుబండ శివారు సూరంపాలెం గ్రామంలో కొత్తగా అమలులోకి వచ్చిన వీబీ జీ రామ్ జీ పథకాన్ని సూరన్న చెరువులో పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మోరంపూడి శ్రీనివాస రావు, నక్కా రాము, కందుల కృష్ణ, అంబుడ్స్మన్ బాజీ, నక్కా సీతారత్నంలు పాల్గొన్నారు. అనంతరం మోరంపూడి మాట్లాడుతూ ఈ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించుకోవాలని కూలీలకు సూచించారు. అంబుడ్స్ మన్ బాజీ మాట్లాడుతూ టీ ఏ, ఎఫ్ ఏ,లు ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేసి గరిష్ఠ వేతనం పొందాలని కూలీలకు ఉద్బోధించారు.మాజీ ఎంపీపీ కందుల కృష్ణ, నియోజక వర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నక్కా రాము లు మాట్లాడుతూ పథకం యొక్క ఉపయోగాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీ ఏ కృష్ణ, ఎఫ్ ఏ తాతయ్య బాబు, సీనియర్ మెట్ లు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు. అదేవిధంగా జనార్ధన వరం గ్రామంలో సాగునీటి సంఘం అధ్యక్షులు వంగల సుబ్బారావు ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. మండలంలో చీపురుగూడెం గ్రామంలో కూడా పనులు ప్రారంభించగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి రాజు, ఏపీవో లక్ష్మీ కుమారి, తెదేపా నాయకులు బొట్టు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత క్యాన్సర్ శిబిరానికి విశేష స్పందన



చాట్రాయి, జులై 2 ప్రభాతవార్త రోటరీ క్లబ్ నూజివీడు టౌన్, మరియు రోటరీ కమ్యూనిటీ సర్వీసెస్ నూజివీడు వారి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరంలో సుమారు 150 మందికి పైగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. రోటరీ క్లబ్ ప్రముఖులు బోయపాటి ముఖర్జీ, శశికాంత్, ఎం శ్రీనివాస్, మండా శ్రీనివాసరావు, యార్లగడ్డ రాజగోపాల్, పైడి అనిల్ కుమార్, శోభనాద్రి తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా వైద్య బృందం డాక్టర్ రవి సుకుమార్, డాక్టర్ శ్రీ వల్లి, డాక్టర్ సురేఖ తదితరులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ క్యాన్సర్ రాకముందే వైద్య పరీక్షలు చేయించుకుంటే మేలు అని చెప్పారు. దీనివల్ల ప్రాణహాని ఉండదని ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన పెంచుకోవాలని కోరారు. క్యాన్సర్ మహమ్మారిని తరిమి కొట్టాలంటే ముందుగా వైద్య పరీక్షలు చేయించుకోవడం అవసరమని చెప్పారు.

## సీతమ్మ చెరువు వద్ద ఉన్న ఎస్సీ కులస్తుల స్మశాన వాటికను అభివృద్ధి పరచండి.



లింగపాలెం జులై 2 (ప్రభాతవార్త )లింగపాలెం గ్రామంలో సీతమ్మ చెరువులో తరాలుగా ఉన్న ఎస్సీ కులస్తుల స్మశాన వాటికను అభివృద్ధి పరచండి మహాప్రభోమరణించిన మృతుల గౌరవాలను కాపాడాలని ఎమ్మెల్యే రోషన్ కుమార్ గారికి మొరలింగపాలెం మండలంలోని సీతమ్మ చెరువు సుందరీకరణ పనులలో భాగంగా గౌరవ ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ నేతృత్వంలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి లింగపాలెం మండలం సంధిపం గూడెం, గ్రామస్తుల మైన మేము మా పూర్వీకుల దగ్గర నుండి ఎవరైనా చనిపోతే పాతిపెట్టడానికి సీతమ్మ చెరువులో దహన సంస్కారాల నిమిత్తం పాడిని మోసుకొని వస్తాము ఇప్పుడు ఆ చెరువు సుందరీకరణ పనులు నిమిత్తం చెరువులోఉన్న మట్టిని కట్ట అభివృద్ధి కొరకు వినియోగించడం వల్ల నీరు అధికంగా ఉండటం చేత స్మశానానికి వెళ్లే పరిస్థితి లేదని ఎమ్మెల్యే గారికి విన్నవించుకుంటున్నాము సీతమ్మ చెరువులో ఉన్న స్మశాన వాటికకు నిధులు మంజూరు చేయించి స్మశాన వాటికను మెరక, త్రాగునీటి బోరు, షెడ్డును, స్మశానానికి రావడానికి దారి కూడా లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు గౌరవ ఎమ్మెల్యే రోషన్ కుమార్ గారికి సందిపాము గూడెం గ్రామస్తులుము వేడుకొంటున్నాము

## ఘనంగా ప్రారంభమైన "వికసిత్ భారత్--జి రాం జి గ్రామీణ్" పనులు



మొగల్తూరు, జులై 2 (ప్రభాతవార్త): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న "వికసిత్ భారత్--గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ గ్రామీణ్ (వి.బి--జి రాం జి)" కార్యక్రమాన్ని బుధవారం మొగల్తూరు మండలంలో ఘనంగా ప్రారంభించారు. గ్రామీణ ఉపాధి, జీవనోపాధి అవకాశాల విస్తరణ లక్ష్యంగా తీసుకొచ్చిన ఈ కార్యక్రమాన్ని మండలంలోని 17 గ్రామపంచాయతీల్లో ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి ఆదేశాల మేరకు ప్రారంభించారు. మొగల్తూరు మండల అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ జవాజీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమానికి శ్రీకారం చుట్టగా, గ్రామాల్లో మొక్కలు నాటి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కొత్త నోటిఫికేషన్ ద్వారా పనిదినాలను 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచిందని తెలిపారు. అలాగే ఉపాధి హామీ కూలీల రోజువారీ వేతనాలను రూ.307 నుంచి గరిష్ఠంగా రూ.312 వరకు పెంచినట్లు చెప్పారు. ఈ మార్పులతో గ్రామీణ కార్మికులకు మరింత ఉపాధి, ఆదాయం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. మొగల్తూరు గ్రామంలో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి సీహెచ్ త్రిశూలపాణి, గ్రామ అభివృద్ధి అధికారి బొండాడ పరమానందరావు, స్వర్ణ గ్రామ అభివృద్ధి అధికారులు, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొని మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ పథకం గ్రామీణాభివృద్ధికి దోహదపడుతుందని వారు అభిప్రాయపడ్డారు

## పరిష్కారం చూపని గ్రామ సభలు ఎందుకు



మండవల్లి,జూలై 2 (ప్రభాతవార్త) ప్రజా సమస్యల పరిష్కార మార్గంగా సభలు ఉండాల ని,పరిష్కార మార్గం చూపని గ్రామసభలు ఎందుకని ప్ర.ప.ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.ఎస్.భాస్క రరావు,టి.అప్పారావులు ప్రశ్నించారు.మండవల్లి గ్రా మ సచివాలయం ఆవరణలో గురువారం కార్యదర్శి ఎస్.వి.రాధిక ఏర్పాటుచేసిన మండవల్లి గ్రామసభ కు మండల తహసీల్దార్ బాజీ సత్యనారాయణ అధ్యక్ష తన జరిగింది.మండల పరిషత్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ గ్రామంలో మంచినీరు,పారిశుధ్యంపై అధికారులు దృష్టి పెట్టాల న్నారు.నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో ను,ఇతర కారణాలతో అధికారులు పనులు సకాలం లో నిర్వహించలేక పోతున్నారన్నారు.ఎంపీడీవో కె. రమణ బాబు మాట్లాడుతూ మండల కేంద్రమైన మం డవల్లిలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉండటం విచా రించాల్సిన విషయం అని, ఇకనుండి దృష్టి పెట్టి సమ స్యలను పరిష్కరించే దిశగా పనిచేస్తామని సభకు హామీ ఇచ్చారు. గ్రామ సభలో 29 శాఖలకు చెందిన అధికారులు పాల్గొనవలసి ఉండగా కేవలం మూడు నాలుగు శాఖలకు చెందిన వారు మాత్రమే పాల్గొన్నారు.సభలకు హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఐక్యవేదిక సభ్యులు డిమాండ్ చేయగా చర్యలకు వారి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఇకనుండి గ్రామ సభలకు వారం రోజులు ముందే ఆయా శాఖల నుండి నివేదికలను తీసుకోవడం జరుగుతుందన్నారు.మంచినీటి చెరువు అవుట్లెట్ ను అభివృద్ధి చేస్తామని,కొన్ని డ్రైనేజీలను కూడా బాగు చేయిస్తామని, ఎన్ హెచ్ రోడ్డు ప్రక్కల ఉన్న డ్రైనేజీలను ప్రధాన మురుగు కాలువకు అనుసంధానం చేయించేందుకు ఎన్ హెచ్ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని,మండవల్లి పాత పంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న పోలీస్ స్టేషన్ కు అద్దె విషయంపై దృష్టి పెట్టి( వసూలుకు) పరిష్కరిస్తామన్నారు. గ్రామపం పంచాయతీ లో 17 లక్షల 57 వేల రూపాయలు నిల్వ ఉన్నట్లు రాధిక సభలో ప్రకటించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ సురేష్ పాల్గొని మాట్లాడుతూ మండవల్లి లో వివిధ ప్రైవేట్ పాఠశాలల నుండి మన ప్రభుత్వ పాఠ శాలలకు ఈ సంవత్సరం సుమారు 30 మంది విద్యా ర్థినీ విద్యార్థులు చేరటం జరిగిందని వివరించారు.కే వి వి ప్రసాద్,శ్రీనివాస్ తదితరులు ఐక్యవేదిక బృందం పలు సమస్యలపై అర్జీలు అందించడం జరిగింది.

## ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం, కాంగ్రెస్ నేత విజయ్ భాస్కర్



జీలుగుమిల్లి, జూలై-02, (ప్రభాతవార్త) ప్రజా సమస్యలు పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని ఆ పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ బి విజయ్ భాస్కర్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రం జీలుగుమిల్లిలో నియోజకవర్గస్థాయి" కాంగ్రెస్ వారియర్స్ క్రమశిక్షణ ప్రచార కమిటీ" ఏర్పాటు పై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విజయ భాస్కర్ మాట్లాడుతూ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోకుండా వ్యక్తిగత సమస్యలపై దృష్టి సారించిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరచడంలో విఫలమైందన్నారు. నియోజకవర్గంలో నిర్వాసితులు ఎదుర్కొంటున్న ల్యాండ్ టు ల్యాండ్, మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ తన పూర్వ వైభవం సంతరించుకుంటుందని, ఓటు బ్యాంకు మరింత పెరిగి రాబోయే రోజుల్లో తిరుగులేని శక్తిగా రూపుదిద్దుకుంటుందని అన్నారు. నియోజకవర్గంలో ఏడు మండలాలకు పూర్తిస్థాయిలో వారియర్ కమిటీలను, ప్రచార క్రమశిక్షణ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కూనపాము రాజరత్నం, బుట్టాయిగూడెం అధ్యక్షులు సిహెచ్ కుటుంబరావు, పోలవరం అధ్యక్షురాలు ముచ్చిక సీత, వేలేరుపాడు అధ్యక్షులు కొల్లూరి సత్యనారాయణ, కుక్కునూరు అధ్యక్షులు జి రాజులు, వలగాని సమ్మయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన కాత్యాయనీ సమేత గోకర్నే శ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు




అత్తిలి, జూలై 2 (ప్రభాతవార్త ) అత్తిలి మండలం తిరుపతిపురం శివారు శివపురం లో నూతనంగా నిర్మించిన కాత్యాయినీ సమేత గోకర్ణేశ్వర స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళ వాయిద్యాల మధ్య విఘ్నేశ్వర పూజ, వేద పారాయణం, పుణ్యాహావాచనం పంచగవ్యప్రాసన, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, అఖండ దీప సంస్కారం, మండపారాధన, జలాధివాసం కార్యక్రమాలను ర్యా లి శివరామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.శలా రామలింగేశ్వరరావు, తాళ్ల తాతారావు దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమాలలో పాల్గొన్నారు.

## రీ సర్వే ప్రక్రియ వేగవంతం చేయండి



చాట్రాయి, జూలై 2 ప్రభాతవార్త రీ సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని రీ సర్వే పూర్తయిన గ్రామాలలో పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీకి సిద్ధం చేయాలని నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న అన్నారు. మండల తహసిల్దార్ కార్యాలయంలో రీ సర్వేపై గురువారం సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే పూర్తయిన గ్రామాలలో 60 శాతం దాటిన రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసేందుకు జాబితా తయారు చేయాలని చెప్పారు. జులై నెలలో రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇవ్వాలని రీ సర్వే జరుగుతున్న గ్రామాలలో కూడా ఎటువంటి వివాదాలకు తావు లేకుండా చూడాలని చెప్పారు. గ్రామాలలో ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, గ్రామ రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 95% పింఛన్ల పంపిణీ పూర్తి: ఎంపీడీవో త్రిశూలపాణి



మొగల్తూరు, జూలై 2 (ప్రభాతవార్త): మొగల్తూరు మండలంలో జూలై నెలకు సంబంధించిన ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల పంపిణీ 95 శాతం పూర్తయినట్లు మొగల్తూరు ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ, మండల పరిధిలోని 17 గ్రామాల్లో మొత్తం 10,317 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ స్థాయి సిబ్బంది సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. ఇప్పటివరకు 95 శాతం పంపిణీ విజయవంతంగా పూర్తైందని, మిగిలిన 5 శాతం పింఛన్లను కూడా అర్హులైన లబ్ధిదారులకు త్వరలోనే అందజేసి పంపిణీ ప్రక్రియను పూర్తి చేస్తామని ఎంపీడీవో వెల్లడించారు. పింఛన్ల పంపిణీలో సహకరించిన గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటరీ వ్యవస్థకు చెందిన సిబ్బంది, సంబంధిత అధికారులను ఆయన అభినందించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికీ సకాలంలో చేరేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.



రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ సలహాదారులు ఎం. ఏ. షరీఫ్ని వారి ఇంటి వద్ద మర్యాద పూర్వకముగా కలిసిన నర్సాపుర పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజు. నరసాపురం ప్రభాత వార్త


## ద్వారకాతిరుమలలో ఏటీఎంల దుస్థితి నగదు కోసం భక్తులు, స్థానికుల ఇబ్బందులు




ద్వారకాతిరుమల, జూలై 2, ప్రభాతవార్త: ఏలూరు జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల పరిధిలో ఉన్న ఏటీఎంలు సరిగా పనిచేయక పోవడంతో భక్తులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్వారకాతిరుమలలో మూడు కంటే ఎక్కువ ఏటీఎంలు ఉన్నప్పటికీ, అవి నిరంతరం అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. కొన్నిసార్లు ఏటీఎంలలో నగదు లేకపోవడం, మరికొన్నిసార్లు సాంకేతిక సమస్యల కారణంగా సేవలు నిలిచిపోవడం జరుగుతోందని ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా సెలవు దినాలు, శనివారం, ఆదివారం రోజుల్లో భక్తుల రద్దీ మరింత పెరగడంతో సమస్య తీవ్రరూపం దాల్చుతోంది. నగదు రహిత లావాదేవీలు పెరిగినప్పటికీ, కొన్నిసార్లు మొబైల్ నెట్‌వర్క్ సైతం సరిగా పనిచేయకపోవడంతో డిజిటల్ చెల్లింపులు కూడా అంతరాయం కలుగుతున్నాయి. దీంతో అవసరమైన సమయంలో నగదు లేక, ఆన్‌లైన్ చెల్లింపులు చేయలేక భక్తులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. ద్వారకాతిరుమల మండల కేంద్ర బిందువుగా ఉండటంతో నిత్యం స్థానికులు, వ్యాపారులు, పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు. ఈ నేపథ్యంలో బ్యాంకు అధికారులు సమస్యను అత్యవసరంగా గుర్తించి, ఏటీఎంలలో నగదు నిల్వలు మరియు సాంకేతిక నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. భక్తులు, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా బ్యాంకులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం, కాంగ్రెస్ నేత విజయ్ భాస్కర్

జీలుగుమిల్లి, జూలై-02, (ప్రభాతవార్త) ప్రజా సమస్యలు పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని ఆ పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ బి విజయ్ భాస్కర్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రం జీలుగుమిల్లిలో నియోజకవర్గస్థాయి" కాంగ్రెస్ వారియర్స్ క్రమశిక్షణ ప్రచార కమిటీ" ఏర్పాటు పై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విజయ భాస్కర్ మాట్లాడుతూ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోకుండా వ్యక్తిగత సమస్యలపై దృష్టి సారించిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరచడంలో విఫలమైందన్నారు. నియోజకవర్గంలో నిర్వాసితులు ఎదుర్కొంటున్న ల్యాండ్ టు ల్యాండ్, మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ తన పూర్వ వైభవం సంతరించుకుంటుందని, ఓటు బ్యాంకు మరింత పెరిగి రాబోయే రోజుల్లో తిరుగులేని శక్తిగా రూపుదిద్దుకుంటుందని అన్నారు. నియోజకవర్గంలో ఏడు మండలాలకు పూర్తిస్థాయిలో వారియర్ కమిటీలను, ప్రచార క్రమశిక్షణ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కూనపాము రాజరత్నం, బుట్టాయిగూడెం అధ్యక్షులు సిహెచ్ కుటుంబరావు, పోలవరం అధ్యక్షురాలు ముచ్చిక సీత, వేలేరుపాడు అధ్యక్షులు కొల్లూరి సత్యనారాయణ, కుక్కునూరు అధ్యక్షులు జి రాజులు, వలగాని సమ్మయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## అదివారం ధ్యానంపై శిక్షణ కార్యక్రమం

అత్తిలి, జులై 2 (ప్రభాతవార్త ) అత్తిలి లో దాసం వెంకట ప్రసాద్(పెద తాతయ్య) ఇంటి వద్ద ఆదివారం ధ్యానంపై శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ మూమెంట్ నిర్వాహకుడు వ్యాసం వెంకట ప్రసాద్ తెలిపారు. హైదరాబాద్కు చెందిన పిరమిడ్ మాస్టర్ వినీల్ ధ్యానంపై శిక్షణ ఇస్తారని తెలిపారు.


## అల్లూరి ఆశయసాధనకు కృషి చేయాలి

### ర్యాలీని ప్రారంభించిన డీఎస్పీ రఘువీర్ విష్ణు




భీమవరం జులై 2 ప్రభాతవార్త గిరిజనుల హక్కులు, దేశ స్వాతంత్ర్యం, సామాజిక సమానత్వం కోసం తన ప్రాణాలను అర్పించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయాలను నెరవేర్చడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అని డీఎస్పీ రఘువీర్ విష్ణు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వారోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన దేశభక్తి ర్యాలీని డీఎస్పీ రఘువీర్ విష్ణు ప్రారంభించి మాట్లాడారు. తెలుగు జాతికి, భారతదేశానికి ఎనలేని స్ఫూర్తి అందించిన గొప్ప పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు అని అన్నారు. వన్ టౌన్ సిఐ రమేష్, ఆకివీడు సిఐ కాళీ చరణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి గుండెల్లో అల్లూరి సీతారామరాజు చిరకాలం ఉంటారని అన్నారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మన్యం వీరుడి స్ఫూర్తితో దేశాభివృద్ధికి యువత నడుంబిగించాలని, తెలుగు జాతి యుగ పురుషుడు అల్లూరి అని, ఆయన నడిచిన నేలలో నడవడం మనందరం చేసుకున్న అదృష్టమన్నారు. అనంతరం పట్టణంలోని 5 పాఠశాలలు, 2 కళాశాలలో అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రపై వ్యాసరచన వక్తృత్వ పోటీలను నిర్వహించారు. లాంచీల రేవు నుంచి నానో కాలేజ్ రోడ్డు మీదుగా ప్రకాశం చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చేకూరి రవీంద్ర వర్మ, కొత్తపల్లి సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత!



భీమవరం జులై 2 ప్రభాతవార్త పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా కృషి చేయాలని సాగి రామకృష్ణంరాజు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె వి మురళీకృష్ణంరాజు పేర్కొన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వారం రోజులపాటు వనమహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని సృజన వాటిక వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్ కృష్ణ చైతన్య మాట్లాడుతూ వారం రోజులపాటు ఒక్కొక్క రోజు ఒక్కొక్క కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒకరోజు విద్యార్థులకు వివిధ విభాగాలలో పోటీలు కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజేతలకు ఆఖరి రోజున బహుమతి ప్రధానోత్సవం కూడా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సహాయ కోఆర్డినేటర్ డాక్టర్ కె ఎన్ వి సత్యనారాయణ, మెకానికల్ ఎన్ఎస్ఎస్ విభాగం ఇంచార్జ్ మాధవరావు సిఎస్సి నుండి అంజనీ క్రాంతి ,జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.

## ఇరగవరం మండలంలో ప్రారంభమైన విబిజి రాంజీ పథకం



ఇరగవరం, జులై 2( ప్రభాతవార్త ) ఇరగవరం మండలం లో వికసిత భారత్ కు అనుకునే గ్రామాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వీబీజీ రాంజీ పథకాన్ని మండలం లో ప్రారంభించినట్లు ఎంపీడీవో ఏ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు గ్రామాలలో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రత్యేక అధికారులు, గ్రామ అభివృద్ధి అధికారులు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పేకాట కేసుల నేపథ్యంలో వ్యక్తిపై బైండోవర్ కేసు నమోదు

మొగల్తూరు, జూలై 2 (ప్రభాతవార్త): పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం పాతపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి. వాసు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో కొంతకాలంగా సదరు వ్యక్తి వరుసగా పేకాటకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నట్లు పోలీసుల నిఘాలో తేలిందన్నారు. ఈ నేపథ్యంలో అతనిపై నిరంతర నిఘా ఉంచి, ముందస్తు చట్టపరమైన చర్యల్లో భాగంగా బైండోవర్ కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే కార్యకలాపాలు, పేకాట వంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఎస్సై జి. వాసు హెచ్చరించారు. ప్రజలు చట్టాలను గౌరవించి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

## కలటూరు వికసిత్ భారత్--రామ్ జీ కార్యక్రమం



ఆగిరిపల్లి జూలై 2 ప్రభాతవార్త ఆగిరిపల్లి మండలంలోని కలటూరు గ్రామ పంచాయతీలో గురువారం వికసిత్ భారత్--రామ్ జీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోనిగ్రామ సచివాలయాల్లో అవగాహన బ్యానర్లు ఏర్పాటు చేసి కార్యక్రమం లక్ష్యాలు, ప్రయోజనాలపై ప్రజలకు వివరించారు. ఎంపీడీవో అబ్దుల్ సలాం, ఉపాధి హామీ పథకం మండల అధికారి షేక్ ఖాజావలి లు మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో అబ్దుల్ సలాం మాట్లాడుతూ, గ్రామాల సమగ్ర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడమే వికసిత్ భారత్--రామ్ జీ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఉపాధి హామీ పథకంలో గతంలో 100 రోజులుగా ఉన్న పనిదినాలను 125 రోజులకు పెంచినట్లు తెలిపారు. అలాగే కూలీల రోజువారీ వేతనాన్ని రూ.307 నుంచి రూ.312కు పెంచి అమలు చేస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటూ గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం మండల అధికారి షేక్ ఖాజావలిమండల అధ్యక్షుడు నక్కనబోయిన వేణు, కార్యదర్శి సాంబశివరావు, కూటమి నాయకులు, అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఇన్‌చార్జి డీఆర్ఓగా పెంచల ప్రభాకర్ బాధ్యతల స్వీకరణ



భీమవరం జూలై 2 ప్రభాతవార్త పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారిగా పెంచల ప్రభాకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పెంచల ప్రభాకర్ కి అభినందనలు తెలియజేస్తూ, జిల్లా పరిపాలనలో డీఆర్ఓ బాధ్యతలు అత్యంత కీలకమైనవని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం సమిష్టి కృషి, సమన్వయంతో ఇప్పటివరకు పశ్చిమగోదావరి జిల్లాను వివిధ రంగాల్లో రాష్ట్ర స్థాయిలో ముందంజలో నిలిపామని తెలిపారు. ఇదే స్ఫూర్తితో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడానికి కృషి చేయాలని సూచించారు. జిల్లా పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం, సమయపాలనకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించే దిశగా అన్ని శాఖలతో సమన్వయం చేసుకొని పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. ఇప్పటి వరకు జిల్లా రెవెన్యూ అధికారిగా విధులు నిర్వహించిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి జూన్ 30, 2026న వయోపరిమితి కారణంగా పదవీ విరమణ చేయడంతో డీఆర్ఓ పదవి ఖాళీ అయింది. ఆ ఖాళీ స్థానంలో పెంచల ప్రభాకర్ కి ఇన్‌చార్జి డీఆర్ఓగా బాధ్యతలు అప్పగించారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం పెంచల ప్రభాకర్ మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో ప్రభుత్వ విధానాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

## టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే అంజిబాబు, మాజీ ఎంపీ సీతారామలక్ష్మి




భీమవరం జులై 2 ప్రభాతవార్త ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేనివని, దేశం కోసం, రాష్ట్రం కోసం సర్వస్వాన్ని త్యాగం చేసిన మహనీయుడు ప్రకాశం పంతులు అని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం ప్రకాశం చౌక్ లో విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహాన్ని ఎమ్మెల్యే అంజిబాబు, రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యం, ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు టంగుటూరి ప్రకాశం పంతులు చేసిన కృషిని మరువలేనిదన్నారు. భీమవరంలో ఆయన నమ్మకరణంతొ ఉన్న ప్రకాశం చౌక్ సెంటర్ లో ప్రకాశం పంతులు విగ్రహాన్ని ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూప్రకాశం పంతులు క్విట్ ఇండియా ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం వంటి వివిధ ఉద్యమాలలో పాల్గొని తన ధైర్యసాహసాలను, నిబద్ధతను ప్రదర్శించారన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు 1953 సంవత్సరంలో ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి అయ్యారన్నారు. 90 ఏళ్ల తర్వాత భీమవరంలో ప్రకాశం పంతులు విగ్రహాన్ని ఆవిష్కరించడం ఆనందదాయకమన్నారు. నిర్మాణ కమిటి అధ్యక్ష, కార్యదర్శులు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఆగస్టు 23న టంగుటూరి జయంతి సందర్భంగా భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, 90 ఏళ్ల క్రితం ప్రకాశం పంతులు భీమవరం వచ్చారని, అప్పటి నుంచి ఈ ప్రాంతానికి ప్రకాశం చౌక్ గా నామకరణం చేశారని అన్నారు. ప్రజా ప్రతినిధులు సహకారం, దాతల సౌజన్యంతో ఈ ప్రాంతంలో ప్రకాశం పంతులు విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. కార్యక్రమంలో మెంటే పార్థసారధి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, వబిలిశెట్టి రామకృష్ణ, నిర్మాణ కమిటీ ఉపాధ్యక్షులు చెరుకుపల్లి సంతోష్, వబిలిశెట్టి కనకరాజు, అరసవల్లి సుబ్రమణ్యం, నందమూరి రాజేష్, పద్మనాభం, తాడిమళ్ళ గిరి, అడబాల రామకృష్ణ, గన్నాబత్తుల శ్రీనివాస్, వబిలిశెట్టి ప్రసాద్ రావు, కారుమూరి సత్యనారాయణ మూర్తి, మైలబత్తుల ఐజాక్ బాబు, ఎద్దు ఏసుపాదం, బ్రహ్మజ్యోసుల సుబ్రమణ్యం బ్రహ్మజ్యోసుల ప్రసాద్, బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కాకరవాడలో విబిజి రాంజీ పనులు ప్రారంభం



ముదినేపల్లి జూలై 2 (ప్రభాతవార్త) మండలంలోని కాకరవాడ గ్రామంలో వికసిత్ భారత్ -- జీ రామ్ జీ కార్యక్రమాన్ని (గ్రామీణ) పనులను మాజీ ఎంపీటీసీ వరలక్ష్మి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత ప్రభుత్వం 2025 కొత్త చట్టం ప్రకారం 100 రోజుల పనిదినాలు 125 రోజులకు పెంచడం జరిగిందన్నారు. అలాగే డైలీ వేతనాలను 300 రూపాయల నుండి 409 రూపాయలకు పెంచడం జరిగిందని గుర్తు చేశారు.ఈ పథకాన్ని ప్రజలు అందరూ ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మారగాని నాగేశ్వరరావు, పడమటి పాము, వేముల వెంకటేశ్వరరావు, మరియు ఉపాధి శ్రామికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రీ సర్వేలో ప్రజలకు ఇబ్బంది కలగకూడదు: జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి



కాళ్ల, జూలై 2( ప్రభాతవార్త) ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో రీ-సర్వే పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. మండలంలోని కలవపూడి సచివాలయాన్ని జాయింట్ కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. గ్రామంలో రీ సర్వే ప్రక్రియ, భూ హద్దుల నిర్ధారణ, రికార్డుల నమోదు, ప్రజలకు అందిస్తున్న సేవలపై జాయింట్ కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రీసర్వే రికార్డును తనిఖీ చేశారు.ప్రభుత్వ భూములు, పోరంబోకు భూములపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రౌండ్ ట్రూత్‌ఇంగ్ పనులు ఏ విధంగా జరుగుతున్నవి పరిశీలించారు. భూ యజమానుల అభ్యంతరాలు, ఫిర్యాదులను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహసిల్దార్ సుందర్ సింగ్, మండల సర్వేయర్, సిబ్బంది పాల్గొన్నారు

## పరిష్కారం చూపని గ్రామ సభలు ఎందుకు




**మండవల్లి,జూలై 2 (ప్రభాతవార్త)** ప్రజా సమస్యల పరిష్కార మార్గంగా సభలు ఉండాల ని,పరిష్కార మార్గం చూపని గ్రామసభలు ఎందుకని ప్ర.ప.ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.ఎస్.భాస్క రరావు,టి.అప్పారావులు ప్రశ్నించారు.మండవల్లి గ్రా మ సచివాలయం ఆవరణలో గురువారం కార్యదర్శి ఎస్.వి.రాధిక ఏర్పాటుచేసిన మండవల్లి గ్రామసభ కు మండల తహసీల్దార్ బాజీ సత్యనారాయణ అధ్యక్ష తన జరిగింది.మండల పరిషత్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ గ్రామంలో మంచినీరు,పారిశుధ్యంపై అధికారులు దృష్టి పెట్టాల న్నారు.నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో ను,ఇతర కారణాలతో అధికారులు పనులు సకాలం లో నిర్వహించలేక పోతున్నారన్నారు.ఎంపీడీవో కె. రమణ బాబు మాట్లాడుతూ మండల కేంద్రమైన మం డవల్లిలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉండటం విచా రించాల్సిన విషయం అని, ఇకనుండి దృష్టి పెట్టి సమ స్యలను పరిష్కరించే దిశగా పనిచేస్తామని సభకు హామీ ఇచ్చారు. గ్రామ సభలో 29 శాఖలకు చెందిన అధికారులు పాల్గొనవలసి ఉండగా కేవలం మూడు నాలుగు శాఖలకు చెందిన వారు మాత్రమే పాల్గొన్నారు.సభలకు హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఐక్యవేదిక సభ్యులు డిమాండ్ చేయగా చర్యలకు వారి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఇకనుండి గ్రామ సభలకు వారం రోజులు ముందే ఆయా శాఖల నుండి నివేదికలను తీసుకోవడం జరుగుతుందన్నారు.మంచినీటి చెరువు అవుట్లెట్ ను అభివృద్ధి చేస్తామని,కొన్ని డ్రైనేజీలను కూడా బాగు చేయిస్తామని, ఎన్ హెచ్ రోడ్డు ప్రక్కల ఉన్న డ్రైనేజీలను ప్రధాన మురుగు కాలువకు అనుసంధానం చేయించేందుకు ఎన్ హెచ్ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని,మండవల్లి పాత పంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న పోలీస్ స్టేషన్ కు అద్దె విషయంపై దృష్టి పెట్టి( వసూలుకు) పరిష్కరిస్తామన్నారు. గ్రామపం పంచాయతీ లో 17 లక్షల 57 వేల రూపాయలు నిల్వ ఉన్నట్లు రాధిక సభలో ప్రకటించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ సురేష్ పాల్గొని మాట్లాడుతూ మండవల్లి లో వివిధ ప్రైవేట్ పాఠశాలల నుండి మన ప్రభుత్వ పాఠ శాలలకు ఈ సంవత్సరం సుమారు 30 మంది విద్యా ర్థినీ విద్యార్థులు చేరటం జరిగిందని వివరించారు.కే వి వి ప్రసాద్,శ్రీనివాస్ తదితరులు ఐక్యవేదిక బృందం పలు సమస్యలపై అర్జీలు అందించడం జరిగింది.

## గ్రామీణాభివృద్ధే దేశాభివృద్ధికి పునాది : ఎమ్మెల్యే చిర్రి



**జీలుగుమిల్లి, జూలై-01, (ప్రభాతవార్త)** గ్రామీణాభివృద్ధే దేశాభివృద్ధికి పునాది పోలవరం శాసనసభ్యులు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. గురువారం మండలంలోని చంద్రమ్మకాలనీ గ్రామంలో నిర్వహించిన వికసిత్ భారత్ – – జీ రామ్ జీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన ఆయన, కార్మికులతో కలిసి పలుగు, పార పట్టి తట్టలో మట్టి నింపుతూ శ్రమదానం చేసి వారికి ప్రోత్సాహం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, సహజ వనరుల పరిరక్షణ, పేద కుటుంబాలకు ఉపాధి కల్పించడం వంటి లక్ష్యాలతో ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ కార్మికులకు ఉపాధి కల్పించడమే కాకుండా, గ్రామాలకు శాశ్వత ప్రయోజనం చేకూర్చే అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. అనంతరం కార్మికులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పనుల నిర్వహణ, వేతనాల చెల్లింపు, అవసరమైన సౌకర్యాల కల్పనపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కూరం వెంకటేశ్వరరావు, మొడియం వెంకటకృష్ణ,బండారు అనిల్, రూపా సత్యనారాయణ, శేఖముడి సాయి, చిర్రి వెంకటేశ్వరావు, కొండపల్లి ప్రసాద్,కక్కిరాల మురళి,మధు, సిరిబత్తుల స్వామి, సూరిశెట్టి మహేష్, గద్దె సుబ్రహ్మణ్యం, ఉండవల్లి కిరణ్,గారపాటి శ్రీను, గణేష్, అధికారులు ఏపీవో జాన్ వెస్లీ, టీఏ దుర్గారావు, సిబ్బంది, పాల్గొన్నారు

## ఎరువుల పంపిణీని పరిశీలించిన వ్యవసాయ అధికారి



**చాట్రాయి, జులై 2 ప్రభాతవార్త** చాట్రాయి మండలంలోని నరసింహా రావు పాలెం సహకార సంఘంలో యూరియా మరియు డి ఏ పి ఎరువుల పంపిణీ ప్రక్రియను మండల వ్యవసాయ అధికారి బి శివశంకర్ పరిశీలన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపీ ఎయిమ్స్ 2.ఉ వెబ్సైట్ ద్వారా రైతులకు ఎరువులు పంపిణీ గురించి రైతులతో చర్చించి వాటి వివరాలను తెలియ చేశారు. వెబ్సైట్ నందు రైతు ఆధార్ నెంబరు ఎంటర్ చేసిన వెంటనే ఓటీపీ ధ్రువీకరణతో పంట విస్తీర్ణము,పంట రకము ఆధారంగా రైతులకు దఫాల వారీగా డి ఏ పి, యూరియా కేటాయించబడిన వివరములు రైతులకు కనబడతాయని ఆయన తెలిపారు. రైతులకు కేటాయించిన ఎరువులు సులభంగా పొందవచ్చున్నారు. ఏపీ ఎయిమ్స్ వెబ్సైటు నందు కౌలు రైతులు,వెబ్ ల్యాండ్ లో లేని భూమి పాసుబుక్ పొందని సాగుచేయి రైతుల కూడా ఎరువులను పొందుటకు సులభతరమని సందేహాలు ఉంటే రైతు సేవ కేంద్రంలో సంప్రదించి మీ పంట వివరాలను తెలిపి కచ్చితంగా పంటలు వివరాలను సరిచూసు కోవాలని తెలిపారు. ప్రతి గ్రామంలో గ్రామ వ్యవసాయ మరియు ఉద్యానవన సహాయక అధికారులు విస్తీర్ణము, పంటలను వివరములను మార్చుకొనవచ్చునని తెలిపారు.

## సూర్యనారాయణ ఆరోపణల్లో వాస్తవం లేదు

### మోటుపల్లి కుటుంబ సభ్యుల వివరణ



**మొగల్తూరు, జూలై 2 (ప్రభాతవార్త):** మొగల్తూరు మండలం కొత్త గ్రామంలో భూవివాదానికి సంబంధించి తమపై పడమట సూర్యనారాయణ చేసిన ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని మోటుపల్లి రంగారావు, మోటుపల్లి రామకృష్ణ, మోటుపల్లి ధర్మారావులు స్పష్టం చేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు తమ వాదనను వెల్లడించారు. వారి కథనం ప్రకారం, జూన్ 28న కొత్త గ్రామ పరిధిలోని ఆర్.ఎస్ 24/3లో ఉన్న తమకు చెందిన 4.06 ఎకరాల వ్యవసాయ భూమిని జేసీబీతో చదును చేసే సమయంలో సరిహద్దు భూయజమాని పడమట సూర్యనారాయణ, ఆయన భార్య వచ్చి గొడవకు దిగారని తెలిపారు. అనంతరం తాము దాడి చేసి ఇల్లు కూల్చివేయడానికి ప్రయత్నించామని తప్పుడు ఆరోపణలు చేస్తూ తమపై అక్రమ కేసులు నమోదు చేయించారని ఆరోపించారు. ఈ ఘటనపై తాము కూడా అదే రోజు మొగల్తూరు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ, పోలీసులు తమ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకోకుండా పడమట సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మాత్రమే కేసు నమోదు చేశారని వారు వాపోయారు. తమ ఫిర్యాదును కూడా స్వీకరించి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉండగా, అలా చేయకపోవడం వల్ల తమకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. ఈ ఘటనతో ఎలాంటి సంబంధం లేని మోటుపల్లి రాంబాబునారాయణ పేరును కూడా కేసులో చేర్చడం ఆశ్చర్యకరమని తెలిపారు. తమ కుటుంబం ఎప్పుడూ గొడవలు, ఘర్షణలు లేదా వివాదాలకు పాల్పడలేదని, ఉద్దేశపూర్వకంగానే తమ కుటుంబ ప్రతిష్ఠను భంగం కలిగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. పడమట సూర్యనారాయణ తమపై చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని పేర్కొన్న వారు, తమ ఫిర్యాదు పై కూడా పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

## కైకలూరు ఓటర్లకు రెవిన్యూ విజ్ఞప్తి

**కైకలూరు జూలై 2 (ప్రభాతవార్త)** కైకలూరు గ్రామ ఓటర్లకు రెవిన్యూ అధికారులు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.కైకలూరు గ్రామంలో ఓటర్ లిస్టుల నందు పేరు నమోదైనవారు ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశమునకు తరుచూ తరలిపోవడం వలన ఎన్యూమరేషన్ ఫారం లు అందజేయగానికి బూత్ స్థాయి అధికారులకు ఓటర్ యొక్క అడ్రస్ లు తెలియరావడం లేదు. కావున సదరు ఎన్యుమరేషన్ ఫారాలు అందని ఓటర్ లు కొరకు కైకలూరు గ్రామంలో గల రమణ థియేటర్ ఎదురుగా గల తహశీల్దార్ వారి కార్యాలయము నందు 4వ తేదీ శనివారం ఉదయం 9:00 నుండి 5వ తేదీన ఆదివారం సాయంత్రం 6:00 గంటల వరకు సహాయక కేంద్రములను ఏర్పాటు చేయడం జరిగినదన్నారు. కావున ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారాలు అందని మీ యొక్క లేదా మీ కుటుంబ సభ్యుల ఓటు కార్డు ను తీసుకొని వచ్చి మీ యొక్క ఎన్యుమరేషన్ ఫారం లను తీసుకోవలసినది. మరియు కైకలూరు లో ఓటుహక్కు కలిగిన 42 సంవత్సరాల లోపు వయసు గల కైకలూరు గ్రామ కోడళ్ళు అందరూ ఓటర్లు యొక్క తల్లి దండ్రుల ప్రస్తుత ఓటు గుర్తింపు నెంబర్ లను తప్పనిసరిగా తెలుసుకుని బూత్ స్థాయి అధికారులకు సహకరించవలసినదిగా విజ్ఞప్తి చేశారు. ఈ యొక్క ఎన్యుమరేషన్ ఫారం ను తీసుకొనని ఓటర్లు పై ఎన్నికల సంఘం వారు తీసుకొను తదుపరి చర్యలకు ఓటర్ల బాధ్యులు కాగలరని తెలియజేశారు.

## సర్ కార్యక్రమం పై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

### సబ్ కలెక్టర్ వినూత్న



**చాట్రాయి, జూలై 2 ప్రభాతవార్త** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహిస్తున్న సర్ కార్యక్రమంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న హెచ్చరించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఓటర్ల సవరణ కార్యక్రమం పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్ కార్యక్రమం లో వేగవంతం చేయాలని ఈనెల 14 లోపు పూర్తిచేయాలని ఆమె ఆదేశించారు. ఓటర్ల సవరణ నిష్పక్షపాతంగా జరగాలని ప్రతి ఇంటికి వెళ్లి స్వయంగా ఓటర్లను కలిసి సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని చెప్పారు. మండలంలో ఇప్పటివరకు 50 శాతమే పూర్తి చేయడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం ప్రోగ్రెస్ రిపోర్టును తమకు అందజేయాలని ఆమె తెలిపారు. బి ఎల్ వో ల బాధ్యతగా పనిచేయాలని లేనిపక్షంలో శాఖా పరమైన చర్యలు తప్పవని ఆమె ఆచరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి రాజు, తహసిల్దార్ శ్వేత, బి ఎల్ వోలు పాల్గొన్నారు.

## కార్మికోద్యమాన్ని విస్తరించి బలోపేతం చేయాలి

### ఎఐటియుసి నేతల పిలుపు





**తాడేపల్లిగూడెం జులై 2 (ప్రభాతవార్త)** కార్మికోద్యమాన్ని మరింతగా విస్తరింప చేసి సంస్థాగతంగా బలోపేతం చేయటం ద్వారానే కార్మిక హక్కులను కాపాడుకోగలమని ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ పిలుపునిచ్చారు. ఎఐటియుసి తాడేపల్లిగూడెం ఏరియా సమితి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని స్థానిక సిపాయిపేటలోని భవన నిర్మాణ కార్మికసంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఏరియా సమితి అధ్యక్షుడు ఓసూరి వీర్రాజు మాట్లాడుతూ లేబర్ కోడ్లు అమల్లోకి వచ్చిన తర్వాత కార్మికుల పరిస్థితి మరింతగా దిగజారిందన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఉన్న కొద్దిపాటి ఉద్యోగ భద్రత ప్రమాదంలో పడిందని, మరిన్ని పోరాటాల ద్వారానే కార్మిక హక్కులను కాపాడుకోగలమని సూచించారు. ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ మాట్లాడుతూ పాలకవర్గాలు కార్మికవర్గాన్ని అణచివేయడానికి , కార్మికోద్యమాన్ని నీరుగార్చడానికి గట్టి ప్రయత్నం చేస్తున్నాయని తెలిపారు. సమస్యలపై తక్షణ పోరాటాలకు పూనుకోవాలని, కార్మిక సంఘాలను మరింతగా బలోపేతం చేయాలని , కార్మిక సంఘాలను, రికార్డులను, సక్రమంగా నిర్వహించుకోవాలని సూచించారు. దేశంలో మారిన కార్మిక చట్టాల స్వరూప స్వభావాలపై సభ్యులకు అవగాహన కల్పించాలని కోరారు. ఏరియా సమితి కార్యదర్శి మందలపర్తి హరీష్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఎఐటియుసి ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని, పోరాటాల్లో కార్మికుల భాగస్వామ్యాన్ని అధికంగా పెంచాలని కోరారు, కార్మిక జీవితాలు మెరుగుపడాలంటే కార్మికోద్యమం పటిష్టంగా ఉండాలని వివరించారు. అనంతరంమున్సిపల్ కార్మికుల చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, మెడికల్ , ఆటో , హమాలీ , భవన నిర్మాణ రంగాల్లో చేపట్టిన ఉద్యమాలను జయప్రదం చేయాలని సమావేశం నిర్ణయించింది. ఈకార్యక్రమంలో ఏరియా సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కళింగ లక్ష్మణరావు, కార్యనిర్వాహక కార్యదర్శి కే.లక్ష్మీనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాడికొండ శ్రీనివాసరావు, భవన నిర్మాణ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ , యూనియన్ నాయకులు కోడె సాయి బాలాజీ, మాదాసు సత్యనారాయణ, మేళం నాగరాజు, టి. కృష్ణంరాజు, యాళ్ళ శ్రీనివాస్, సత్తిశెట్టి అప్పలరాజు, బి.రామ్మోహన్, కొడమంచిలి చంద్రరావు, మార్లపూడి కాటమరాజు , కోటుం నాగేశ్వరరావు, ఎ వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వర స్వామివారిని దర్శించుకున్న వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి)



**తాడేపల్లిగూడెం జులై 2 (ప్రభాతవార్త)** తాడేపల్లిగూడెం మండలంలోని జగన్నాధపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో విఘ్నేశ్వర స్వామివారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని తెదేపా నియోజకవర్గ ఇంచార్జ్, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి) దర్శించుకున్నారు. తేజఅమృత్ ఆక్వా వాటర్ ప్లాంట్ ఆటోనగర్ లో నూతనంగా ఏర్పాటుచేసిన తేజఅమృత్ ఆక్వా వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి) పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆకాశపు స్వామి, పరిమి రవికుమార్, పోతుల అన్నవరం, పరిమి వీరభద్రరావు, కంటమని గంగరాజు, గూడవల్లి శ్రీనివాస్, వెలుగట్ల రాము, బొల్లిన రామకృష్ణ, చిట్టూరి బాపన్న, మంద వినయ్, పారిచర్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## లింగన బోయిన చర్లలో భూమిని పరిశీలించిన డీఐజీ మాధవి



**నరసాపురం జులై 2 ప్రభాతవార్త** స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ డిఐజి ఎన్ మాధవి గురువారం సాయంత్రం నరసాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించారు. సబ్ రిజిస్టర్ మట్టా జీవన్ బాబు హెడ్ క్లర్క్ నిరంజన్ ఆమె ను స్వాగతించి పుష్ప గుచ్చం తో సత్కరించారు. డీఐజీ నరసాపురం మండలం లింగన బోయిన చర్ల గ్రామంలో భూమి ధర పరిశీలించే విషయంలో ఎనామిలి ఇన్స్పెక్షన్ నిర్వహించారు. సబ్ రిజిస్టర్ జీవన్ బాబుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు. భూమి మార్కెట్ వేల్యూ నిర్ధారించే విషయంలో హెచ్చుతగ్గులు ఉన్నప్పుడు ఎవరైనా కక్షిదారు పరిశీలనకు దరఖాస్తు చేసినప్పుడు ఎనామిలి దర్యాప్తు జరుపు తారని ఈ విషయంలో డీఐజీ రావడం జరిగిందని సబ్ రిజిస్టర్ స్పష్టం చేశారు.

## రామాలయం పునర్నిర్మాణం



**కాళ్ళ జులై,2 (ప్రభాతవార్త)** మండల కేంద్రమైన కాళ్ళలో నూతన రామాలయం నిర్మాణానికి గనిశెట్టి ఆదినారాయణ- కుమారి దంపతులచే శంకుస్థాపన చేశారు. సుమారు 130 సంవత్సరాల క్రితం నిర్మించిన దేవాలయం ఇటీవల కాలంలో రోడ్ల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా తొలగించారు. దాని స్థానంలో నూతన ఆలయం (పునర్నిర్మాణం) నిర్మించడానికి చర్యలు తీసుకున్నారు. డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు గ్రామస్తులందరిని సఖ్యతపరచి నూతన రామాలయం నిర్మించే ప్రదేశాన్ని ఎంపిక చేశారు. ఆ ప్రాంతంలో గుండా బత్తుల నాగేశ్వరరావు ఆరు సెంట్లు స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. సోమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ పన్నాసి వెంకటేశ్వరరావు సుమారు 179 ట్రాక్టర్ల మట్టిని విరాళం ఇచ్చారు. గ్రామస్తుల దాతల సహాయ సహకారాలతో ఆలయ నిర్మాణం చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండా బత్తుల నాగేశ్వరరావు, పన్నాసి వెంకటేశ్వరరావు, కోటి ఒరంగారావు, మేక కాశీ చరణ్, గనిశెట్టి పుండరీకాక్షుడు, సుంకర కాశీ విశ్వేశ్వర రావు, శేషు, దిలీప్, రాజకీయ పార్టీ నాయకులు, యువత, పెద్దలు పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ రోజ్‌గార్ గ్యారంటీ - అభిజికా మిషన్ గ్రామీణ్

- విబిజీరాంజీ) పథకాన్ని బంగారుగూడెంలో ప్రారంభించిన జిల్లా కలెక్టర్
- సంవత్సరానికి 125 పనిదినాలు , రూ.312 దినసరి కూలీ
- ఉద్యానవన పంటలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు
- రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**తాడేపల్లిగూడెం జులై 2 (ప్రభాతవార్త)** తాడేపల్లిగూడెం మండలంలోని బంగారుగూడెం గ్రామంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ రోజ్‌గార్ గ్యారంటీ – అభిజికా మిషన్ గ్రామీణ్ (విబిజీరాంజీ) పథక ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా హాజరై గురువారం లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముందు రైతు బొట్టా నాగేశ్వరరావు వ్యవసాయ క్షేత్రంలో జిల్లా కలెక్టర్ పామ్ ఆయిల్ మొక్కలను నాటి, ఉద్యానవన పంటల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ గతంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్)గా అమలైన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించి, జూలై 1, 2026 నుంచి "వికసిత్ భారత్ రోజ్‌గార్ గ్యారంటీ -- అభిజికా మిషన్ గ్రామీణ్ (విబిజీరాంజీ)" పేరుతో అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కొత్త పథకం కింద గ్రామీణ కుటుంబాలకు సంవత్సరానికి 125 పనిదినాలు కల్పించడంతో పాటు, దినసరి కూలీని రూ.312కు పెంచినట్లు వెల్లడించారు. గ్రామీణాభివృద్ధి, జీవనోపాధి, సహజ వనరుల పరిరక్షణ, విపత్తుల నివారణకు సంబంధించిన మొత్తం 318 రకాల పనులు ఈ పథకం ద్వారా చేపట్టవచ్చున్నారు. వాటిలో నీటి భద్రత విభాగంలో - 107 పనులు, గ్రామీణ మౌలిక సదుపాయాల విభాగంలో - 90 పనులు, గ్రామీణ జీవనోపాధి విభాగంలో - 86 పనులు, విపత్తుల నివారణ విభాగంలో - 35 పనులు చేపట్టే అవకాశం ఉందని వివరించారు. ఉద్యానవన పంటల సాగుకు ప్రభుత్వం విస్తృత ప్రోత్సాహకాలు అందిస్తోందని, రైతులు తమ భూముల పరిస్థితులకు అనుగుణంగా వివిధ పంటలను ఎంపిక చేసుకుని సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్, కొబ్బరి, మామిడి, దానిమ్మ, నిమ్మ, సీతాఫలం, నేరేడు, సపోటా, చింత, మునగ తదితర ఉద్యానవన పంటల సాగుకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. కొబ్బరి తోటల్లో అంతర పంటల సాగుకు కూడా ప్రత్యేక ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. మునగ ఆకుల నుంచి తయారయ్యే పొడికి దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో మంచి డిమాండ్ ఉందని, ఇందులో ఐరన్, కాల్షియం, ఫోలిక్ యాసిడ్ వంటి పోషకాలు అధికంగా ఉండటంతో రైతులు మునగ సాగుపై కూడా దృష్టి సారించాలని సూచించారు. రైతులు తమకు అందుబాటులో ఉన్న భూములకు సంబంధించి ఉద్యానవన శాఖ అధికారులతో అంచనాలు (ఎస్టిమేట్లు) సిద్ధం చేయించుకుని, అవసరమైన మొక్కలను ఎంపిక చేసుకొని విబిజీరాంజీ పథకం ద్వారా లభించే ప్రయోజనాలను పొందాలని కోరారు. ఈ ప్రక్రియలో ఫీల్డ్ అసిస్టెంట్లు, విబిజీరాంజీ సిబ్బంది రైతులకు పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ డాక్టర్ కె.సి.హెచ్.అప్పారావు, ఆర్డీవో మన్నే సూర్యారావు, తహసీల్దార్ సునీల్ కుమార్, ఉద్యానవన శాఖ అధికారి పి.శ్రీలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారి నారాయణరావు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి వి.సునీల్, సుబ్బలక్ష్మి, నవాబుపాలెం సొసైటీ అధ్యక్షులు అడపా ప్రసాద్, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రైతులు, విబిజీరాంజీ కూలీలు, అధికారులు పాల్గొన్నారు.

## శస్త్రచికిత్సల్లో రోబోటిక్ మహావిప్లవం

### పశ్చిమగోదావరి జిల్లా వాసులకు యశోద ఆసుపత్రి అత్యాధునిక వైద్య సేవలు



**జంగారెడ్డిగూడెం జూలై 02 ప్రభాత వార్త** వైద్యరంగంలో వస్తున్న సరికొత్త విప్లవాత్మక సాంకేతికత ఇప్పుడు పశ్చిమగోదావరి జిల్లా వాసులకు అందుబాటులోకి వచ్చింది. సంక్లిష్టమైన శస్త్రచికిత్సలను సైతం అత్యంత సులభంగా, సురక్షితంగా మార్చే అత్యాధునిక రోబోటిక్ పరిజ్ఞానంతో యశోద ఆసుపత్రి జంగారెడ్డిగూడెం, ఏలూరు ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ముందుకు వచ్చింది. ఏలూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆసుపత్రి వైద్య నిపుణులు ఈ నూతన చికిత్సా విధానాల వివరాలను వెల్లడించారు. సాంప్రదాయ ఆపరేషన్లతో పోలిస్తే రోబోటిక్ ప్రక్రియలు ఎంతో సురక్షితమైనవని, శరీరంలో కోతలు అతి సూక్ష్మంగా ఉండటం వల్ల రక్తస్రావం, ఇన్ఫెక్షన్ల ముప్పు దాదాపుగా ఉండదని వైద్యులు స్పష్టం చేశారు. ఈ విధానం వల్ల రోగులు తక్కువ నొప్పిని పొందుతూ, అతి తక్కువ సమయంలోనే కోలుకుని సాధారణ జీవితాన్ని గడపవచ్చని భరోసా ఇచ్చారు. అత్యంత సున్నితమైన మెదడు, వెన్నెముక ఆపరేషన్లలో రోబోటిక్ సాంకేతికత సరికొత్త శకానికి నాంది పలికిందని ఆసుపత్రి సీనియర్ మెదడు శస్త్రచికిత్స నిపుణుడు ఉమా శంకర్ తెలిపారు. ఆధునిక ఇమేజింగ్, దిశానిర్దేశ వ్యవస్థల సాయంతో మెదడులోని కణితులను, వెన్నెముక సమస్యలను ఆరోగ్యకరమైన నరాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా అత్యంత కచ్చితత్వంతో తొలగించవచ్చని, తద్వారా ప్రాణాపాయం తగ్గి రోగి వేగంగా కోలుకుంటారని వివరించారు. జీర్ణాశయ శస్త్రచికిత్స నిపుణుడు కృష్ణ చౌదరి మాట్లాడుతూ, కాలేయం, క్లోమం (ప్యాంక్రియాస్), పేగులకు సంబంధించిన ఆపరేషన్లతో పాటు, క్యాన్సర్ కణితులను సంపూర్ణంగా తొలగించడంలో ఈ సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఎముకలు, కీళ్ల మార్పిడి నిపుణుడు రాజేష్ ఐతా మాట్లాడుతూ, త్రిమితీయ (త్రీడీ) సాంకేతికతను ఉపయోగించి ప్రతి ఒక్కరి శరీర నిర్మాణానికి అనుగుణంగా రోబో సహకారంతో కీళ్లను అత్యంత కచ్చితంగా అమర్చవచ్చని, ఆపరేషన్ జరిగిన మరుసటి రోజు నుంచే రోగులు నడిచేలా చేయడం ఈ విధానం ప్రత్యేకత అని వివరించారు. ఈ అత్యాధునిక రోబోటిక్ ఆపరేషన్ల కోసం యశోద ఆసుపత్రిలో అంతర్జాతీయ స్థాయి సదుపాయాలు, ఆధునిక ఆపరేషన్ థియేటర్లు, 24 గంటల పాటు అందుబాటులో ఉండే నిపుణుల బృందం సిద్ధంగా ఉన్నట్లు వైద్యులు ప్రకటించారు. త్వరలోనే మరిన్ని వైద్య విభాగాలకు ఈ సేవలను విస్తరిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి ఏజీఎం నసీరుద్దీన్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ ప్రవీణ్ అబ్బదాసరి తదితరులు పాల్గొన్నారు.

## ఏబీబీ యాక్సిలరేటర్ 2026 పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన ఏపీ నిట్ విద్యార్థులు

### విద్యార్థులను అభినందించిన ఏపీ నిట్ ఇంచార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్ ఎన్.వి రమణారావు, రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్ శంకర్ రెడ్డి




**తాడేపల్లిగూడెం జులై 2 (ప్రభాతవార్త)** ఆసియా బ్రౌన్ బొవేరి (ఏబీబీ) సంస్థ ఆధ్వర్యంలో బెంగళూరులోని ఏబీబీ ఇన్నోవేషన్ సెంటర్లో ఇటీవల నిర్వహించిన ఏబీబీ యాక్సిలరేటర్ 2026 జాతీయ స్థాయి పోటీల్లో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్) విద్యార్థులు అద్భుత ప్రతిభను కనబరిచి రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న వివిధ విద్యా సంస్థల నుంచి 1600కు పైగా జట్లుతోపాటు మొత్తం 14 వేల మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో ఏపీ నిట్ విద్యార్థులు తమ ప్రాజెక్టుతో నిర్వాహకులను మెప్పించి ద్వితీయ స్థానాన్ని సాధించటంతోపాటు రూ 1.50 లక్షల నగదు బహుమతిని దక్కించుకుని నిట్ విద్యా సంస్థకు గర్వకారణంగా నిలిచారు. ఈ ప్రాజెక్ట్ నిర్వహణకు ఏపీ నిట్ అసోసియేట్ డీన్ (ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్స్ సెల్), ఆచార్యులు డాక్టర్ పెద్దపాటి శంకర్ టీమ్ మెంటర్ గా వ్యవహరించారు.

**విద్యార్థుల ప్రాజెక్టు వివరాలిలా....**

నిట్ విద్యా సంస్థలో మూడో సంవత్సరం చదువుతున్న సౌమ్య దీప్ దాస్, బి.కిసాన్ (ఈఈఈ), శివమ్ కుమార్ (మెకానికల్), ఆర్యన్ శ్యామ్ పిల్లై (సీఎస్ఈ) బృందం కలిసి సమిష్టిగా బియాండ్ మానిటరింగ్ ఏఐ ఏజెంట్స్ ఫర్ రియల్‌టైమ్ పాడ్ రిసోర్స్ డిస్కవరీ అండ్ డిపెండెన్సీ మ్యాపింగ్ పేరుతో వినూత్న ప్రాజెక్టును రూపొందించారు. కృత్రిమ మేధస్సు ఆధారంగా క్లౌడ్ వాతావరణంలో పనిచేస్తున్న అతి చిన్న కంప్యూటింగ్ యూనిట్స్ వనరులను తక్షణమే గుర్తించటం, వాటి పరస్పర ఆధారిత సంబంధాలను విశ్లేషించటం కోసం ఈ ప్రాజెక్టును రూపొందించారు. తీవ్ర పోటీ ఉన్న ఈ ప్రాజెక్టుతోనే సంస్థ నిర్వాహకులను మెప్పించి ద్వితీయ స్థానాన్ని, నగదు బహుమతిని గత నెల 26న ఏపీ నిట్ విద్యార్థులు అందుకోవటం విశేషం

**విద్యార్థులకు వెల్లువెత్తిన అభినందనలు**

బెంగళూరులో నిర్వహించిన ఏబీబీ యాక్సిలరేటర్ 2026 జాతీయ స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులను, వారికి మెంటర్ గా వ్యవహరించిన ఆచార్యులు పెద్దపాటి శంకర్ ను ఏపీ నిట్ ఇంచార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్, డాక్టర్ ఎన్.వి.రమణారావు, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, డీన్లు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి, డాక్టర్ ఎన్.జయరామ్, డాక్టర్ హిమబిందు, డాక్టర్ జీబి వీరేష్ కుమార్, ఆయా విభాగాధిపతులు డాక్టర్ శ్రీ ఫణి కృష్ణ కర్రి, డాక్టర్ జి.సంతోష్ కుమార్, డాక్టర్ నగేష్ భట్టు, పలువురు ఆచార్యులు అభినందించారు. ఏపీ నిట్ ఖ్యాతిని జాతీయస్థాయిలో ఇనుమడింపజేయటం అభినందనీయమని కొనియాడారు. వీరి స్ఫూర్తితో మిగిలిన విద్యార్థులు కూడా భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ఇలాంటి విజయాలు సాధించి సంస్థకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని వారు సూచించారు.

## అంగన్వాడి కేంద్రాలను సందర్శించిన ఆర్‌జేడీ సుజాతారాణి



**కైకలూరు, జూలై 2 (ప్రభాతవార్త)** మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకురాలు (ఆర్‌జేడీ) సుజాతారాణి గురువారం మండవల్లి మండలం కొవ్వాడలంక-1 అంగన్‌వాడీ కేంద్రంతో పాటు కైకలూరు మండలంలోని ఎస్టీ కాలనీని సందర్శించారు.ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు ఐవీఆర్ఎస్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్) కాల్స్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అలాగే 0 నుంచి 3 నెలల వయస్సు గల చిన్నారులకు కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత ప్రారంభ బాల్యాభివృద్ధి (ఈసీడీ) ఆరోగ్య పరీక్షలను నిర్వహించి, వారి ఎదుగుదలపై సమీక్షించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు ముర్రుపాలు (కొలస్ట్రం) శిశువుకు అందించడం వల్ల కలిగే ప్రయోజనాలు, తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాల్సిన అవసరం, పోషకాహారం, తల్లి--శిశు ఆరోగ్య సంరక్షణపై విస్తృతంగా అవగాహన కల్పించి కౌన్సెలింగ్ నిర్వహించారు. శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలలో తల్లిపాల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి తల్లి తప్పనిసరిగా తొలి పాలను బిడ్డకు అందించాలని ఆర్‌జేడీ సుజాతారాణి సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ కైకలూరు ప్రాజెక్టు అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలు కాపాడే విషయంలో కఠిన వైఖరి అవసరం



**నరసాపురం జూలై 2 ప్రభాతవార్త** నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ పొత్తూరి రామరాజుని, నరసాపురం రూరల్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కట్టా శారదా సతీష్ నరసాపురం పట్టణంలోని రామరాజు సన్‌రైజ్ ఆఫీస్ నందు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామరాజు ఎస్ఐ కట్టా శారదా సతీష్ కి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలకు సత్వర న్యాయం అందించే విధంగా, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు. ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఇరువురు నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా సేవలకు సంబంధించిన పలు అంశాలపై ఆత్మీయంగా చర్చించారు. ఈ సందర్భంలో నరసాపురం మండల అధ్యక్షులు వాతాడి ఉమా మహేశ్వరరావు, మరియు డిపార్ట్మెంట్ సభ్యులు ఉన్నారు

## 4న డిజిటల్ స్క్రీన్ ప్రారంభం

**భీమవరం జులై 2 ప్రభాతవార్త** విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు 129వ జయంతి సందర్భంగా నూతన డిజిటల్ స్క్రీన్ ప్రారంభిస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు యువజన సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షులు కంతేటి వెంకటరాజు తెలిపారు. అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహం వద్ద నున్న స్మృతి వనంలో అతిథులచే ఉదయం 9 గంటలకు డిజిటల్ స్క్రీన్ ప్రారంభిస్తారని తెలిపారు. అదే విధంగా నరసయ్య అగ్రహారంలో సాయంత్రం 5 గంటలకు అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించడం జరుగుతుందని అన్నారు. ఈ మహోత్సవానికి కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, రాజ్యసభ సభ్యుడు పాక సత్యనారాయణ, మండలి చైర్మన్ కోయ్యే మోషేన్ రాజు, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి లతోపాటు తదితర ప్రముఖులు హాజరవుతున్నారని తెలిపార...

## 2026 ఈఏపిసెట్ లో రాష్ట్రస్థాయి ర్యాంకులతో తిరుమల విద్యార్థులు

**భీమవరం టౌన్, జూలై 2 : ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 2026 ఈ ఏపీసెట్ ఫలితాల.లో భీమవరం తిరుమల జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచినట్లు తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమల రావు తెలిపారు ఎంపీసీ విభాగంలో జి మోనిషా రాష్ట్రస్థాయిలో 91వ ర్యాంకు,ఐ రోహిత్ కుమార్ 146వ ర్యాంకు, కే సందీప్ కుమార్ 168 వర్యాంక్, జి రోషిత్ 194వ ర్యాంక్, జె హాసిక్ లక్ష్మణ్ కుమార్,215వ ర్యాంక్, బి కౌశల్ 220 వ ర్యాంకు, జె శ్రీ సాయి దరహాన్ 223వ ర్యాంక్ , పి వర్షిత్ 307వ ర్యాంక్, ఎన్ హార్షిత్ వర్మ 319వ ర్యాంక్, కే అమృత 375 ర్యాంక్ మరియు బైపీసీ విభాగంలో కే శ్రావ్య రాష్ట్రస్థాయి 104వ ర్యాంక్, పి బోనీ గణేష్ 125 ర్యాంక్, పి జోషిక శ్రీవల్లి 134 ర్యాంక్, జి మనస్విని174 వ ర్యాంక్, జి హాసిని రిత్విక 270వ ర్యాంక్, పి అర్జున్ 323వ ర్యాంక్, వి మంజిత్ రాజారావు 427వ ర్యాంక్ సాధించారు. రాష్ట్రస్థాయి 500 లోపు ర్యాంకులు సాధించిన వారు 21 మంది, వెయ్యిలోపు ర్యాంకులు 36 మంది, 2000 లోపు ర్యాంకులు 66 మంది, 5000 లో పు ర్యాంకులు 155 మంది, 10000 లోపు ర్యాంకులు 272 మంది, 15000 వేల లోపు 356 మంది, 20 000 లో పు 417 మంది సాధించారు . అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు, సంస్థ డైరెక్టర్లు జి సతీష్ బాబు, ఎన్ సాయి రాజు, పి శ్రీనివాస వర్మ ,అభినందించారు. మరియు విద్యార్థుల విజయానికి సహకరించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలియజేశారు

### జంగారెడ్డిగూడెం రోడ్డు ప్రమాదంలో బయ్యనగూడెం యువకుడు దుర్మరణం



**జంగారెడ్డిగూడెం జులై 2 ప్రభాత వార్త** జంగారెడ్డిగూడెం పట్టణం లో బుట్టాయిగూడెం రోడ్డులో గురువారం రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెం గ్రామానికి చెందిన నామాల శీను కుమారుడు నామాల పవన్ (24) పనిమీద జంగారెడ్డిగూడెం పట్టణానికి వచ్చాడు. పనులు ముగించుకుని తిరిగి వెళ్తుండగా, బుట్టాయిగూడెం రోడ్డు వైపు ఇంటికి కి తిరిగి వెళుతుండగా అటుగా వస్తున్న హోమ్లీ వ్యాన్ పవన్ ప్రయాణిస్తున్న వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన పవన్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.